# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 15 అక్టోబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 280 || పేజీలు:12 || వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



## 8 నెలల కష్టం వారంలో నాశనం

### బిట్టూ తబాహి ఆవేదన



2

## ఎన్నికల రిజర్వేషన్ పెండ్లి



2

### పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు

## విద్యుత్ సరఫరా చేయాలె

### రానున్న 20 రోజులు అత్యంత కీలకం

కరెంటు సరఫరాలో అంతరాయాలను సహించేది లేదు

విద్యుత్ అధికారులపై సీఎం తీవ్ర ఆగ్రహం

నిర్లక్ష్యం చేస్తే ఐఏఎస్‌లను సస్పెండ్ చేస్తామని హెచ్చరిక

ఎల్‌నినో కోవిడ్ లాంటి విపత్తు.. అప్రమత్తం కాకపోతే సంక్షోభమే

వచ్చే జూన్ వరకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలి

తాగునీరు, పశుగ్రాసానికి కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు

ప్రతి మండలానికి గ్రూప్-1, గ్రూప్-2 అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ

2



## మీ పెట్టుబడులకు మా భరోసా

### ప్రభుత్వ విధానాలు స్థిరంగా కొనసాగుతాయి

రాబోయే రోజుల్లో తయారీ రంగం విస్తరణపై ప్రత్యేక దృష్టి

ప్రపంచంలోని అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో తెలంగాణ పోటీ

బ్రిటన్ వ్యాపార, పారిశ్రామిక ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి గ్యారంటీ

వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యానికి బ్రిటన్ ప్రతినిధుల ఆసక్తి

### తెలంగాణ వారు గ్లోబల్ లీడర్లుగా ఎదగాలె

ఎన్నికలప్పుడే రాజకీయాలు.. అభివృద్ధిలో కాదు

అందుకే, తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్

సినిమా, రాజకీయరంగాల్లో మున్నూరు కాపులు రాణించారు

యువతతో పాటు మహిళలను ప్రోత్సహించండి

సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026 ప్రారంభోత్సవంలో సీఎం

2

**హైదరాబాద్, అక్టోబర్ 14, (మనం బ్యూరో):** తెలంగాణలో పెట్టుబడులకు పూర్తి భద్రత ఉంటుందని, ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం కొనసాగుతుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బ్రిటన్ వ్యాపార, పారిశ్రామిక ప్రతినిధులకు భరోసా ఇచ్చారు. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయని స్పష్టం చేశారు. బ్రిటన్ వ్యాపార, పారిశ్రామిక ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డితో బుధవారం ఎంసీహెచ్‌ఆర్డీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ దేశంలో అత్యంత యువ రాష్ట్రంగా ఏర్పడ్డ తెలంగాణ అనతికాలంలోనే ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాదించిందన్నారు. తెలంగాణ ఇప్పుడు దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా ప్రపంచంతోనే పోటీ

...మిగతా 2లో

## అచ్చంపేటలో అభివృద్ధి శకం

### రూ.53.78 కోట్లతో సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

అచ్చంపేటకు నాకు 46 సంవత్సరాల అనుబంధం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టీకరణ



**హైదరాబాద్, అక్టోబర్ 14 (మనం న్యూస్):** పుట్టినప్పటి నుంచి వృద్ధాప్యం వరకు ప్రజా ప్రభుత్వం ప్రజలకు వెన్నంటి నిలుస్తుందని, తెలంగాణలో పుట్టడమే అదృష్టంగా భావించేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో బుధవారం ఆయన రూ.53.78 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించ తలపెట్టిన 220/30 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన అచ్చంపేట ప్రాంతంతో తనకున్న నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని

...మిగతా 2లో

### దసరా తరువాత..

## రెండు లక్షల మందితో భారీ బహిరంగ సభ

### 'సర్'కు వ్యతిరేకంగా సీజేపీ, కాంగ్రెస్.. ఎవరి పోరాటం వారిదే

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును హరిస్తామంటే ఊరుకోం

బీజేపీ మతతత్వ పార్టీ...ఆ పార్టీకి వ్యతిరేకంగా ఎవరు పోరాడినా మద్దతిస్తాం

మీడియాతో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చిట్‌చాట్



**హైదరాబాద్, అక్టోబర్ 14 (మనం బ్యూరో):** సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో దసరా తరువాత రెండు లక్షల మందితో మార్చ్‌తో పాటు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. సభ నిర్వహించాలని రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ చెప్పారనీ,

...మిగతా 2లో

### అభివృద్ధిలో వివక్షకు తావులేదు


## అర్హతే ప్రామాణికం

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు స్థానం లేదు

రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



2




## మెడికవర్ ఆసుపత్రిలో అసలేం జరుగుతోంది!

### అక్కడ ఎందుకు ప్రాణాలు పోతున్నాయి?

వ్యాపారమే తప్ప.. వైద్యం లేదా?

ఆ కార్పొ'రేట్'ను కాపాడుతున్నదెవరు?

వైద్య శాఖ అధికారుల ఉదాసీనతకు కారణమేంది?

3

### రైల్వే ఉద్యోగులకు బోనస్ బొనాంజా

78 రోజుల జీతం అదనం

11,40,770 మంది నాన్-గెజిటెడ్ రైల్వే ఉద్యోగులకు లబ్ధి

చేకూరుతుందని ప్రకటించిన కేంద్రం

**ఢిల్లీ, అక్టోబర్ 14:** రైల్వే సిబ్బందికి ఉన్న దాదాపు 11.40 లక్షల మంది రైల్వే సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. ప్రధానమంత్రి అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్.. అర్హులైన

...మిగతా 2లో

### దసరా లోపే..

## బీజేపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ అభ్యర్థిగా రామచందర్‌రావు!

పట్టభద్రులు, నిరుద్యోగ యువతలో గట్టి పట్టు

నల్గొండ-వరంగల్-ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీసీ నేత

**హైదరాబాద్, అక్టోబర్ 14 (మనం బ్యూరో):** త్వరలో జరుగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ అభ్యర్థుల ప్రకటనకు రంగం సిద్ధమైంది. ఎట్టి పరిస్థితుల్లోనైనా గెలుపు గుర్రాలనే ఎన్నికల బరిలో దింపాలనే ఆలోచనతో ఉన్న బీజేపీ అధిష్టానం మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు

...మిగతా 2లో

### గాంధీభవన్‌లో

## బతుకమ్మ వేడుకలు

### సచివాలయంలో



తన సతీమణితో కలిసి పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



పాల్గొన్న మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

2

### జగిత్యాల రైతుకు మహిళా కిసాన్ దివస్ అవార్డు

**హైదరాబాద్, అక్టోబర్ 14:** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్లకు చెందిన మహిళా రైతు విజయ సేంద్రీయ వ్యవసాయంతో సత్తా చాటుతున్నారు. కేవలం ఎకరం భూమిలోనే 14 రకాల కూరగాయలను సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రకృతి అనుకూల సాగు పద్ధతులను అనుసరిస్తున్న ఆమెకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే మహిళా కిసాన్ దివస్ అవార్డుకు ఆమె ఎంపికయ్యారు.

నేడు నిర్వహించనున్న కార్యక్రమంలో విజయకు అవార్డును అందజేయనున్నారు. పరిమిత భూమిలో విభిన్న రకాల కూరగాయలను సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేస్తూ విజయ సాధించిన తీరు ప్రశంసలు అందుకుంటోంది.

### గాంధీ తొలి కార్యక్షేత్రం డర్బన్‌లో

## ఆయుర్వేద మూలికల ఉద్యానవనం

మహాత్ముడి మనవరాలు ఇలా గాంధీ సారథ్యంలో ఏర్పాటు



**జొహాన్నెస్‌బర్గ్, అక్టోబర్ 14:** యువ న్యాయవాదిగా దక్షిణాఫ్రికాలో పని చేస్తున్న కాలంలో మహాత్మాగాంధీ 1904లో డర్బన్‌లో ప్రారంభించిన సమష్టి ఆశ్రమం 'ఫీనిక్స్ సెటిల్మెంట్'లో సంప్రదాయ ఆయుర్వేద మూలికల ఉద్యానవనం ఏర్పాటైంది. మహాత్ముడి మనవరాలు ఇలా గాంధీ సారథ్యంలోని ట్రస్టు ఈ వేదిక ద్వారా పలు సామాజిక అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతోంది. డర్బన్‌లోని భారత కాన్సులేట్ జనరల్, మత.. భాషా హక్కుల కమిషన్ సంయుక్తంగా భారత ఆయుష్ మంత్రిత్వశాఖ సహకారంతో ఇక్కడ భారత్-దక్షిణాఫ్రికా సంప్రదాయ వైద్య సదస్సు,

...మిగతా 2లో

## ఏపీలో స్థానిక ఎన్నికల సందడి షురూ




మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఒకే విడత పోలింగ్

గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు

షెడ్యూల్ విడుదల చేసిన ఏపీ ఎన్నికల అధికారి అనిల్ చంద్ర పునేఠా

**హైదరాబాద్, అక్టోబర్ 14:** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా బుధవారం షెడ్యూల్ విడుదల చేశారు. 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. పురపాలక ఎన్నికలు ఒకే విడతలో జరుగనుండగా, గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జరుగుతాయని పునేఠా ప్రకటించారు. 18 నుంచి

...మిగతా 2లో



## పడవ బోల్తా 14 మంది మృతి

బిహార్‌లో జరిగిన ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి.. పరిహారం ప్రకటన

**పట్నా, అక్టోబర్ 14:** బిహార్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. సుమారు 20 మందితో వెళ్తోన్న పడవ గంగా నదిలో బోల్తా పడడంతో ఈ దుర్ఘటన జరిగింది. 14 మంది మృతి

...మిగతా 2లో

# 8 నెలల కష్టం వారంలో నాశనం

● బిట్టూ తబాహి ఆవేదన

**భోపాల్, అక్టోబర్ 14:** మధ్యప్రదేశ్ లోని అజ్నార్ నదిని ఇటీవల 20ఏళ్ల యువకుడు బిట్టూ తబాహి శుభ్రం చేసిన విషయం పారకులకు విదితమే. దీని కారణంగా దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందడం.. ఆయన్ను ఆదర్శంగా తీసుకున్న పలువురు యువకులు నడుల శుభ్రతకు నడుం బిగించడం తెలిసిందే. ఎనిమిది నెలల పాటు తీవ్రంగా శ్రమించి, టన్నుల కొద్దీ చెత్తను ఒంటిరాగానే తొలగించాడు.

అయితే, శుభ్రం చేసిన కొన్ని వారాలకే మళ్లీ ఆ నది ప్లాస్టిక్ సంచులు, చెత్తతో నిండిపోవడంతో బిట్టూ తీవ్ర ఆవేదన చెందాడు. ఈ విషయాన్ని ఇన్ స్టాలో పంచుకుని ఒకింత ఉద్వేగానికి లోనయ్యాడు.'నా ఎనిమిది నెలల కఠోర శ్రమ ఇలా వృథా అవుతుందని ఎప్పుడూ ఊహించలేదు. నాకు ఈత రాకపోయినా, ప్రత్యేక పరికరాలు లేకపోయినా ఎంతో కష్టపడి నదిని శుభ్రం చేశాను. అయినా ప్రజలు మళ్లీ చెత్తాచెదారంతో కలుషితం చేశారు. కానీ నేను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. మళ్లీ నదిని శుభ్రం చేస్తాను. ఈ పనిని త్వరగా పూర్తి చేయాలంటే ఏం చెయ్యాలో సలహా ఇవ్వండి' అని బిట్టూ నెటిజన్లను కోరాడు. అజ్నార్ నదిలోని ప్లాస్టిక్ సంచులను బయటకు తీస్తున్న దృశ్యాలను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. అతడి పట్టుదలను, నిబద్ధతను నెటిజన్లు అభినందిస్తున్నారు. నదుల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేసేవారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.మధ్యప్రదేశ్లోని రాజ్ గఢ్ జిల్లా బియోరా పట్టణానికి చెందిన సురేంద్ర సింగ్ చౌధరీ (బిట్టూ తబాహి) డిగ్రీ చదువుతున్నాడు. స్థానికంగా ప్రవహించే అజ్నార్ నది ప్లాస్టిక్ వ్యర్థాలతో డంపింగ్ యార్డుగా మారడాన్ని చూసి ఎలాగైనా శుభ్రం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఈత రాకున్నా.. గ్లౌజు, బూట్లు లేకపోయినా.. కొందరు స్నేహితుల సహాయంతో 8 నెలల పాటు నదిలోని వ్యర్థాలు తొలగించి వార్తల్లో నిలిచాడు.

# ఎన్నికల రిజర్వేషన్ పెండ్లి

**సాలూరు, అక్టోబర్ 14:** తమ కుటుంబానికి మున్సిపల్ ఛైర్ పర్సన్ పదవి కోసం ఒక యువకుడు ఉన్నపళంగా పెండ్లి చేసుకున్నారు. అంధ్రప్రదేశ్లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్ ప్రకటన వెలువడిన 24 గంటల్లోనే ప్రేమించిన యువతిని వివాహమాడారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన టీడీపీ నేత, మాజీ కౌన్సిలర్ వైకుంఠపు హర్షవర్ధన్ మున్సిపల్ ఛైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. అధ్యక్ష పీఠం బీసీ మహిళకు కేటాయిస్తూ సోమవారం రిజర్వేషన్ ఖరారైంది. తనకు పోటీ చేసే అవకాశం లేకుండా పోవడంతో మహిళల కోటాలో భార్యనైనా నిలబెట్టాలనుకున్నారు. ఆలోచన వచ్చిందే తడవుగా రంగంలోకి దిగారు. వెంటనే ఇంట్లో పెద్దలను ఒప్పించి ప్రేమించిన యువతి మంజీరను స్థానిక ఆలయంలో మంగళవారం వివాహం చేసుకున్నారు. ఈసారి ఛైర్పర్సన్ ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరగనుండగా.. తన భార్యకు పార్టీ టికెట్ దక్కేలా హర్షవర్ధన్ ప్రయత్నిస్తున్నారు.

# రెండు లక్షల మందితో భారీ బహిరంగ సభ

(మొదటి పేజీ తరువాయి)

దక్షిణాది రెండు రాష్ట్రాల్లో సభలు నిర్వహించాలని హై కమాండ్ నిర్ణయించిందని తెలిపారు. బుధవారం గాంధీభవన్లో పీసీసీ చీఫ్ మీడియా ప్రతినిధులతో చిట్చాట్గా మాట్లాడారు. మహిళా జర్నలిస్టులను అవమానించారని రాహుల్ గాంధీపై చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ మొలకెత్తడానికి వాజ్పేయి, సుష్మాస్వరాజ్ కారణమనీ, వారిద్దరు లేకుండా బీజేపీ మొలకెత్తేదా ? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును హరిస్తామంటే ఊరుకునేది లేదనీ, బీజేపీ మతతత్వ పార్టీ ఆ పార్టీకి వ్యతిరేకంగా ఎవరు పోరాడినా మద్దతిస్తామని స్పష్టం చేశారు. 'సర్'కు వ్యతిరేకంగా సీజేపీ, కాంగ్రెస్ ఎవరి పోరాటం వారిదేననీ, ప్రజాస్వామ్యంలో భాష గౌరవం ఉండాలని సూచించారు. 15 ఏండ్ల నుంచి ఆర్టీసీ ఎన్నికలు లేవనీ, ఓడినా గెలిచినా కార్మికుల శ్రేయస్సుకు కట్టుబడి ఉంటామని తెలిపారు. పట్టభద్రుల ఎన్నికల కోసం సీరియస్గా ప్రయత్నిస్తున్నామనీ, ఈనెల 23న సీఎంతో ఎంసిహెచ్ఆర్డీలో మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పట్టభద్రుల సమావేశం నిర్వహిస్తామన్నారు. ఎర్రవల్లిలో 45 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందో లేదో విచారణలో తేలుతుందనీ, కవిత ఫ్యామిలీ గురించి ఎక్కువగా మాట్లాడుతోందనీ, ఆమె మాట్లాడే మాటలన్నీ వాస్తవాలేనని వ్యాఖ్యానించారు. ఫామ్ హౌస్ల మీద దాడి చేయాలన్నది మా అభిమతం కాదు, నీతి మంతులమని చెప్పుకుంటున్న వాళ్ల గురించి ప్రజలకు అసలు విషయాలు తెలియాలని స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ చేసిన తప్పిదాలు ఆధారాలతో సహా బయటపడుతున్నాయనీ, 2029లో ఎవరు ఓడిపోబోతున్నారనేది ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశం ప్రమాదంలో ఉందనీ, ఆ పార్టీ పాలనలో సామాన్యులకు ఒరిగిందేమీ లేదన్నారు. సంపన్నులకు మాత్రమే రూ.లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారనీ, బీఆర్ఎస్ సింగరేణి గర్జనకు అర్థం లేదని పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ ప్రతి అంశాన్ని రాజకీయం చేశారనీ, సెంటిమెంట్ను రెచ్చగొట్టి టైం పాస్ చేశారని విమర్శించారు. కేంద్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి మెజార్టీతో అధికారంలోకి వస్తుందనీ, కష్టపడ్డ వారికి న్యాయం జరగాలని కార్పొరేషన్ పదవులు ఆలస్యం అవుతున్నాయని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

## ఏపీ స్థానిక ఎన్నికల సందడి షురూ

(మొదటి పేజీ తరువాయి)

పురపాలక నామినేషన్లతో మొదలయ్యే ఎన్నికల ప్రక్రియ.. డిసెంబర్ 2న గ్రామ పంచాయతీ మూడో దశ పోలింగ్తో ముగియనుంది. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు ప్రకటించారు.

## మీ పెట్టుబడులకు పూర్తి భరోసా

(మొదటి పేజీ తరువాయి)

పడుతోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళిక తెలంగాణ రైజింగ్ గురించి సీఎం వివరించారు. గత ఏడాది డిసెంబర్లో ఆవిష్కరించిన ఈ విజన్ డాక్యుమెంట్లో బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. అంతర్జాతీయ నాయకులు, ప్రముఖ ఆర్థికవేత్తలు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తలతో ఈ ప్రణాళిక రూపొందిందన్నారు. కృత్రిమ మేధ విస్తరిస్తున్న నేపథ్యంలో యువతకు ఆధునిక పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని వెల్లడించారు. ప్రముఖ కంపెనీల ప్రత్యక్ష భాగస్వామ్యంతో యువతకు శిక్షణ ఇచ్చేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న భారత్ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ను త్వరలో ఆవిష్కరిస్తామని తెలిపారు. మూసీ నది పునరుజ్జీవం ద్వారా హైదరాబాద్ రివర్ ఫ్రంట్ ఎకానమీ, నైట్ ఎకానమీని అభివృద్ధి చేయాలన్న ప్రణాళికను వివరించారు. సౌత్ యార్క్షైర్ మేయర్ అలివర్ కాపార్డ్ మాట్లాడుతూ యార్క్షైర్ ప్రాంతంలో వివిధ రంగాలకు చెందిన 1.50 లక్షల వ్యాపార సంస్థలు ఉన్నాయన్నారు. దేశంలో అత్యధిక తలసరి జీఎస్డీపీ కలిగిన రాష్ట్రంగా తెలంగాణను ప్రస్తావిస్తూ రెండు ప్రాంతాల ఆర్థిక ప్రయోజనాలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయని చెప్పారు.

## 14 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

చెందారు. వీరిలో అత్యధికులు చిన్నారులు. వైశాలీ జిల్లాలో మంగళవారం సాయంత్రం ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రధానమంత్రి రూ.2లక్షల చొప్పున, రాష్ట్ర ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ రూ.4లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

## ఆయుర్వేద మూలికల ఉద్యానవనం

(మొదటి పేజీ తరువాయి)

ప్రదర్శన నిర్వహించాయి. ఈ సందర్భగా ఉద్యానవన ప్రారంభోత్సవం జరిగింది. ఈ నెల 2వ తేదీన గాంధీ జయంతి నాడు ఆయుర్వేద మూలికల వనం ఏర్పాటు పనులు మొదలుపెట్టి, 11వ తేదీ నాటికి ఒక రూపం తీసుకువచ్చారు. 'ప్రపంచం వాతావరణ పరిరక్షణ చర్యలకు సిద్ధమవుతున్న ఈ తరుణంలో గాంధీజీ ప్రతిపాదించిన సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది' అని డర్బన్లోని భారత దౌత్యాధికారి నితిన్ సుభాష్ యోలా అన్నారు.

# అభివృద్ధిలో వివక్షకు తావులేదు.. అర్హతే ప్రామాణికం

**హైదరాబాద్,అక్టోబర్14(మనం న్యూస్):** గత పాలకుల పదేళ్ళ కాలంలో కేవలం అధికార కుటుంబానికి ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాలకే సంక్షేమ ఫలాలు పరిమితమయ్యాయని, కానీ ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో మాత్రం ఆ పరిస్థితికి పూర్తిగా స్వస్తి పలికామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అధికారంలో ఎవరున్నారనే అంశంతో సంబంధం లేకుండా, ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాన్ని కూడా సొంత నియోజకవర్గంగా భావించి సమగ్రాభివృద్ధిని సాధిస్తున్నామని పొంగులేటి తేల్చిచెప్పారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో రాజకీయాలకు తావులేదని, కేవలం అర్హత మాత్రమే ప్రామాణికమని ఆయన పునరుద్ఘాటించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల టవర్స్కు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు, స్థానిక ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తదితరులతో కలిసి మంత్రి పొంగులేటి ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ నగరంలో ఎకరం భూమి విలువ వందల కోట్ల రూపాయలు పలుకుతున్నప్పటికీ,పేదలు ఎక్కడైతే జీవనం సాగిస్తున్నారో అక్కడే వారికి గౌరవప్రదమైన నివాసాలను కల్పించాలనే సమున్నత లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఉపాధి కోసం నగరానికి వచ్చి జీవనం సాగిస్తున్న పేదలను ఎక్కడికో దూర ప్రాంతాలకు తరలించి వారి పొట్ట కొట్టే విధానాన్ని తమ ప్రభుత్వం మార్చివేసిందని తెలిపారు.

### లక్ష ఇళ్ల నిర్మాణం..

హైదరాబాద్ మహానగర పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే 23 నియోజకవర్గాల్లో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు ఆరు ప్రాంతాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయని ఆయన స్పష్టంచేశారు. మేడ్చల్ నియోజకవర్గంలో మొదటి విడతగా 480 మంది లబ్ధిదారులను ఎలాంటి సిఫార్సులకు తావులేకుండా, పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు స్పష్టం చేశారు. ఆన్లైన్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అప్పటికే సొంత ఇల్లు ఉన్నవారిని మినహాయించి, క్షేత్రస్థాయిలో నిజమైన నిరుపేదలను గుర్తించిన తర్వాతే ఈ పారదర్శక ప్రక్రియను నిర్వహించామని పొంగులేటి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో ఏకంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, త్వరలోనే రెండవ విడత ఇందిరమ్మ టవర్స్ కోసం మరోసారి దరఖాస్తులను స్వీకరిస్తామని ఆయన ప్రకటించారు. కేవలం కాగితాలపై ఇళ్ల కేటాయింపు పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకోకుండా, లబ్ధిదారులకు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి అందిస్తామని మంత్రి లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు. ప్రతి అపార్ట్మెంట్కు సంబంధించిన భూమిలో వాటాను కూడా రిజిస్ట్రేషన్ పత్రాల్లో స్పష్టంగా పొందుపరుస్తామని పొంగులేటి వెల్లడించారు.

### వచ్చే బతుకమ్మ నాటికి..

వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను పూర్తిగా నిర్మించి, వారి చేతుల మీదుగానే ఇళ్ల తాళాలు అందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులైన నిరుపేదలు ఎవరూ నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, రాబోయే తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులతో సహా అర్హులందరికీ న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసి వదిలేసిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కూడా దశలవారీగా పూర్తి చేసి అర్హులకు అందిస్తామని, ఆయా కాలనీల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ఇప్పటికే సుమారు రూ.440 కోట్లు ఖర్చు చేశామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, హౌసింగ్ శాఖ ఎండీ వి.పి. గౌతమ్, కలెక్టర్ మనూచౌదరి తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

**హైదరాబాద్, అక్టోబర్ 14, (మనం బ్యూరో):** గాంధీభవన్లో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను బుధవారం పీసీసీ మహిళా కాంగ్రెస్ విభాగం ఆధ్వర్యంలో గాంధీభవన్లో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సతీమణితో కలిసి పాల్గొన్నారు. పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన ఆడపడుచులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, మన రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. పెద్దలు ఆశీర్వదిస్తూ అందించే 'బతుకు అమ్మా' అనే దీవెనలోనే బతుకమ్మ పండుగ గొప్పతనం ఇమిడి ఉందన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రత్యేకతను చాటి చెబుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తూ పాలన సాగిస్తోందని చెప్పారు. మహిళల అభ్యున్నతి, ఆర్థిక స్వావలంబన, సామాజిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కేంద్రంగా ప్రభుత్వ విధానాలు కొనసాగుతున్నాయని అన్నారు. రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలనీ, ప్రజలంతా సుఖసంతోషాలతో విలసిల్లాలనీ, మహిళలు పురుషులతో సమానంగా ఉన్నత స్థాయికి ఎదగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. కాగా, గాంధీభవన్లో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. మహిళలు బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తూ సంబురాల్లో పాల్గొన్నారు.

# సచివాలయంలో బతుకమ్మ వేడుకలు

**హైదరాబాద్, అక్టోబర్ 14 (మనం న్యూస్):** బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర సచివాలయంలో బుధవారం బతుకమ్మ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. సచివాలయ మహిళా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా విచ్చేశారు. సంఘం అధ్యక్షురాలు రమాదేవి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, అధికారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. రంగురంగుల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలను మధ్యలో ఉంచి, చుట్టూ తిరుగుతూ భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ తెలంగాణా సంప్రదాయాన్ని చాటారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా ప్రకృతిని, పూలను ఆరాధించే అద్భుతమైన సాంప్రదాయం మన తెలంగాణ సొంతమని మంత్రి కొనియాడారు. రాష్ట్ర పాలనా కేంద్రమైన సచివాయంలో ఎల్లప్పుడూ విధులతో బిజీగా ఉండే ఉద్యోగులు, పండుగ వేళ ఇలా ఒక్కచోట చేరి సంబురాలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులు సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించడంలోనూ ముందుండడం సంతోషకరమని ఆమే పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకైన బతుకమ్మ వేడుకలు సచివాలయ ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని తలపించాయి.

## రైల్వే ఉద్యోగులకు బోనస్ బొనాంజా

(మొదటి పేజీ తరువాయి)

రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనంతో సమానమైన బోనస్గా ఆమోదించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ.2,009.61 కోట్లు విడుదల చేయనుంది. ఈ పండుగ బోనస్ ద్వారా మొత్తం 11,40,770 మంది నాన్-గెజిటెడ్ రైల్వే ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. రైల్వే శాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 'గ్రూప్ సీ' సిబ్బందికి ఈ బోనస్ లభిస్తుంది. ట్రాక్ మెయింటెనెర్లు, లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు (గార్డులు), స్టేషన్ మాస్టర్లు, సూపర్వైజర్లు, టెక్నీషియన్లు, టెక్నీషియన్ హెల్పర్లు, పాయింట్స్మెన్, మినిస్టీరియల్ సిబ్బంది, ఇతర గ్రూప్ 'సీ' ఉద్యోగులు ఈ బోనస్ పొందనున్నారు. రైల్వే సిబ్బంది కనబరిచిన అద్భుత పనితీరుకు గుర్తింపుగా ఈ బోనస్ను ఆమోదించినట్లు కేంద్ర కేబినెట్ తెలిపింది. ఈ ప్రోత్సాహకం రాబోయే రోజుల్లో రైల్వే సేవలను మరింత మెరుగుపరిచేందుకు ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారతీయ రైల్వే రికార్డు స్థాయి ప్రదర్శన నమోదు చేసింది. ఏకంగా 1,670 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడంతో పాటు, దాదాపు 7.41 బిలియన్ల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చింది.

### పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు

# విద్యుత్ సరఫరా చేయాలె

**హైదరాబాద్, అక్టోబర్ 14:** రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతుల పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు విద్యుత్ సరఫరా చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పంటలు చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ కొరత కారణంగా రైతులు పంట నష్టపోకూడదని హెచ్చరించారు. వ్యవసాయానికి విద్యుత్ అవసరం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అందుకు అనుగుణంగా సరఫరా పెంచాలని సూచించారు.

రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరాపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలవారీగా ప్రస్తుత పరిస్థితులను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సాఫీగా జరిగేలా చూడాలని పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు ఎందుకు రావడం లేదని అధికారులను నిలదీశారు. రాబోయే రోజుల్లో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు లింకేజీ ఏర్పాట్లు చేసినా యాదాద్రి విద్యుత్ ప్లాంట్లో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని ఆరా తీశారు. 'ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సింది నేను. రైతుల పంటలను కాపాడేందుకు అవసరమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితి మారలేదు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను సహించేది లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదు'' అని ముఖ్యమంత్రి తీవ్రంగా హెచ్చరించారు. అవసరమైతే విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్, జెన్కో సీఎండీ.. సంబంధిత విభాగపు ఐఏఎస్ లను సస్పెండ్ చేస్తానని మండిపడ్డారు. విద్యుత్ అంతరాయాలకు రోజుకో కారణం చెప్పవద్దని హెచ్చరించారు.

### ఎల్నినో కోవిడ్ లాంటి విపత్తే..

ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కోవిడ్ తరహా విపత్తుగా పరిగణించి అన్ని ప్రభుత్వ శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పుడు సాధారణ సమస్యగా కనిపిస్తున్న పరిస్థితులు ముందస్తు చర్యలు చేపట్టకపోతే తీవ్ర సంక్షోభంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. 'ఎల్నినో కోవిడ్ లాంటి విపత్తు. ఈ పరిస్థితి ఎప్పటివరకు ఉంటుందో ఎవరికీ తెలియదు. ఇప్పుడు సమస్యగా కనిపిస్తోంది. అప్రమత్తం కాకపోతే సంక్షోభంగా మారుతుంది. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో ఎల్నినో ప్రభావాన్ని లోతుగా అంచనా వేయాలి. సమస్యలను అధిగమించేందుకు పరిష్కార మార్గాలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలి'' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఈ పరిస్థితులు ఎంతకాలం కొనసాగుతాయో చెప్పలేమని, మళ్లీ వానలు వచ్చే వరకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాల్సిందేనన్నారు. వచ్చే జూన్ వరకు ప్రతి శాఖ పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. రాబోయే సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# అచ్చంపేటలో అభివృద్ధి శకం


(మొదటి పేజీ తరువాయి)

గుర్తుచేసుకుంటూ పలు కీలక ప్రకటనలు చేశారు.గత మూడేళ్లలో ప్రజా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా రూ.1,64,431 కోట్లను నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేశామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ లెక్కలపై ఎవరితోనైనా చర్చించేందుకు, ఎలాంటి సవాల్నైనా స్వీకరించేందుకు తాను సిద్ధమని భట్టి ప్రకటించారు. రాష్ట్రంలో కోటి 15 లక్షల కుటుంబాలు ఉండగా, కోటి 6 లక్షల కుటుంబాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఆయన వెల్లడించారు.

### పేదల సంక్షేమం కోసం..

పేదల ఆహార భద్రత కోసం ప్రతి వ్యక్తికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పిస్తున్నామని ఆయన వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 43 లక్షల మందికి ఆసరా పింఛన్లు, 71.40 లక్షల మంది రైతులకు రైతు భరోసా, 53 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, యువతకు ఇప్పటివరకు 76 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించినట్లు భట్టి వెల్లడించారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని, అచ్చంపేట నియోజకవర్గంలోనే 7,300 ఇళ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. కుల, మతాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి భద్రత కల్పించేందుకు ఈ నెల19న ఇందిరమ్మ జయంతి సందర్భంగా 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాన్ని ప్రారంభించనున్నట్లు భట్టి ప్రకటించారు.రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం భారీగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఇందులో భాగం

## ఉప్పల్ స్టేడియంలో వెల్లువెత్తిన తెలంగాణ సాంస్కృతిక వైభవం



**హైదరాబాద్, అక్టోబర్ 14 (మనం న్యూస్):** అంతర్జాతీయ క్రికెట్ వేదికను వేదికగా చేసుకొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు విశ్వవ్యాప్తం అయ్యేలా పర్యాటక శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సుసంపన్నమైన వారసత్వాన్ని చాటిచెప్పే ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు కనువిందు చేశాయి. క్రీడా ఉత్సాహానికి తెలంగాణ జీవన సౌందర్యాన్ని జోడిస్తూ నిర్వహించిన ఈ వేడుకలు స్టేడియానికి వచ్చిన వేలాది మంది క్రికెట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రాష్ట్ర సాంస్కృతిక ప్రతీక అయిన పూల పండుగ బతుకమ్మ వైభవాన్ని స్టేడియం వేదికగా ప్రదర్శించడం ఈ కార్యక్రమ ప్రత్యేకత. ప్రకృతిని ఆరాధించే మన సంస్కృతిని, సామూహిక జీవన విధానాన్ని ప్రతిబింబించేలా సాగిన బతుకమ్మ వేడుకల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. స్థానిక కళాకారులు ప్రదర్శించిన కోలాటాలు, జానపద నృత్యాలు, సంప్రదాయ కళారూపాలు స్టేడియాన్ని మార్మోగించాయి. మ్యాచ్ విరామ సమయంలో తెలంగాణ పర్యాటక శాఖ ప్రత్యేకంగా రూపొందించిన ప్రచార చిత్రాన్ని (డాక్యుమెంటరీ) భారీ స్క్రీన్‌లపై ప్రదర్శించారు. రాష్ట్రంలోని చారిత్రక కోటలు, కాకతీయ శిల్పసంపద, ప్రసిద్ధ దేవాలయాలు, ప్రకృతి అందాలు, పర్యాటక గమ్యస్థానాలను కళ్లకు కట్టేలా చూపించారు.క్రీడలతో పాటు పర్యాటక, సాంస్కృతిక రంగాధినేతగా తెలంగాణ కీర్తిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పర్యాటక శాఖ పేర్కొంది. అంతర్జాతీయ క్రీడా వేదికలను సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్ర సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు, స్థానిక కళాకారులకు తగిన గుర్తింపు తీసుకురావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అధికారులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. క్రికెట్ మజాను ఆస్వాదిస్తూనే తెలంగాణ సంస్కృతిని వీక్షించిన క్రీడాభిమానులు ఈ వేడుకలను కొనియాడారు.

# మెడికవర్ ఆసుపత్రిలో అసలేం జరుగుతోంది!

### అక్కడ ఎందుకు ప్రాణాలు పోతున్నాయి?
### వ్యాపారమే తప్ప.. వైద్యం లేదా?
### ఆ కార్పొ'రేట్'ను కాపాడుతున్నదెవరు?
### వైద్య శాఖ అధికారుల ఉదాసీనతకు కారణమేంది?




**హైదరాబాద్,అక్టోబర్14(మనం న్యూస్):** 'వైద్యో నారాయణో హరిః' అన్న పవిత్ర భావన నేడు కార్పొరేట్ ఆసుపత్రుల కాసుల కక్కుర్తి ముందు కాగడా వేసి వెతికినా కనిపించడం లేదు. ప్రాణాలు కాపాడాల్సిన చేతులే గొంతు కోస్తుంటే, నిండు నూరేళ్లు బతకాల్సిన ప్రజ కార్పొరేట్ ఆసుపత్రుల రాక్షస క్రీడకు బలవుతుంటే ఈ సమాజం ఎంతకాలం మూగ ప్రేక్షకుడిలా భరించాలి? తెలంగాణ గడ్డపై, రాజధాని నడిబొడ్డున ఉన్న ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రి మెడికవర్ అంతులేని క్రూరత్వానికి, పచ్చి మోసానికి నిలయంగా మారింది. మెడికవర్‌లో వ్యాపారం తప్ప వైద్యం లేదా!..ఆ దవాఖానలో వరుసగా ఎందుకు ప్రాణాలు పోతున్నాయి..,ఆ కార్పొ 'రేట్ 'సామ్రాజ్యాన్ని కాపాడుతుంది ఎవరు..?,మెడికవర్ ఆసుపత్రిలో అసలేం జరుగుతోంది..?,వైద్య శాఖ అధికారుల ఉదాసీనతకు కారణమేంది? అన్న సందేహాలు నేడు ప్రతి ఒక్కరిని కలవర పాటుకు గురి చేస్తున్నాయి. కేవలం కిడ్నీలో రెండు మిల్లీమీటర్‌ల చిన్నపాటి రాయి ఉందన్న సాకుతో సాధారణ చికిత్స కోసం వచ్చిన ఒక నిండు ప్రాణాన్ని, ఒక న్యాయవాది కుటుంబాన్ని బలిగొన్న తీరు చూస్తే గుండె తరుక్కుపోతుంది.

**శవంతోనూ వ్యాపారమే!..**

మెడి కవర్‌ఆసుపత్రిలో సోమవారం జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆసుపత్రిలో అడుగుపెట్టిన మొదటి రోజు ఆ యువతి నూటికి నూరుపాళ్లు ఆరోగ్యంగా, ఎలాంటి ప్రాణాపాయం లేకుండా ఉందని. స్వయంగా వైద్యులే ఈ విషయాన్ని నిర్ధారించారు. కానీ, తదుపరి రోజు సీన్ రివర్స్ అయింది. డిశ్చార్జ్ చేస్తామని చెప్పిన నోటితోనే, ఒక్కసారిగా 'క్రిటికల్' అంటూ కట్టుకథలు అల్లడం ప్రారంభించారు. అసలు కిడ్నీలో చిన్న రాయి ఉంటే మనిషి చనిపోతాడా? ఈ చిన్నపాటి ప్రశ్నకు వైద్యుల వద్ద సమాధానం లేదు. ఒక వైద్యుడి అహంకారపు మాటలు, మీ పాప 200 ఏళ్లు బతుకుతుంది అంటూ బాధితుల ముఖం మీదే హేళన చేస్తూ మాట్లాడిన తీరు ఆసుపత్రిలో ఏ స్థాయి అమానుషత్వం తాండవిస్తోందో కళ్లకు కడుతోంది. మనిషి ప్రాణాలతో చెలగాటమాడుతూ, శవంతో సైతం వ్యాపారం చేసే ఈ రాక్షస నైజాన్ని ఏమని క్షమించాలి?. రోగి పరిస్థితి విషమించి బ్రెయిన్ డెడ్ అయిందని తెలిసిన తర్వాత కూడా, ఆ వైద్యుల గుండెల్లో కనికరం కరగలేదు. శవం చుట్టూ కాసుల వర్షం కురిపించుకోవడానికి వెంటిలేటర్‌పై ఉంచి ''ఠాగూర్'' సినిమా తరహా డ్రామాలు నడిపించారు. చికిత్స పేరుతో రూ. 7 లక్షల నుంచి రూ. 9 లక్షల వరకు నిలువునా దోచుకున్నారు. అడగాల్సిన తండ్రి న్యాయవాది అయి ఉండి కూడా, ఈ కార్పొరేట్ కేటుగాళ్ల దోపిడీని అడ్డుకోలేకపోయారంటే సామాన్యుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

**మృత్యు కర్మాగారంగా మెడికవర్!**

ఇది ఒక్క ఐశ్వర్యతో ఆగిపోయిన ఉదంతం కాదు. ఇదే ఆసుపత్రిలో గత నెల రోజుల వ్యవధిలో పది మంది నిండు ప్రాణాలు బలయ్యారనే భయానక గణాంకాలు వెలుగు చూశాయి. కిడ్నీ సమస్య కోసం వస్తే సర్జరీ చేయకుండా ఇతర సమస్యలు సృష్టిస్తూ, రోగులను భయభ్రాంతులకు గురిచేసి నిలువునా ముంచడమే ఈ ఆసుపత్రి నైజంగా మారింది. ఈ దారుణాలపై బాధితులు నిలదీస్తే దబాయింపులు, బెదిరింపులకు దిగడం ఆసుపత్రి యాజమాన్యం అహంకారానికి పరాకాష్ట. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాల రోదనలు ఈ ఆసుపత్రి గోడలకు వినిపించడం లేదా? అంటూ పలువురు తమ ఆక్రోశాన్ని వెల్లగక్కుతున్నారు.

**పాలకుల మౌనం...ప్రజలకు శాపం..**

మెడి కవర్ హాస్పిటల్ లో ఇంత తంతు జరుగుతున్న అటువైపుగా కన్నెత్తి చూడడానికి కూడా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖకు మనసు రావడం లేదా? ప్రజాధనంతో నడిచే ప్రభుత్వ వ్యవస్థలు, ప్రజల ప్రాణాలను కార్పొరేట్‌ల చేతిలో కట్టబెట్టి నిద్రమత్తులో జోగడం అత్యంత గర్హనీయం. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ ఉందా లేక కేవలం కార్పొరేట్ ఆసుపత్రుల ప్రయోజనాలను కాపాడే బినామీ సంస్థగా మారిందా అని ప్రజలు నిలదీస్తున్నారు. వరుస మరణాలు సంభవిస్తున్నా, పదుల సంఖ్యలో నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా ఉన్నతాధికారులు, మంత్రి స్థాయి వ్యక్తులు మౌనం వహించడం ఈ నేరంలో భాగస్వామ్యం కావడమే అవుతుంది. తప్పు చేసిన వాడికి చట్టం చురుకైన శిక్షను చూపించాల్సిన చోట, అధికారుల ఈ ఉదాసీన వైఖరి కార్పొరేట్ శక్తులకు మరింత రెక్కలు తొడుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తమ కళ్లు తెరిచి, నిద్రమత్తు వీడి క్షేత్రస్థాయిలో విచారణ జరపకపోతే ప్రజాగ్రహం పెల్లుబికి పాలకుల సింహాసనాలే కదిలిపోతాయి.

**నిబంధనలకు తిలోదకాలు..**

కార్పొరేట్ ఆసుపత్రుల వేల కోట్ల వ్యాపార సామ్రాజ్యాల ముందు సామాన్యుడి ప్రాణం గడ్డిపోచలా తయారైంది. నిబంధనలను కాలరాస్తూ, రోగుల భయాలను ఆసరాగా చేసుకొని లక్షలు గుంజుతున్న ఇలాంటి మృత్యుకూపాల అనుమతులను తక్షణమే రద్దు చేయాలి. ఐశ్వర్య కుటుంబాన్ని నిలువునా ముంచిన ఆసుపత్రి యాజమాన్యంపై, బాధ్యులైన వైద్యులపై నూటికి నూరుపాళ్లు హత్యాయత్నం, మోసం కేసులు నమోదు చేసి చట్టపరంగా అత్యంత కఠినమైన శిక్షలు అమలు చేయాలి.

కేవలం నామమాత్రపు విచారణల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తే మరిన్ని నిండు ప్రాణాలు బలియే ప్రమాదం పొంచి ఉంది. అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఏ ఒక్క రాక్షస ఆసుపత్రిని కూడా వదలకుండా, బాధితులకు సంపూర్ణ న్యాయం జరిగేలా ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ తక్షణ చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## నాకు అసైన్డ్ ల్యాండ్స్ ఉన్నట్లు నిరూపిస్తే అక్కడే రాసిస్తా

### తెలంగాణ సమాజానికి నన్ను విలన్‌గా చూపించాలని కుట్ర
### ఇప్పటికైనా బీఆర్ఎస్ ఆర్టిస్టులు డ్రామాలు బంద్ చేయాలె
### కేటీఆర్‌కు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్




**హైదరాబాద్, అక్టోబర్ 14(మనం బ్యూరో):** కల్వకుంట్ల కుటుంబం భూ బాగోతాన్ని బట్టబయలు చేసినందుకే నన్ను టార్గెట్ చేస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. నా పేరు మీద అసైన్డ్ భూములు ఉన్నా, 22ఎ జాబితాలో ఉన్నా, ఇల్లీగల్ భూములు ఉన్నా అక్కడికి మీరు వెళ్లండి అక్కడే అధికారులను పిలిచి రాసిచ్చేస్తానని సవాల్ విసిరారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఎంపీ చామల మాట్లాడుతూ బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్ల అవినీతిని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వివరించారనీ, భూములు, హోటల్స్ అన్నీ బయటపెట్టారని పేర్కొన్నారు. మా వాయిస్ టాంపరింగ్ చేసి సోషల్ మీడియాలో బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందనీ, బీఆర్ఎస్ హయాంలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. స్కైరో పేరుతో వీరవిహారం చేసిన వ్యక్తి కుక్కలాగా మొరుగుతున్నారనీ, ఏనుగు ఎక్కి ప్రగతి భవన్‌కు వెళ్తా అని చెప్పిన వ్యక్తి ఇప్పుడు ఫామ్ హౌస్‌లో బందీ అయ్యారని బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి నా ఫ్లెక్సీ కట్టినట్లు అతన్ని నేను రాహుల్ గాంధీని కలిసినట్లు ఏఐ ఫోటో క్రియేట్ చేశారని వ్యాఖ్యానించారు.తెలంగాణ సమాజానికి నన్ను విలన్‌గా చూపించాలని మాజీ ఐపీఎస్ అధికారి కుట్రపన్నారని విమర్శించారు. అమెరికాలో ఆరేళ్లు ఉండి ఫైవ్ స్టార్ హోటల్ కట్టుకున్నా అని కేటీఆర్ చెప్పారనీ, ఇంత తెలివి ఉన్న కేటీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని పాలిస్తే రూ.8 లక్షల కోట్లు అప్పు ఎలా అయిందని ప్రశ్నించారు. మీ ఆర్టిస్టుల తెలివితేటలు మా దగ్గర చూపించకండి, ప్రజా క్షేత్రానికి వెళ్లి వాస్తవాలు తెలియజేయాలని సూచించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ ఆర్టిస్టులు డ్రామాలు బంద్ చేయాలని ఈ సందర్భంగా చామల బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు.

# అది క్షమించరాని నేరం

### 'ప్రమాదకర డ్రైవింగ్' చేస్తే? భారీ జరిమానాతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు
### ప్రయాణికులు మౌనంగా ఉండొద్దు?.. 112కు కాల్ చేయండి



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఓ వైపు డ్రైవింగ్ చేస్తూ, మరోవైపు చెవులకు హెడ్ ఫోన్స్ పెట్టుకొని కన్ను అర్పకుండా సినిమా చూస్తూ నిర్లక్ష్యపూరితంగా ఆటో నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనపై ఒక నెటిజన్ పంపిన ఈ వీడియోపై సజ్జనార్ తన 'ఎక్స్' ఖాతాలో స్పందించారు. 'రెండు కళ్లకు ఎదురుగా రెండు ఫోన్లు, ఒక దాంట్లో నావిగేషన్, మరో దాంట్లో సినిమా, గేమింగ్ విన్యాసంలా ఉన్నా, ప్రయాణికుల పాలిట నడుస్తున్న మృత్యుశకటం' అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. డ్రైవింగ్ సమయంలో క్షణకాలం దృష్టి మళ్లినా ఘోర ప్రమాదాలు జరుగుతాయని ఆయన హెచ్చరించారు. ఇలా సినిమా చూస్తూ వాహనం నడపడం కేవలం నిర్లక్ష్యం మాత్రమే కాదని, క్రమించరాని నేరమని స్పష్టం చేశారు. మోటార్ వెహికిల్ యాక్ట్ ప్రకారం ఇది 'ప్రమాదకర డ్రైవింగ్' కిందకు వస్తుందని, దీనికి భారీ జరిమానాతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. వినోదం కోసం ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టవద్దని, ఆటోను థియేటర్‌గా మార్చి జీవితాలకు 'ది ఎండ్' కార్డు వేయొద్దని ఆయన హెచ్చరించారు. ఈ విషయంలో ప్రయాణికులు కూడా అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. డ్రైవర్ ఫోన్ చూస్తున్నా, హెడ్ ఫోన్లు పెట్టుకున్నా మౌనంగా ఉండవద్దని, వెంటనే ప్రశ్నించి వారించాలని కోరారు. వారు విని పక్కంలో డయల్ 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో, వీడియోలో కనిపించిన టీజీ15యూ2657 నంబర్ గల ఆటో డ్రైవర్‌ను గుర్తించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులను ఆదేశించినట్లు సజ్జనార్ వెల్లడించారు.

## దసరాకు 7 వేల ప్రత్యేక బస్సులు సిద్ధం

### ఆరు తేదీల్లో స్పెషల్ బస్సుల్లో 50 శాతం అధిక ఛార్జీల వసూలు
### ఉచిత ప్రయాణం యథాతథం



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ భారీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7 వేల ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ నెల 20వ తేదీ వరకు ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. కొన్ని కీలక తేదీల్లో ప్రత్యేక బస్సుల్లో ఛార్జీలను 50 శాతం పెంచుతున్నట్లు ఆర్టీసీ తెలిపింది. అక్టోబరు 16, 17 తేదీల్లో హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు, తిరుగు ప్రయాణంలో అక్టోబరు 25, 26 తేదీల్లో ఈ పెరిగిన ఛార్జీలు వర్తిస్తాయి. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అన్ని బస్సుల్లో యథావిధిగా కొనసాగుతుంది. ఈ 7 వేల ప్రత్యేక బస్సుల్లో అత్యధికంగా కరీంనగర్ జోన్‌కు 3,533 బస్సులు కేటాయించారు. హైదరాబాద్ జోన్‌కు 2,155, గ్రేటర్ హైదరాబాద్ జోన్‌కు 1,312 బస్సులు నడుస్తాయి. వీటితో పాటు నల్గొండకు 815, మహబూబ్ నగర్‌కు 645, రంగారెడ్డి రీజియన్‌కు 440, మెదక్‌కు 255 బస్సులు ఏర్పాటు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధి నుంచి అక్టోబరు 16న 1,354, 17న 1,211 బస్సులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు బయలుదేరనున్నాయి. అయితే, ప్రయాణికుల కోసం హైదరాబాద్ ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్, ఎల్‌బీనగర్, కేపీహెచ్‌బీ, గచ్చిబౌలి వంటి ప్రధాన ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాత్కాలిక బస్ స్టాప్‌ల వద్ద పందిళ్లు, త్రాగునీరు, మొబైల్ టాయిలెట్ల వంటి సౌకర్యాలను కూడా కల్పించామని ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీదేవి ఈ సందర్భంగా వెల్లడించారు.

# బీసీ విద్యార్థులకు మరో అవకాశం

### ఈ నెల 31 వరకు 'ఓవర్సీస్ విద్యానిధి' దరఖాస్తు గడువు పొడిగింపు

**హైదరాబాద్,అక్టోబర్14(మనం న్యూస్):** విదేశీ గడ్డపై ఉన్నత చదువులు చదవాలనే ఎందరో పేద, మధ్యతరగతి యువత కలలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది.మహాత్మా జ్యోతిబా ఫూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద విదేశాల్లో మాస్టర్స్, డాక్టోరల్ కోర్సులు అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఊరటనిస్తూ దరఖాస్తు గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించారు. అంకితభావంతో చదివి, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో సీట్లు సాధించిన యువతకు ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడనుంది. అర్హులైన ప్రతి విద్యార్థి ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బి. బాలామాయాదేవి స్పష్టం చేశారు.

ఈ ఆర్థిక సహాయానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం అన్ని వనరుల నుంచి రూ.5 లక్షల లోపు ఉండాలనే నిబంధన పెట్టారు. దరఖాస్తు నాటికి విద్యార్థి వయస్సు 35 సంవత్సరాలు దాటకూడదని,అలాగే గ్రాడ్యుయేషన్ స్థాయిలో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండటంతో పాటు, జీఆర్ఈలో 260 లేదా జీశాట్‌లో 550 స్కోర్ కలిగి ఉండాలి. ఇంగ్లీష్ భాషా నైపుణ్యానికి సంబంధించి టోఫెల్‌లో 60,ఐఈఎల్‌టీఎస్‌లో 6.0 లేదా పీటీఈలో 50 స్కోర్ సాధించిన వారు మాత్రమే అర్హులవుతారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## పెళ్లికి ముందు ఏదీ వద్దు? పెళ్లి తర్వాతే ప్రేమ

# ప్రేమ, పెళ్లిళ్ల విషయంలో యువతకు ఒవైసీ కీలక సూచనలు

### అమ్మాయి నచ్చితే?.. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోండి?..పెళ్లి తరాతే 'ఐ లవ్ యూ' చెప్పండి



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రేమ, పెళ్లి విషయంలో యువతకు ఆసక్తికరమైన సూచనలు చేశారు. ప్రేమ భావనలు వ్యక్తం చేసే కంటే ముందు పెళ్లికి ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. యువతకు ఎవరైనా అమ్మాయి నచ్చితే, ముందుగా పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలని, ఆ తర్వాతే ఆమెకు 'ఐ లవ్ యూ' చెప్పాలని సూచించారు. ఓ సభలో యువతను ఉద్దేశించి ఒవైసీ మాట్లాతుతూ... జీవితంలో పూర్తిగా స్థిరపడ్డాకే పెళ్లి చేసుకుంటామని చెప్పే యువత తీరును ఆయన తప్పుబట్టారు. 'సెటిల్ అయ్యాక పెళ్లి చేసుకోవడం కాదు?.., పెళ్లి చేసుకుంటేనే జీవితంలో సెటిల్ అవుతారు' అని ఆయన స్పష్టం చేశారు. తన నెరిసిన గడ్డాన్ని చూపిస్తూ... 'నా గడ్డం తెల్లబడింది, నేను ఇప్పటికీ పూర్తిగా సెటిల్ అవ్వలేదు. పెళ్లి చేసుకుంటే జీవితంలోని మిగతా అంశాలన్నీ అవే సర్దుకుంటాయి' అని సరదాగా వ్యాఖ్యానించడంతో సభలో నవ్వులు విరిశాయి. పెళ్లి చేసుకోని వారు చుట్టుపక్కల వారికి సమస్యలు సృష్టిస్తారని, ఇంట్లో ఎవరూ లేనివారే అందరినీ ఇబ్బంది పెడతారని ఆయన వ్యాఖ్యానించారు. పెళ్లి చేసుకోవడం ద్వారా జీవితంలో స్థిరపడటం చాలా ముఖ్యమని ఆయన నొక్కిచెప్పారు.

**సర్‌పై స్టే విధించండి..**
**సుప్రీంకోరు అసదుద్దీన్ పిటిషన్..**

దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన సర్ ప్రక్రియను ఆయన తన పిటిషన్‌లో సవాల్ చేశారు. ఒవైసీ తరఫున న్యాయవాది నిజాముద్దీన్ పాషా వాదనలు వినిపించారు. ఈ అంశంపై దాఖలైన ఇతర పిటిషన్లతో కలిపి తమ పిటిషన్‌ను కూడా గురువారం విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని కోరారు.

## నాలుగు అంతర్జాతీయ నాణ్యతా గుర్తింపులు

### టీజీఎస్పీడీసీఎల్ సరికొత్త మైలురాయి
### ఉప ముఖ్యమంత్రి భట్టి చేతుల మీదుగా గుర్తింపులు స్వీకరించిన సీఎండీ జితేష్ పాటిల్

**హైదరాబాద్, అక్టోబర్ 14 :** విద్యుత్ పంపిణీ రంగంలో నాణ్యతా ప్రమాణాల అమలు, సమాచార భద్రత, స్టోర్స్ నిర్వహణ, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా సంస్థకు నాలుగు నాణ్యతా గుర్తింపులు లభించాయి. నాణ్యతా నిర్వహణకు సంబంధించి ISO 9001, సమాచార భద్రతకు ISO 27001, స్టోర్స్ నిర్వహణలో జపనీస్ 5S విధానం, వినియోగదారులకు నాణ్యమైన సేవ లందిస్తున్నందుకు క్వాలిటీ మార్క్ గుర్తింపులు దక్కాయి. సంస్థలో నిర్వహణ సామర్థ్యం, సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు చేపడుతున్న చర్యలకు ఈ గుర్తింపులు నిదర్శనంగా నిలుస్తున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ ఐఏఎస్ ఈ నాలుగు గుర్తింపులను స్వీకరించారు. ISO ఆడిటర్ శివయ్య సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) డాక్టర్ ఎన్. నర్సింహులు, కంపెనీ సెక్రటరీ అనిల్‌కుమార్, చీఫ్ ఇంజినీర్ (రూరల్) బాలస్వామి తదితర అధికారులు పాల్గొన్నారు.



## ఎర్రమంజిల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

### మహిళలతో కలిసి కోలాటమాడిన మంత్రి సీతక్క



**హైదరాబాద్,అక్టోబర్14(మనం న్యూస్):** తెలంగాణ సాంస్కృతిక వైభవానికి, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా అంబరాన్ని అంటుతున్నాయి. పనుల ఒత్తిడి, ఉద్యోగ బాధ్యతల బిజీలో ఉన్నప్పటికీ, పండుగ శోభను ఆస్వాదించేందుకు మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా కదిలివచ్చారు. ఎర్రమంజిల్‌లోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయ ప్రాంగణం రంగురంగుల పూల బతుకమ్మలు, సాంప్రదాయ వస్త్రధారణతో కళకళలాడింది. ఈ వేడుకల్లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి సీతక్క ముఖ్య అతిథిగా విచ్చేసి సందడి చేశారు. కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క మహిళా ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడారు. సంప్రదాయ పాటలకు అనుగుణంగా వంతులు వేస్తూ పాడుతూ పండుగ ఆనందాన్ని రెట్టింపు చేశారు. ఒక రాష్ట్ర స్థాయి మంత్రి తమతో పాటు నేల మీద కూర్చుని, కలిసి బతుకమ్మ ఆడుతూ పాటలు పాడటంతో మహిళా ఇంజనీర్లు, ఉద్యోగుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.తెలంగాణ ఆడబిడ్డల జీవన విధానాన్ని, ప్రకృతిని ఆరాధించే మన సంస్కృతిని బతుకమ్మ పండుగ ప్రపంచానికి చాటుతోందని ఈ సందర్భంగా మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ మన సంప్రదాయాలను, పండుగలను ఇలా తోటి ఉద్యోగులతో కలిసి ఆనందంగా జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని మంత్రి పేర్కొన్నారు. కార్యాలయమంతా పూల సువాసనలు, బతుకమ్మ పాటలతో పులకించిపోగా, మహిళా ఉద్యోగులు పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ మధుర జ్ఞాపకాలను సొంతం చేసుకున్నారు.

## బొద్దింకల బెడదకు

ముడుసుకుంటున్న ఛాతులు...
ప్రపంచంలో నియంతలందరూ
ఫోబియా గ్రస్తులంటుంటే విని
నమ్మలేకపోయాను కానీ.. నీకున్న
'కట్సరిడాఫోబియా' చూస్తే నమ్మకుండా
ఉండలేకుంటున్నాము.. తీరొక్క పూల తోట ఇది
లేత కుసుమాలు విచ్చుకుంటుంటే
చూసి మురిసిపోతావనుకున్న కానీ
ఇంతగా దడుసుకుంటావనుకోలే
కలువలనే చూసి చూసున్న నీ కనులకు
ఏ పువ్వులను చూసినా ఏవగింపు రావడం
మమ్మేమీ ఆశ్చర్య పరచలేదు కానీ
నీవు ఈ దేశపు భిన్న పూల తోటకు
ఏకైక తోటమాలివి కదా పూవులను చిదిమేస్తున్నా
కూడా.. చలించకుండా నీవుంటున్నావు చూడు
అదే నీపైన మాకు తిరస్కృతికి కారణమవుతుంది
బొద్దింకలు రోడ్డెక్కితే నీవు నీ అధికార కలుగులో
దాక్కుంటున్నావు... గుంపుగా వాళ్ళు వీధుల్లో
ప్రశ్నల పెంట వదులుతుంటే
సమాధానాలతో నీవు సాపు చేస్తావనుకుంటే
సాటు సాటుకు తప్పించుకు తిరుగుడేందుకు
తనను తాను బోనులో బంధించుకున్న పులి
గాండ్రింపులకు ఇన్నేళ్లు జడుసుకున్నాము కానీ
బొద్దింకలొచ్చాక ఆ అరుపులన్నీ
భయంతో నీవు పిచ్చిగా కూసే కూతలని తేలింది
మా నాయనమ్మ చెప్పుతుండేది
మంత్రాల బలం లేకున్నా
ఉత్త తుప్పిర్ల బలమన్న ఉండాలెరా అని
ఇప్పటికీ గానీ అర్థం కాలేదు...నీకున్నదంతా...
మంత్రాల బలము కాదు
అదంతా ఉత్త తుప్పిర్ల పనేనని
వాహనాన్ని, వాహకాన్ని రద్దు చేయగలవు కానీ
వాయువునేట్లా నిరాకరించగలవు..!?
ప్రశ్న కూడా ఇప్పుడు ఊపిరివంటిదే
ఈ దేశ ప్రజాస్వామ్య దేహానికి!!
నీవెంతో ఘనమైన వాడివని
గణతంత్ర దేశపు ఘనతను ప్రపంచ పటంలో
వెలిగిస్తావనుకుంటే ఖాకీల కాపలాతో ఇట్టా కాట
కలుపుతావనుకోలే! రంగు చూసి బెదిరేటోడికి
ఆరిద్ధల చూసినా అదురే ...నిన్ను చూశాకే
అర్థమవుతుంది..అదెంత అర్థసత్యమో...!!

**- దిలీప్.వి**
8464030808

# గ్రామీణ మహిళకు 'గౌరవమే' సాధికారత



గ్రామీణ మహిళల జీవితాన్ని అర్థం చేసుకోవాలంటే తెల్లవారకముందే మొదలయ్యే వారి దినచర్యను చూడాలి. ఎండైనా, వానైనా, కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఆమె బాధ్యతలు మాత్రం తగ్గవు. పంట పండితే ఇంటిల్లిపాదీ సంతోషంలో ఆమె భాగస్వామి అవుతుంది. నష్టం వస్తే కుటుంబాన్ని నిలబెట్టేందుకు తన అవసరాలను పక్కన పెడుతుంది. ఇంతటి శ్రమ చేస్తున్న గ్రామీణ మహిళకు సమాజంలో తగిన గుర్తింపు, ఆర్థిక స్వేచ్ఛ, నిర్ణయాధికారం లభిస్తున్నాయా అన్న ప్రశ్నకు మనం నిజాయితీగా సమాధానం వెతకాలి.

వ్యవసాయ కుటుంబంలో ఆమె రైతుతో సమానంగా శ్రమిస్తుంది. విత్తనాలు సిద్ధం చేయడం, నాట్లు వేయడం, కలుపు తీయడం, పంట కోయడం, ధాన్యాన్ని శుభపరచడం, నిల్వ చేయడం వంటి పనుల్లో ఆమె భాగస్వామ్యం ఎంతో విలువైనది. పశుపోషణ, కోళ్ల పెంపకం, కూరగాయల సాగు, ఇంటి అవసరాలకు అనుగుణంగా ఆహార పదార్థాల తయారీ వంటి పనులు కూడా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడతాయి. అయినప్పటికీ ఆమె చేసిన పనికి ప్రత్యేకమైన వేతనం లభించని సందర్భాలు అనేకం. శ్రమకు విలువ కట్టేటప్పుడు మహిళ చేతుల కష్టాన్ని కూడా లెక్కలోకి తీసుకోవడం న్యాయమైన సమాజానికి తొలి మెట్టు. గ్రామీణ మహిళ శ్రమ ఒకే వృత్తికి పరి మితం కాదు. పరిస్థితులను బట్టి కొత్త పనులను నేర్చుకుంటూ కుటుంబాన్ని ముందుకు నడిపిస్తుంది. ఆమె కష్టం ఆదాయంలో కనిపించకపోయినా ఆర్థిక చలనంలో మాత్రం స్పష్టంగా ఉంటుంది.

భూమిని సాగు చేయడంలో మహిళ పాల్గొన్నప్పటికీ భూమి యాజమాన్య పత్రాల్లో ఆమె పేరు ఉండకపోవచ్చు. రైతుకు అందే శిక్షణ, వ్యవసాయ పరికరాలు, రుణ సదుపాయాలు, మార్కెట్ సమాచారం ఆమెకు సమానంగా అందకపోవచ్చు. పంటకు సంబంధించిన నిర్ణయాల్లో ఆమె అభిప్రాయానికి తగిన ప్రాధాన్యం దక్కాలి. గ్రామీణ మహిళ శ్రమను ఉత్పాదక శ్రమగా గుర్తించక పోవడం వల్ల మహిళకు విశ్రాంతి సమయం తగ్గుతుంది. పురు షులు, మహిళలు ఇంటి పనులను పరస్పరం పంచుకోవడం కుటుంబ సంబంధాలను బలపరచడమే కాకుండా మహిళకు చదువు, ఉపాధి, వ్యక్తిగత అభివృద్ధి కోసం సమయాన్ని అందిస్తుంది.

విద్య గ్రామీణ మహిళ జీవితంలో కొత్త దారులను తెరుస్తుంది. చదువుకున్న మహిళ తన హక్కులను తెలుసుకో



గలదు, కుటుంబ ఆర్థిక వ్యవహారాలను అర్థం చేసుకోగలదు, పిల్లల విద్యపై సరైన నిర్ణయాలు తీసుకోగలదు. అయితే కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలు దూరంగా ఉండటం, రవాణా సౌకర్యాల కొరత, కుటుంబ ఆర్థిక పరిస్థితులు, చిన్న వయసులోనే ఇంటి బాధ్యతలు పెరగడం వంటి కారణాలు బాలికల చదువుకు ఆటంకం కలిగిస్తాయి. చదువు మధ్యలో ఆగిపోయిన మహిళలకు తిరిగి విద్యను కొనసాగించే అవకాశాలు కూడా అవసరం. వయోజన విద్య, వృత్తి శిక్షణ, కంప్యూటర్ పరిజ్ఞానం, డిజిటల్ లావాదేవీలపై అవగాహన వంటి కార్యక్రమాలు గ్రామీణ మహిళకు కొత్త ఉపాధి మార్గాలను చూపగలవు. పల్లెల్లో బాలిక చదువు కొనసాగితే ఆ వెలుగు ఒక కుటుంబానికే కాకుండా సమాజానికంతటికీ ఉపయోగపడుతుంది.

ఆరోగ్యం విషయంలోనూ గ్రామీణ మహిళ అవసరాలను ప్రత్యేకంగా చూడాలి. అనారోగ్యాన్ని పట్టించుకోకుండా పని చేయడం, వైద్య పరీక్షలను వాయిదా వేయడం ఆమె ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. గర్భిణులకు సకాలంలో వైద్య సేవలు, రక్తహీనత నివారణ,పోషకాహారం, ప్రసూతి సంర క్షణ, మానసిక ఆరోగ్యంపై అవగాహన అందుబాటులో ఉండాలి. సమీపంలో ఆరోగ్య కేంద్రం ఉండటంతో పాటు అవసరమైన సిబ్బంది, మందులు, రవాణా సదుపాయాలు కూడా ఉండాలి. ఆమె ఆరోగ్యాన్ని కుటుంబానికి సంబంధించిన అంశంగానే కాకుండా స్వతంత్ర హక్కుగా గుర్తించడం గ్రామీణ సంక్షేమానికి అవసరం.

ఆర్థిక స్వావలంబన మహిళలో ఆత్మవిశ్వాసాన్ని పెంచే ముఖ్యమైన ఆధారం. చిన్న మొత్తంలో సంపాదించిన ఆదాయమైనా దానిపై ఆమెకు అవగాహన, వినియోగంపై నిర్ణయం ఉండటం ముఖ్యం. పొదుపు అలవాటు, బ్యాంకు ఖాతా నిర్వహణ, రుణాలపై స్పష్టత, వడ్డీ లెక్కలు, వ్యాపార నిర్వహణ వంటి విషయాలు తెలిసినప్పుడు ఆర్థికంగా మోసపోయే అవకాశాలు తగ్గుతాయి.

స్వయం సహాయక సంఘాలు గ్రామీణ మహిళల సామూహిక శక్తికి మంచి ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఒకే గ్రామానికి చెందిన మహిళలు క్రమం తప్పకుండా సమావేశమై పొదుపు చేయడం, అవసరమైనప్పుడు పరస్పరం సహకరించుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం, చిన్న వ్యాపారాలు ప్రారంభించడం వంటి కార్యకలాపాలు వారి జీవితాల్లో మార్పుకు దోహదపడుతున్నాయి.

సాంకేతిక పరిజ్ఞానం గ్రామీణ మహిళలకు కొత్త అవకాశాలను అందిస్తున్నప్పటికీ దాన్ని ఉపయోగించగల సామర్థ్యం అందరికీ సమానంగా లేదు. స్మార్ట్‌ఫోన్‌లో వ్యవసాయ సమాచారం తెలుసుకోవడం, డిజిటల్ చెల్లింపులు చేయడం, ఆన్‌లైన్‌లో ఉత్పత్తులను విక్రయించడం, ప్రభుత్వ సేవలకు దరఖాస్తు చేసుకోవడం వంటి పనులు ఆదాయాన్ని పెంచగలవు. మహిళలకు స్థానిక భాషలో శిక్షణ ఇవ్వడం, సురక్షితమైన డిజిటల్ వినియోగంపై అవగాహన కల్పించడం అవసరం.

గ్రామీణ మహిళా సాధికారతకు కుటుంబం, సమాజం, విద్యాసంస్థలు, ఆర్థిక సంస్థలు, స్థానిక పాలనా వ్యవస్థలు తమ వంతు సహకారం అందించాలి. మహిళలు గ్రామసభల్లో పాల్గొనడం, తమ ప్రాంత అవసరాలను తెలియజేయడం, అభివృద్ధి పనులపై అభిప్రాయాలు చెప్పడం ప్రోత్సహించాలి. ఉపాధి శిక్షణ ఇచ్చి వదిలేయకుండా వారు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం, వ్యాపార సమస్యలకు పరిష్కారం చూపడం కూడా అవసరం. మహిళలను లబ్ధిదారులుగా మాత్రమే కాకుండా అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించే భాగస్వాములుగా గుర్తించినప్పుడే గ్రామీణ ప్రగతి మరింత సమగ్రంగా ఉంటుంది.

అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 15న నిర్వహించబడుతుంది. ఐక్యరాజ్య సమితి 2007లో ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేయగా, 2008 నుంచి దీని నిర్వహణ ప్రారంభమైంది. వ్యవసాయం, ఆహార భద్రత, గ్రామీణ అభివృద్ధి, పేదరిక నిర్మూలనలో మహిళల పాత్రను గుర్తించడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ సందర్భాన్ని గ్రామీణ మహిళల జీవితాల్లో వాస్తవ మార్పు తీసుకురావడానికి ఉపయోగించాలి. ఆమెకు భూమిపై హక్కు ఉందా, శ్రమకు తగిన ఆదాయం వస్తుందా, వైద్యం అందుబాటులో ఉందా, పిల్లల చదువుతో పాటు తన చదువుకూ అవకాశం ఉందా, కుటుంబ నిర్ణయాల్లో ఆమె మాటకు విలువ ఉందా అనే ప్రశ్నలు మన చర్చల్లో భాగం కావాలి.

పల్లె అభివృద్ధిని కొలవడానికి ఎత్తైన భవనాలు, విశాలమైన రహదారులు, పెరిగిన ఉత్పత్తి మాత్రమే ప్రమాణాలు కావు. అక్కడి మహిళ ఎంత ఆరోగ్యంగా ఉంది, ఆమెకు తన ఆదాయంపై ఎంత నియంత్రణ ఉంది, తన పిల్లల భవిష్యత్తుపై ఎంత నమ్మకం ఉంది, తన అభిప్రాయాన్ని ఎంత స్వేచ్ఛగా వ్యక్తపరచగలుగుతోంది అన్నది కూడా చూడాలి. పొలంలో విత్తనం నాటిన చేతికి భూమిపై హక్కు దక్కాలి. చిన్న వ్యాపారాన్ని ప్రారంభించిన మహిళకు మార్కెట్ దారి తెరుచుకోవాలి. గ్రామీణ మహిళ ముందుకు సాగితే కుటుంబం.. గ్రామం అభివృద్ధి చెందుతుంది, దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తి చేరుతుంది. ఆమెను కేవలం కుటుంబానికి ఆధారంగా కాకుండా తనదైన ఆశయాలు, ఆలోచనలు, సామర్థ్యాలు కలిగిన వ్యక్తిగా గౌరవించినప్పుడే నిజమైన ప్రగతి.


**అక్టోబర్ 15 - అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం**
**- చిటికెన కిరణ్ కుమార్**
9490841284

# భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన కలామ్

అబ్దుల్ కలామ్.. ఈ పేరు తెలియని భారతీయుడు ఉండ డంటే ఆశ్చర్యం లేదు. భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఆయన. ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించి.. నిరంతర శ్రమతో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ఆయన జీవిత ప్రస్థానం నిజంగా అద్భుతం. దేశం కోసం పెళ్లి చేసుకోకుండా బ్రహ్మచారిగా ఉండిపోయిన ఆయన జీవితం ఆదర్శం. అనితర సాధ్యమైన విజయాలను తన ఖాతాలో వేసుకోవడం గొప్పతనం.

శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి సేవలందించిన కలాం. హార్ట్ స్టంట్ రూపొందించడం లోనూ పాత్ర పోషించారు. భారత దేశంలో ఉన్న అతికొద్దిమంది గొప్ప శాస్త్రవేత్తల్లో ఏపీజే అబ్దుల్ కలాం ఒకరు. ఆయన జయంతి ప్రపంచ విద్యార్థుల దినోత్స వంగా జరుపుకుంటారు. అబ్దుల్ కలాం తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలో ఒక ముస్లిం కుటుంబంలో 1931 అక్టోబర్ 15న జన్మించాడు. తండ్రి పేరు జైనలబుద్దిన్ మరాకాయర్, తల్లి పేరు అషియమ్మా జైనుబుల్‌బుద్దిన్. అబ్దుల్ కలాం పూర్తి పేరు అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం ఆర్థికంగా వెనుకబడిన, కుటుం బానికి సహాయం చేయడానికి చిన్న వయసు లోనే న్యూస్ పేపర్లు వేసేవాడు. రామేశ్వరానికి కొద్ది దూరంలో ఉన్న రామనాథపురం లో స్కెచ్ మెట్రిక్యులేషన్ స్కూల్లో పదో తరగతి వరకు చదువు కున్నాడు. చదువు అంత అంత మాత్రమే అయినప్పటికీ నేర్చుకో వాలనే తపన ఎక్కువగా ఉండేది. స్కూల్లోనే ఒక ఉపాధ్యాయుడు ఒకసారి సముద్రపు ఒడ్డుకు తీసుకువెళ్లి పక్షి ఎలా ఎగురుతుందో చూపించాడు. అప్పటి నుండి కలాం కూడా పక్షిలా ఎగరాలను కున్నాడట. ఎలాగైనా పైలెట్ కావాలని అనుకున్నాడు. తరువాత తిరుచ్చిలో సెయింట్ జోసెఫ్ కళాశాలలో డిగ్రీ పట్టా పొందాడు. కలాం తన చిన్ననాటి కోరిక నిజం చేసుకోవడానికి మద్రాసు లోని ఎన్ఐటీలో చేరాడు. ఐతే ఎన్ఐటీలో చేరాలంటే వెయ్యి రూపాయలు ఫీజు కట్టాల్సి వచ్చింది. కానీ ఆయన తండ్రి దగ్గర లేనపుడు కలాం అక్క తన రెండు గాజులు అమ్మి ఫీజ్ కట్టింది.

ఎలాగైనా బాగా చదివించాలని ఉన్నతమైన స్థానంలో చూడా లని తన కుటుంబ సభ్యులు పడుతున్న కష్టాన్ని.. తన మీద వాళ్లకు నమ్మకాన్ని చూసి చలించి పోయాడు. స్కాలర్‌షిప్ సహా యంతో ఎంఐటీలో ఎరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేయగా, అందులో నాటికల్ ప్రవేశ పరీక్షల్లో 8 ఉద్యోగాలు ఉంటే తనకు 9వస్థానం రావడంతో తృటిలో పైలెట్ అయ్యే అవకాశాన్ని కోల్పో యాడు. కలాం తన చిన్ననాటి కల చేజారి పోయింది. 1960



కలాం డీఆర్‌డీఓలో ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ లో శాస్త్రవేత్తగా చేరారు. అక్కడ భారత సైన్యం కోసం ఒక ఓవర్ క్రాఫ్ట్ డెవలప్ చేయడం ఆయన పని. కొన్ని రోజులకి ఇండి యన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ నుండి కలాంకి ఇంట ర్వ్యూకు రమ్మని పిలుపు వచ్చింది.

ఇప్పుడు దీనినే ఇస్రోగా పిలుస్తున్నారు. ప్రొఫెసర్ విక్రం సారాభాయ్ ఇంటర్వ్యూ చేశారు. అలా కలాం రాకెట్ ఇంజినీరుగా సెలక్ట్ అయ్యారు. విక్రం సారాభాయ్, కలాం కలిసి ఇస్రోను ఎంతగానో అభివృద్ధి చేశారు. 1962లో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో చేరి, ఇతర శాస్త్రవేత్తలతో కలసి అనేక కృత్రిమ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించారు. రోహిణి ఉపగ్రహాన్ని జూలై 1980లో విజయవంతంగా భూమి సమీప కక్ష్యలోకి వదిలిన భారత దేశపు తొలి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం (SLV&III)ని అభివృద్ధి చేయడంలో ప్రాజెక్టు డైరెక్టరుగా ఆయన కృషి ఎంతో ఉంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం. క్రమంలో ఆరు నెలలపాటు రాకెట్ లాంచింగ్ టెక్నిక్ మీద ట్రైనింగ్ కోసం అమెరికాలోని 'నాసా' వెళ్లే అవకాశం దక్కింది. భారత్ నుండి అంతరిక్షంలోకి శాటిలైట్ పంపాలనేది ప్రొఫెసర్ సారాభాయ్ కోరిక. శిక్షణ పూర్తి అయిన తర్వాత కలాం... సారా భాయ్ మరియు సతీష్ సహకారంతో 'రోహిణి' శాటిలైట్‌ని అంతరిక్షంలోకి పంపడానికి ఎస్ఎల్వీ-3 అనే రాకెట్‌ని అభివృద్ధి చేశారు. దేశంలోని ప్రజలందరికీ ఎస్ఎల్వీ-3 మీదే కళ్ళు ఉన్నాయి. కలాంతో పాటుగా అక్కడ ఉన్న ఎంతోమంది కష్టపడి నిర్మించిన 22 మీటర్ల పొడవైన ఎస్ఎల్వీ-3 లాంచ్ అయింది. 315 సెకండ్ తర్వాత సెకండ్ స్టేజ్ పేలిపోయి సముద్రంలో కుప్పకూలి పోయింది. కలాంకు ఏదో తెలియని ఆవేదన. దేశ ప్రజల అందరి కళ్లు ఆవిరై పోయాయి. మళ్ళి తిరిగి 1980 2 వ ఎస్ఎల్వీ-3 రెడీ చేశారు. మొదటి దాని లాగానే ఇది కూడా ఫెయిల్ అవుతుందని వ్యాఖ్యానించారు. 18 జూలై 1980 లో ఎస్ఎల్వీ-3 రోహిణి విజయవంతంగా ప్రవేశ పెట్టింది.అంతరిక్షం లోకి శాటిలైట్‌ని పంపగలిగే కెపాసిటీ ఉన్న దేశాల లిస్టులో భారత దేశం కూడా చేరింది. భారత అంతరిక్ష ప్రయోగాలు పునాదులు పడ్డాయి. ఆ నాటి ప్రధానమంత్రి గాంధీ ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు. ఆ తర్వాతి సంవత్సరం 1981లో కలాంకు పద్మభూషణ్ అవార్డు దక్కింది. ఆ తరువాత మన ఆర్మీ కోసం అగ్ని, పృథ్వి, నాగ్, ఆకాశ్ త్రిశూల్ వంటి శక్తివంతమైన మిస్సైల్స్‌ను తయారు చేసి మన దేశాన్ని ఎవరి మీద ఆధారపడని ఒక శక్తివంతమైన దేశంగా మార్చారు. అందుకే కలాంను మిస్సైల్ మాన్ అంటారు. ఆయన నాయకత్వంలో ఇస్రో ఎంతో అభివృద్ధి చెందింది.

1982లో, ఆయన డీఆర్డీవో డైరక్టరుగా తిరిగి బాధ్యతలు చేపట్టి గైడెడ్ మిస్సైల్స్‌పై దృష్టి కేంద్రీకరించారు. అగ్ని, పృథ్వి, క్షిపణి మిస్సైళ్ళ అభివృద్ధి చేసి ప్రయోగించడంలో కీలక పాత్ర పోషించారు. అంటే దేశానికి తొలి మిస్సైల్‌ను అందించిన ఘనత ఆయనదే.

అందుకే ఆయనకు 'మిస్సైల్ మాన్' అనే పేరు కూడా వచ్చింది. ఆ తర్వాత జూలై 1992లో దేశ రక్షణ మంత్రికి సాంకే తిక సలహాదారుగా నియమితులయ్యారు. అలాగే, భారత ప్రభుత్వానికి ప్రధాన సాంకేతిక సలహాదారుగా కేబినెట్ హోదాలో కొనసాగారు.అబ్దుల్‌కలాం కృషి ఫలితంగా 1998లో పోఖ్రాన్-II అణుపరీక్షలు విజయ వంతంగా పూర్తి చేయడం జరిగింది. ఈ అణుపరీక్షతో భారతదేశాన్ని అణ్వస్త్ర రాజ్యాల సరసన చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది.

ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగ స్వామిగా ఆయన్ను 'మిస్సైల్ మాన్' అని పిలుస్తారు. 1898లో వాజ్ పేయి ప్రధానమంత్రి సమయంలో అమెరికన్ శాటిలైట్స్ కి దొరకకుండా 'పోక్రాన్' అనే ప్రదేశంలో 'ఆపరేషన్ శక్తి' అనే పేరుతో విజయవంతంగా న్యూక్లియర్ టెస్ట్ చేయడంలో కలాం పాత్ర ఎంతగానో వుంది.

గత ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో అంటే 2002 జూలై 18వ తేదీన భారత రాష్ట్రపతిగా ఎన్నిక కాగా, జూలై 25న రాష్ట్రపతి భవన్‌లో అడుగు పెట్టారు. ఆయనకు నాటి ఎన్డీయే మిత్రపక్షాలతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ఇవ్వడంతో 90 శాతానికి పైగా ఓట్ల మెజార్టీతో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అబ్దుల్ కలాం మన దేశానికి ఏ రాజకీయ అనుభవం లేకుండా పదకొండవ రాష్ట్రపతిగా ఎన్నికైన జ్ఞాని. కలాం సమయంలో ఎక్కువ మందిని కలుసుకున్న రాష్ట్రపతిగా, పీపుల్స్ ప్రెసిడెంట్ అని అంటారు. వైద్య రంగంలో పోలియో బాధితుల కోసం, తేలికపాటి పరికరాల రూపకల్పన చేయడానికి ఎంతో కృషి చేశారు. భారత ప్రభుత్వం 'పద్మభూషణ్', 'పద్మవిభూషణ్', 'భారతరత్న' పురస్కారాలతో గౌరవించింది. అబ్దుల్ కలాం పూర్తిగా శాకాహారి. మధ్యపాన వ్యతిరేకి. మత ఘర్షణలను నిరసించే శాంతి కాముకుడిగా పేరు గడించారు. ఈయన వింగ్స్ ఆఫ్ ఫైర్, సైంటిస్ట్ టు ప్రెసిడెంట్ వంటి అనేక పుస్తకాలను రచించారు. 84 సంవత్సరాల వయసులో జూలై 27, 2015 సోమవారం సాయంత్రం షిల్లాంగ్‌లోని ఏఐఎంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ అబ్దుల్ కలాం మధ్యలో కుప్పకూలి పోయి, స్థానిక బెథాని ఆస్పత్రికి తరలించబడి, 45 నిమిషాల వ్యవధిలోనే కన్నుమూశారు.

**అక్టోబర్ 15... మిస్సైల్ మ్యాన్ జయంతి**
**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

## చతురాననుని సృష్టి

బ్రహ్మసృష్టి
అనిర్వచనీయం,అవ్యక్తం,చిత్రాతిచిత్రం,
వాచామగోచరం.
అజుని వ్రాత తెలియదు,
కమలజుని భావాలు తెలియవు.
పద్మభవుని చూడలేము,
విధాత లోకానికి వెళ్లలేము.

ద్రుహిణుడు పాదుగొలిపే జన్మ,
జీవుల కర్మఫలమే.
జీవకోటి సృష్టికి ప్రాతిపదిక
ప్రారబ్ధమే.
అఖిలమంతా మాయ,
ఈ మాయ అనంతం.
మాయాతీతులం కావడం ఎవరితరం?

పితామహుని సృష్టిలో అన్నీ విచిత్రాలే,
పరమేష్ఠి సృజనలో
అన్నీ అపురూప దృశ్యాలే.
వెన్నునికొమరుని
ఊహాతీత ఈ బ్రహ్మాండంలో అన్నీ
అగణితముగ్ధమనోహరదృశ్యాలే.

విశ్వంలో విరించిసృష్టి
కమలాసనుని సృజనే.
అబ్జయోనుని ఉత్పత్తి
అనితరసాధ్యం.

**- వేమూరి శ్రీనివాస్**
9912128967

ఎడిట్ పేజీ కోసం మీ
సామాజిక విశ్లేషణలు,
సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు
ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్

# నాణ్యతా ప్రమాణాలను పాటించాలి

వస్తువులన్నింటికీ నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని నిబంధనలు ఉన్నా, సర్వం నాసిరకం అవు తున్న నేటి పరిస్థితులలో ప్రభుత్వాలు ప్రతి వస్తువు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవ సరం అనివార్యంగా ఉంది.

ప్రపంచ లేదా అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 14న నిర్వహించ బడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు తమతమ దేశాలలో ప్రమాణాలను నిర్ణయించిన సందర్భంగా ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారు. అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఏఎస్ఎంఈ), ఇంటర్నేషనల్ ఎలక్ట్రో టెక్నికల్ కమిషన్ (ఐఈసీ), ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఓ), ఇంటర్నేషనల్ టెలి కమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయు), ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఈఈఈ), ఇంటర్నెట్ ఇంజనీరింగ్ టాస్క్ ఫోర్స్ (ఐఈటీఎఫ్) వంటి ప్రమాణాల అభివృద్ధి సంస్థలలో వినియోగ దారులు, నియంత్రకాలు మరియు పరిశ్రమలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రామాణీకరణ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం ఈ రోజు యొక్క ఉద్దేశ్యం. వేలాది మంది నిపుణుల కృషిని గుర్తు చేస్తూ జరుపు కుంటారు. 1946, అక్టోబరు 14న లండన్‌లో జరిగిన సమా వేశంలో 25 దేశాల ప్రతినిధులు పాల్గొని వినియోగ దారులకు ప్రామాణిక మైన, నాణ్యమైన వస్తు ఉత్పత్తులను అందించేం దుకు అంతర్జాతీయ ప్రమాణిక సంస్థను ఏర్పాటు చేసుకో వాలని నిర్ణయించారు. దానికి గుర్తుగా అక్టోబరు 14న




ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుప బడుతుంది. ఒక సంవత్సరం తరువాత అంతర్జాతీయ ప్రమాణిక సంస్థ ఏర్ప డినప్పటికీ, 1970 వరకు మొదటి ప్రపంచ ప్రమాణాల దినో త్సవం జరుపు కోలేదు. ప్రస్తుతం ఈ సంస్థలో 125 సభ్య దేశాలు ఉన్నాయి. ప్రామాణీకరణ యొక్క ప్రాముఖ్యత గురించి పరిశ్రమలు, వినియోగదారులలో అవగాహన పెంచుతారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలోని జాతీయ సంస్థలు వేరువేరు రోజుల్లో ఈ దినోత్సవాన్ని నిర్వహి స్తున్నాయి. 2014లో యునైటెడ్ స్టేట్స్ 2014, అక్టోబరు 23న ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహిం చింది. కెనడా దేశపు జాతీయ అక్రెడిటేషన్ బాడీ అయిన స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా (ఎస్.సి.సి) అంతర్జాతీయ సంస్థలతో కలిసి ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంటుంది. 2012లో స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా అక్టోబరు 12 శుక్రవారం రోజున ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంది. 1947లో భారతదేశంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ చట్టాన్ని ఆమోదించి బ్యూరోను ఒక శాసన బద్దమైనా సంస్థగా మార్చారు. అప్పటి నుంచే ఐ.ఎస్ .ఐ ముద్ర ప్రకటితమైంది. ఈ ముద్ర గల వస్తువులు నాణ్యత కలిగినది.

1947లో భారతీయ ప్రమాణాల సంస్థ మొదటి రెండు విభాగాలను ఏర్పాటు చేసింది. ఒకటి బట్టలకు, రెండవది ఇంజనీరింగ్కు సబంధించినది. ఈ సంస్థ నిర్ణయించిన తొలి ప్రమాణం ఏమిటో తెలుసా, మన జాతీయ పతాకం ఎంత పొడవు, వెడల్పు ఉండాలన్నది ఈ సంస్థ నిర్ణయించింది. 1951లో ఆనాటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ సంస్థ కార్యాలయంలో స్వీకరిం చారు. అంతే కాదు మెట్రిక్ విధానాన్ని దేశంలో 1955లో ప్రవేశ పెట్టారు. తర్వాత తూనికలు, కొలతల పరిమాణాన్ని చట్టాన్ని ఆమోదించింది. కాలక్రమంలో టెలి కమ్యూని కేషన్స్ టీకాలు, నూనె గింజలు, త్రాగునీరు, పాడి పరిశ్రమ వంటివి కూడా ఈ సంస్థ పరిధిలోకి చేర్చారు. ఐఎస్ఐ మార్కు సంస్థ అనుమతి లేనిదే ఎవరూ వాడ కూడదు. అన్ని సాంకేతిక పరీక్షలు, తనిఖీలు నిర్వహించిన దరిమిలా ఒక సంవత్సరానికి ఐఎస్ఐ లైసెన్స్ ఇస్తుంది. ప్రతీ సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలి. ప్రమాణాలు నిర్ణయించడానికి ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు ఈ రోజునే ప్రారంభించాయి. కనుక ఈ రోజున వరల్ స్టాండర్డ్స్ గా జరుపు కుంటారు.

**- ఆర్కేఎస్**
9440595494

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

## రైతులకు శాస్త్రీయ సూచనలు, సలహాలు అందించాలి

## పంటలు ఎండి పోకుండా విద్యుత్ సరఫరా చేయాలి

## రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**జగిత్యాల, అక్టోబర్ 14 (మనం ప్రతినిధి):** జగిత్యాల జిల్లాలో వ్యవసాయ శాఖ ఆత్మ (ఏటీఎంఏ) అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ సౌజన్యంతో నిర్వహించిన కిసాన్ మేళా-2026 కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎల్నినో ప్రభావం, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, రైతులకు అందించాల్సిన సహాయ సహకారాల పై వారు వివరించారు.

వాతావరణ మార్పులు, ఎల్నినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగంలో ఎదురయ్యే పరిస్థితులను రైతులు ముందుగానే అంచనా వేసుకొని పంటల సాగుపై ప్రణాళిక రూపొందించుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. వ్యవసాయం ప్రధాన జీవనాధారంగా ఉన్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు.

రైతులు సంప్రదాయ పంటల సాగుతో పాటు వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉండే ప్రత్యామ్నాయ పంటలను కూడా పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు అందించే సలహాలు, సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని పేర్కొన్నారు. నీటి లభ్యత, నేల స్వభావం, పంటకు అయ్యే పెట్టుబడి, మార్కెట్ లో ఉన్న డిమాండ్ ను పరిగణనలోకి తీసుకొని పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా రైతులు మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.

రైతులకు సాగు సమయంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటికి తగిన పరిష్కార మార్గాలను సూచించడం లో వ్యవసాయ శాఖ అధికారులు చురుకైన పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించాలని, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన పద్ధతులపై అవగాహన కల్పించాలని తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని అధికారులకు సూచించారు.

**జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ**

రైతులు వ్యవసాయంలో వస్తున్న ఆధునిక మార్పులను అందిపుచ్చుకొని, శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సూచించారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాల మేరకు ప్రత్యామ్నాయ పంటల సాగును పరిశీలించాలని తెలిపారు.

వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకొని, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. పంటల ఎంపిక నుంచి సాగు, ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ, పంట కోత వరకు ప్రతి దశలో శాస్త్రీయ పద్ధతులను పాటించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా నూతన వంగడాలు, ఆధునిక సాగు పద్ధతులు, పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు తమ అనుభవాలతో పాటు శాస్త్రవేత్తల సూచనలను సమన్వయం చేసుకుంటూ వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చుకోవాలని ఎమ్మెల్యే కోరారు.


**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ**

ఎల్నినో ప్రభావం, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు పంటల సాగులో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన పద్ధతులను అనుసరించడం ద్వారా పంట నష్టాల ముప్పును తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులకు అవసరమైన సమాచారం సకాలంలో అందేలా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, వాతావరణ పరిస్థితులు, పంటల ఎంపిక, విత్తనాల వినియోగం, ఎరువుల యాజమాన్యం, చీడపీడల నివారణకు సంబంధించిన సూచనలు అందించాలని తెలిపారు. రైతులు తమ భూముల స్వభావం, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటలను సాగు చేయాలని పేర్కొన్నారు.

పంటలు ఎండిపోకుండా, రైతులకు సాగు సమయంలో ఇబ్బందులు కలగకుండా అవసరమైన విద్యుత్ సరఫరా అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయానికి అవసరమైన సేవలు సకాలంలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించాలని తెలిపారు. కిసాన్ మేళాల ద్వారా రైతులకు నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనల ఫలితాలు, ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించడం ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకొని, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఉత్తమ రైతులకు మరియు ఉత్తమ వ్యవసాయ అధికారులకు సన్మానం చేశారు. అనంతరం అధికారులు ప్రజా ప్రతినిధులు రైతులు ప్రతిజ్ఞ చేశారు.

**కిసాన్ మేళాలో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన**

కిసాన్ మేళాలో భాగంగా వ్యవసాయ రంగంలో చేపడుతున్న పరిశోధనలు, నూతన సాగు పద్ధతులు, ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన వివిధ స్టాల్లను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఆయా స్టాల్లలో ప్రదర్శించిన వ్యవసాయ పద్ధతులు, పంటల నిర్వహణ విధానాలు, రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానం గురించి సంబంధిత నిపుణులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు వివిధ పంటల సాగులో పాటించాల్సిన పద్ధతులు, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాల్సిన విధానం, నీటి వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. రైతులు తమ సందేహాలను నిపుణులను అడిగి తెలుసుకొని, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను ఆచరణలో పెట్టాలని సూచించారు.కిసాన్ మేళా ద్వారా రైతులకు వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యామ్నాయ పంటల సాగు విధానాలపై అవగాహన పెంపొందించడంతో పాటు, వ్యవసాయాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సమాచారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



### దుర్గామాతను దర్శించుకున్న
## ఏసిఎస్ రాజు

**జగిత్యాల, అక్టోబర్ 14(మనం న్యూస్):** పురానిపేట ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ప్రతిష్ఠించిన శ్రీ భవాని భక్త బృందం వారి దుర్గామాతను సందర్శించిన ఏసిఎస్ రాజు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తి స్వరూపిణి దుర్గాదేవి అయిన అమ్మవారిని తొమ్మిది రోజులు పవిత్రంగా పూజించే పెద్ద పండగ అని ఈ తొమ్మిది రోజులు ఒక్కో రోజున ఒక్కో పేరుతో అమ్మవారిని అలంకరించి పూజిస్తామని చివర పదవ రోజున విజయదశమి జరుపుకుంటామని ఇది చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు అని, గత కొన్ని సంవత్సరాలుగా మన జగిత్యాల పట్టణంలో యువతలో చాలా మార్పు వచ్చిందని చాలామంది యువతీ యువకులు భవాని దీక్షలు తీసుకొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం హర్షించిదగిన విషయమనీ, యువతలో భక్తి భావన పెరగటం మంచి పరిణామం అని ఆ జగన్మాత కరుణా కటాక్షాలు సకల జీవులకు ఉండాలని అన్నారు.నాలుగో రోజు శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో ఉన్న దుర్గామాత దర్శనము చేసుకున్న వారిలో ఏసీఎస్ రాజు తో పాటు అబ్బాపూర్ మాజీ సర్పంచ్ యశోద రాజమౌళి, కాసబోయిన పెద్ద నరసయ్య, కస్తూరి రాజు లు ఉన్నారు.



### అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన
## ఎన్. ప్రసూనాంబ

**జగిత్యాల అక్టోబర్ 14(మనం న్యూస్):** జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా ఎన్. ప్రసూనాంబ బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జిల్లా అదనపు కలెక్టర్ గా పనిచేసిన రాజా గౌడ్ నిజామాబాద్ జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ప్రసూనాంబ బాధ్యతలు స్వీకరించారు.

## 15, 16 తేదీల్లో ఓటరు జాబితాల ప్రత్యేక నమోదు కార్యక్రమం

- **అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి**



**జగిత్యాల, అక్టోబర్ 14 (మనం ప్రతినిధి):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలోని వివరాల్లో తప్పులు ఉన్నవారు సవరణలు చేయించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని, అర్హులైన వారెవరూ ఓటు హక్కుకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు, పేరు తొలగింపు, చిరునామా మార్పు, ఇతర వివరాల సవరణలకు సంబంధించి అవసరమైన దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు. ప్రజలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సంప్రదించి ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో భాగస్వామి కావాలని అధికారులు సూచించారు.

జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓ) రెండు రోజులూ తప్పనిసరిగా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లను పరిశీలించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువత, ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటర్లు తమ వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కోరారు.

## ఆడబిడ్డల ఆత్మగౌరవం, సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

- **కలెక్టరేట్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు**
- **బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్**




**జగిత్యాల, అక్టోబర్ 14 (మనం ప్రతినిధి):** బతుకమ్మ సంబరాల్లో భాగంగా బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించగా ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవం సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ పేర్కొన్నారు. మహిళలు సమిష్టిగా బతుకమ్మ ఆడటం వల్ల సాంఘిక ఐక్యత బలపడుతుందని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజు ప్రత్యేకమైన పేర్లతో బతుకమ్మ పండగ మహిళలు నిర్వహిస్తారని, ఐదవ రోజు అట్ల బతుకమ్మ - అట్లు (దోశెలు) బతుకమ్మ - కాగా ప్రకృతి ప్రసాదించిన తంగేడు, గునగ, బంతి మరియు రంగు రంగుల పూలతో బతుకమ్మను అలంకరించి మహిళలు ఆట,పాటలతో పండుగ చేసుకోవడం నిజంగా కన్నులపండుగలా ఉందని ఈ వేడుకల్లో పాల్గొనడం అనందంగా ఉందన్నారు. అందరికి బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా అధికారులు,సిబ్బంది ఉత్సాహకంగా బతుకమ్మ పాటలు పడుతూ బతుకమ్మ ఆడారు. మహిళలు బతుకమ్మ నిమజ్జనం సమయంలో చెరువులు, కుంటలు, వాగుల వద్ద జాగ్రత్త వహించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ నిమజ్జనం ఏర్పాట్లు చేసినట్లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, డిడబ్ల్యూవో భాస్కర్,మహిళా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## 15,16 తేదీల్లో ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరాలు

**సిద్దిపేట, అక్టోబర్ 14 ( మనం ప్రతినిధి):**సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ 15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా పరిధిలోని 32-హుస్నాబాద్, 33-సిద్దిపేట, 41-దుబ్బాక, 42-గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కే హైమావతి తెలిపారు.ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణలో భాగంగా గైర్హాజరు, వలస వెళ్లిన, మరణించిన మరియు డూప్లికేట్ ఓటర్ల జాబితా (ఏఎస్డీ)లో పేరు తొలగించబడిన ఓటర్లకు, అలాగే తొలిసారిగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే 18 సంవత్సరాలు నిండిన యువతకు, ఓటరుగా నమోదు కావడానికి అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు నమోదు కాని వారికి భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది.ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో ఈ రెండు రోజుల్లో ఫారం-6 సమర్పించిన వారి వివరాలను నవంబర్ 9న ప్రచురించే తుది జాబితాలో చేర్చడానికి అవకాశం ఉంటుంది కాబట్టి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ రెండు రోజులు పాటు సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారు. ఓటరు నమోదు ప్రక్రియలో ప్రజలకు సహకరించాలని తెలిపారు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) కూడా శిబిరాల్లో పాల్గొనాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో చేరాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని, అర్హత ఉన్నవారు కొత్తగా నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు.

## నలంద డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**జగిత్యాల అక్టోబర్ 14 (మనం న్యూస్):** నలంద డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈరోజు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ వాణి శ్రీనివాస్ మరియు వార్డు మెంబర్ జుంబర్తి గంగ లక్ష్మి పాల్గొని విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ పూలనే దేవుడిగా భావించి పూజించే గొప్ప సంస్కృతి మన తెలంగాణది అని, దేవున్నే కాకుండా దేవున్ని పూజించే పూలను కూడా పూజించడం అంటే ప్రజల్లో చిన్న వ్యక్తులు పెద్ద వ్యక్తులు అని తేడా లేకుండా ప్రతి మనిషిని గౌరవించడం, ప్రతి మనిషిలో దేవుని చూడడం అనేది మన తెలంగాణ సంస్కృతి అని ఈ సంస్కృతిని విద్యార్థులకు అలవాటు చేస్తున్న నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్ మరియు వారి అధ్యాపక బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్‌ను కలిసిన జిల్లా అదనపు కలెక్టర్



**జగిత్యాల, అక్టోబర్ 14 (మనం న్యూస్):** జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా ఎన్. ప్రసూనాంబ బుధవారం బాధ్యతలు స్వీకరించగా మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ను కలిసి పుష్ప గుచ్ఛం అందించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బాధ్యతలను సమర్థవంతంగా ప్రజలతో మమేకమై నిర్వర్తించాలని జిల్లా కు రాష్ట్ర స్థాయి లో గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. అనంతరం జిల్లా పరిపాలన అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు.

## నిష్కల్మషమైన సేవతోనే దైవానుగ్రహం

- **శ్రీపీఠంలో మహాశక్తి యాగం నాలుగో రోజు పరిపూర్ణానంద స్వామి ప్రసంగం**
- **నవశక్తి హోమాలకు ప్రత్యేక ఏర్పాట్లు**

**కాకినాడ రూరల్, అక్టోబర్ 14(మనంన్యూస్):** మనసులోని అహంకారాన్ని విడిచిపెట్టి, నిష్కల్మషమైన హృదయంతో అమ్మవారికి సేవ చేసినప్పుడే నిజమైన ఆధ్యాత్మిక అనుభూతిని పొందగలమని పరిపూర్ణానంద స్వామి అన్నారు. పూజలు చేయడం, పుష్పాలు సమర్పించడం, హోమాల్లో పాల్గొనడం మాత్రమే కాకుండా ఆలయాన్ని శుభ్రం చేయడం, అన్నదానానికి సహకరించడం వంటి ప్రతి పనినీ అంకితభావంతో నిర్వహించాలని సూచించారు. కాకినాడ శ్రీ పీఠంలో జరుగుతున్న 'మహాశక్తి యాగం' కార్యక్రమం బుధవారం కూడా ఎంతో ఘనంగా జరిగింది. శ్రీపీఠంలో వేంచేసియున్న ఐశ్వర్యంబికా అమ్మవారు శ్రీ హరిద్రాదేవిగా దర్శనం ఇచ్చారు. నాలుగో రోజు కూడా భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పరిపూర్ణానంద స్వామి వారు మాట్లాడుతూ మనసనే హృదయపీఠంపై అహంకారానికి బదులుగా అమ్మవారిని కొలువుదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, నవశక్తి హోమాలు, ప్రకృతి పరిరక్షణ, సేవాభావం, దాతల సహకారం తదితర అంశాలను వివరించారు.

శ్రీపీఠంలో ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే విశేష హోమాలు రాత్రి 7.30 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. హోమాల అనంతరం బలిహరణ, అమ్మవారి కీర్తనలు, హారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. వివిధ ప్రాంతాల్లో ఉండి ప్రత్యక్షంగా హాజరుకాలేని భక్తుల కోసం సాయంత్రం జరిగే హోమాలు, కీర్తనలు, హారతి కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో నివసించే భక్తులు కూడా ఈ కార్యక్రమాలను వీక్షించే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. కాకినాడతో పాటు పరిసర ప్రాంతాల్లోని భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి యాగ ప్రాంగణానికి వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని పిలుపునిచ్చారు. మహాశక్తి యాగం కేవలం పూజా కార్యక్రమం మాత్రమే కాకుండా సేవాభావం, సమష్టి సంకల్పం, ప్రకృతి పరిరక్షణ, అహంకార విసర్జన వంటి విలువలను ఆచరణలో పెట్టే ఆధ్యాత్మిక వేదికగా నిలవాలని పరిపూర్ణానంద స్వామి ఆకాంక్షించారు.

## మృతుడి కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ప్రభుత్వం

### రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో మరణించిన సుదర్శన్ గౌడ్ కుటుంబానికి 6 లక్షల రూపాయల చెక్కును అందజేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల, అక్టోబర్ 14 (మనం న్యూస్):** రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన జగిత్యాల జిల్లా హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ కుటుంబం చేసిన విజ్ఞప్తిపై సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్కుమార్ ప్రత్యేకంగా చొరవ తీసుకుని ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో, సీఎం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి రూ.6 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు అట్టి ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల జిల్లా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తో కలిసి బాధిత కుటుంబానికి అందజేశారు. ఉపాధి కోసం సుమారు నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్కు వెళ్లిన సుదర్శన్ గౌడ్.. అక్కడ కొనసాగుతున్న యుద్ధంలో క్షిపణులు, డ్రోన్ దాడుల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సుదర్శన్ గౌడ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో ప్రభుత్వం బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియా వెళ్లి అనారోగ్యానికి గురై కాళ్ళు చేతులు పోగొట్టున్న అబ్బాడి శ్రీనివాస్ ను పరామర్శించి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు గజంగి నందయ్య జిల్లా మండల నాయకులు ఎన్నారై సెల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా శ్రీ విద్యా సరస్వతి దివ్య దర్శనం


**వర్గల్ అక్టోబర్ 14 (మనం న్యూస్):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వర్గల్ శ్రీ విద్యా సరస్వతి దేవి శరన్నవరాత్ర మహోత్సవాల్లో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం హిందూ ధర్మంలో ఆదిశక్తి అత్యున్నత రూపమైన శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు శ్రీ విద్యాధరి అమ్మవారికి విశేషాభిషేకం, గణపతి పూజ, సుప్రభాతం, గిరి ప్రదక్షణం, అలంకారం, పంచ హారతులు, చతుషష్టి పచార పూజ, రాజోపచార పూజలు, చండీ హోమం తదితర ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు.

# మహంకాళి అమ్మవారికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు

## శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

## ప్రజలంతా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థన

**పటాన్‌చెరు, అక్టోబర్ 14 (మనం న్యూస్):** శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పటాన్చెరు పట్టణంలోని శ్రీ మహంకాళి దేవాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యతను చాటుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ సపాన దేవ్, పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రకాష్ రావు, చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, మాణిక్ ప్రభు, మల్లేష్, వినోద్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## భారతీయ వైద్య సంఘం అధ్వర్యంలో

# బతుకమ్మ సంబరాలు



గజ్వేల్ అక్టోబర్ 14 మనం న్యూస్: గజ్వేల్ పట్టణంలోని భారతీయ వైద్య సంఘం భవణంలో మహిళా వైద్యుల అధ్వర్యంలో 'బతుకమ్మ సంబరాలు' కార్యక్రమం మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. సృజనాత్మకత ఉట్టి పడేలా అనేక రకాల బతుకమ్మలను తయారు చేసి వైద్యులు తమ తమ కుటుంబాలతో పాల్గొని ఆట పాటలతో అలరించారు. ప్రబోదాత్మకంగా తయారు చేసిన బతుకమ్మలకు బహుమతులు అందజేయడం జరిగింది. మన పండుగల విశిష్టత గురించి ప్రహేళిక(క్విజ్) పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డా. పద్మజ్యోతి, డా. శైలజ, డా. మంజుల, డా. సుజాత, డా. స్రవంతి, డా. గీత, డా. శ్రీలత, డా. మాధవి, డా. సమీక్ష, డా. అఖిల, డా. హైమావతి,డా. ప్రశాంతి, డా. రచన,డా. జ్యోతిర్మయి, రమాదేవి, పద్మావతి, డాక్టర్ రవళి, డా. నరేశ్ బాబు, మల్లయ్య, పెంటాచారి, సద్గుణాచారి, లింగం, నాగమునెయ్య, సాయినాథ్ రెడ్డి, రాజేశ్ కుమార్, కుమార స్వామి,రాజకుమార్, మహిపాల్, శ్రీధర్, సాయి మహేష్, సత్యనారాయణ, అశ్విన్, రవిచంద్ర, సంతోష్, ప్రేమ్ కుమార్, డాక్టర్ చైతన్య ఆనంద్ , ప్రవీణ్ తదితరులు కుటుంబాలతో సహా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఐ. ఎమ్. ఎ. గజ్వేల్ శాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు డా. పద్మజ్యోతి మాట్లాడుతూ

గత సంవత్సరం నుండి గజ్వేల్ ఐ. ఎమ్. ఎ. భవణంలో మహిళా వైద్యుల అధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు జరుపుకుంటున్నామనీ, తద్వారా మన సంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందజేయడం జరుగుతుందనీ, వైద్యుల కుటుంబాల మధ్య ఆత్మీయత, బంధుభావన పరిఢవిల్లుతుందని తెలిపారు. డా. పెంటాచారి మాట్లాడుతూ పూలనే బతుకమ్మ దేవతగా భావించి పూజించే సంస్కృతి మన తెలంగాణ ప్రత్యేకత అని కొనియాడారు.

డా. నరేశ్ బాబు మాట్లాడుతూ ఇలాంటి సామూహిక ఉత్సవాల ద్వారా హిందూ సమాజంలో ఆత్మీయత, బంధుభావన నెలకొల్పి, హిందూ సమాజాన్ని సంఘటితం చేసి, వారిని దేశం హితం కోసం, ధర్మ రక్షణ కోసం కర్యోన్ముకుల్ని చేయాలి అని పిలుపునిచ్చారు.

సమాజంలో మార్పు కోసం ప్రతి పౌరుడు పంచ సూత్రాలైన స్వదేశీ, సామాజిక సమరసత, పౌర విధుల పాలన, పర్యావరణ పరిరక్షణ పాటించాలనీ, మన హిందూ సమాజంలో గతంలో అవలంబించిన ఉమ్మడి కుటుంబ విలువలను ప్రోత్సహించాలని కోరారు.

# మద్యం సేవిస్తే వాహనాన్ని నడపకూడదు

## వాహనాన్ని నడవాలంటే మద్యాన్ని సేవించకు

## మద్యం సేవించి వాహనాలను నడిపిన 42 మందికి జైలు శిక్ష

## ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ

**గజ్వేల్, అక్టోబర్ 14 మనం న్యూస్:** మద్యం సేవిస్తే ఎవరైనా సరే వాహనాన్ని నడపవద్దని అలాగే వాహనాలను నడపాలనుకుంటే మద్యాన్ని సేవించవద్దని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ ప్రజలకు సూచించారు.

మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎన్నో విలువైన ప్రాణాలు రోడ్డు ప్రమాదాల్లో బలవుతున్నాయని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సత్యనారాయణ ప్రజలను కోరారు.



బుధవారం నాడు ఇటీవల కాలంలో మద్యం సేవించి పట్టుబడిన వారందరినీ పట్టణంలోని మునిసిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా నలభై రెండు మందికి జైలు శిక్షలు న్యాయమూర్తి విధించడం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తాగిన మత్తులో వాహనం నడపడం వల్ల డ్రైవర్ తో పాటు ఎదుటి వారి ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందన్నారు. ఈ విషయాన్ని గమనించిన ప్రభుత్వం డ్రంక్ అండ్ డ్రైవ్ పై కఠిన చర్యలు తీసుకుంటోందని, పట్టుబడితే రూ.10 వేల జరిమానా, జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. వాహనదారులు 'తాగితే బండి నడపకు, బండి నడిపితే తాగకు' అనే నినాదాన్ని పాటించాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన గజ్వేల్ పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు ఈ సందర్భంగా దసరా, దీపావళి పండుగలు వస్తున్న వేళ మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు, కార్లు నడపవద్దు. మీ కుటుంబం మీ కోసం ఇంట్లో ఎదురు చూస్తుంటారు, కావు న మీ నిర్లక్ష్యం ఒక కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుంది. సురక్షితంగా ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన సందేశాన్ని ఇచ్చారు.

# జాతీయ స్థాయి యోగాసన పోటీల్లో సత్తా చాటిన చిన్నారి వాసవి

- ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అభినందనలు
- జాతీయ స్థాయిలో ఐదో స్థానం సాధించిన బాలికకు ఘన సత్కారం



**రామచంద్రపురం, అక్టోబర్ 14 (మనం న్యూస్):** విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం ఎంతో ముఖ్యమని, యోగాసనాల సాధనతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. జాతీయ స్థాయి యోగాసన పోటీల్లో ప్రతిభ కనబరిచి ఐదో స్థానం సాధించిన సంగారెడ్డి పట్టణానికి చెందిన చిన్నారి వాసవి నిద్రాభంగిని ఆయన అభినందించారు. రాజస్థాన్లోని జైపూర్ నగరంలో అక్టోబర్ 3 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన 51వ సబ్-జూనియర్, జూనియర్ నేషనల్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్షిప్-2026లో వాసవి తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో సబ్-జూనియర్ గ్రూప్-ఏ (8-10 సంవత్సరాల బాలికల విభాగం)లో అత్యంత క్లిష్టమైన యోగాసనాలను ప్రదర్శించి జాతీయ స్థాయిలో ఐదో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. చిన్న వయసులోనే జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన వాసవి, సంగారెడ్డి జిల్లాకు గర్వకారణంగా నిలిచారని అంజిరెడ్డి ప్రశంసించారు. ఈ సందర్భంగా రామచంద్రపురంలోని తన నివాసంలో వాసవిని కుటుంబ సభ్యులతో కలిసి కలుసుకున్న ఆయన, శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి తగిన ప్రోత్సాహం అందించడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని ఆయన కొనియాడారు. భవిష్యత్తులోనూ వాసవి మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరితో పాటు పలువురు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.



**సంగారెడ్డి, అక్టోబర్ 14 మనం ప్రతినిధి :** విధి నిర్వహణలో నిరంతరం శ్రమించే పాత్రికేయులు తమ ఆరోగ్య పరిరక్షణకు తగిన ప్రాధాన్యమివ్వాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.సనైజ్ ఆసుపత్రి, సహకారంతో, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సనైజ్ ఆసుపత్రి లో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల సేవలు అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే పని ఒత్తిడి, సమయాభావం కారణంగా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నివారించవచ్చునితెలిపారు.జర్నలిస్టులు,తమతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు.ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు ఉచిత వైద్య సంప్రదింపులు అందించడంతోపాటు అవసరమైన వారికి ఈసీజీ, 2డీ ఎకో, రక్త పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండె, ఊపిరితిత్తులు, ఎముకలు, కీళ్లు, మధుమేహం, నాడీ సంబంధిత సమస్యలతోపాటు మహిళల ఆరోగ్య సమస్యలకు వైద్య సేవలు అందించారు.

ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైజల్ అలీ, జిల్లా అధ్యక్షుడు బండారి యాదగిరి, టీవీన్జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ, సనైజ్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ స్వామి గౌడ్, రథసారథి తెలుగు దినపత్రిక సంపాదకుడు సంతోష్ గౌడ్, జర్నలిస్టు సంఘాల నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపం బతుకమ్మ
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, అక్టోబర్ 14 మనం న్యూస్ ప్రతినిధి :** ప్రపంచంలో పూలతో జరుపుకునే అరుదైన పండుగ బతుకమ్మ అని, తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సాంస్కృతిక వైభవానికి ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టరేట్ రెవెన్యూ శాఖ, ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సంగీత పాల్గొని బతుకమ్మ పూజాకార్యక్రమాలు నిర్వహించి, బతుకమ్మ ఆడారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. బతుకమ్మను తెలంగాణ ఇంటి మహాలక్ష్మిగా భావిస్తారని పేర్కొన్నారు. పండుగ విశిష్టతను చాటిచెప్పేలా ఆహ్లాదకరమైన వాతావరణంలో వేడుకలు నిర్వహించాలని,అన్నారు . కలెక్టరేట్లో ప్రాంగణంలో నేటినుండి అక్టోబర్ 17 వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలు, యువత, మహిళా ఉద్యోగులు, మహిళలు , కలెక్టరేట్ చుట్టుపక్కల గల కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు . శాఖల వారీగా బతుకమ్మ సంబురాల నిర్వహణకు రోజువారీ షెడ్యూల్ను రూపొందించడం జరిగింది . వివిధశాఖల తో బతుకమ్మ సంబురాలు ఈ నెల 17 వరకు కలెక్టరేట్ ప్రాంగణంలో పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు ,మహిళలా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు.

# నిర్ణీత గడువులోగా భూ రీసర్వే పూర్తి చేయాలి

- అధికారులకు కలెక్టర్ ప్రియాంక ఆదేశాలు
- 20 రోజుల్లో పనులు ముగించాలి: జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట, అక్టోబర్ 14(మనం న్యూస్):** జిల్లాలో చేపడుతున్న భూ రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక రెవెన్యూ, సర్వే శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం మరికల్ మండలం వెంకటాపూర్ గ్రామంలో ప్రత్యేక సర్వే బృందాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి, పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు చేసిన, శిక్షణ పొందిన సర్వే బృందాల సేవలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్లను ఆదేశించారు. రీసర్వే పనుల పురోగతిని జిల్లా యంత్రాంగం ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. నిర్దేశించిన పనులన్నింటినీ రాబోయే 20 రోజుల్లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

అనంతరం రైతులతో మాట్లాడిన కలెక్టర్.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూ రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. భూముల కొలతలను కచ్చితత్వంతో చేపట్టి, భూహద్దులను స్పష్టంగా నిర్ధారించేందుకు ఆధునిక రోవర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. భూ సరిహద్దుల నిర్ధారణతో పాటు రెవెన్యూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత పెంచేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుందని పేర్కొన్నారు. తద్వారా భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా నివారించవచ్చని తెలిపారు.

వెంకటాపూర్ గ్రామంలో మొత్తం 640 ఎకరాల భూమి ఉందని అధికారులు కలెక్టర్కు వివరించారు. భూ రికార్డుల ఆధారంగా రీసర్వే నిర్వహించి, 108 మందికి ఫారం-11 జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఎక్లాస్పూర్ గ్రామంలోనూ 24 మందికి సంబంధించి రీసర్వే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. సర్వే బృందాల్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకోగా, ప్రస్తుతం 24 మంది చొప్పున్ను విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. భూ రీసర్వే ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రైతులు, గ్రామస్థులు సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ రామ్మోటి, రెవెన్యూ, సర్వే శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగాన్ని ఆదుకోండి

- జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి
- గోదారి జలాలతో చెరువులు, కుంటలు నింపాలి
- రైతు సంఘం నేత బాగం
- రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా




ఖమ్మం, అక్టోబర్ 14(మనం న్యూస్): ఎల్నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ఇప్పటికే రైతులు ఒక్కో ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారని ఇప్పుడు పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. దాదాపు రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. రైతాంగాన్ని ఆదుకోవాలని గోదావరి జలాలతో చెరువులను నింపాలని, రైతులకు కరువు పరిహారం ఇవ్వాలని నినదించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో లోటు వర్షపాతం నమోదైన జిల్లాల్లో ఖమ్మం ఒకటని 16 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ఆయన తెలిపారు. తక్షణం కరువు ప్రాంతంగా ప్రకటించి ఒక్కో ఎకరానికి పరిహారంగా రూ.30 వేలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు అడుగంటాయని భూగర్భ జల నీటిమట్టం కనిష్ట స్థాయికి చేరుకుంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో విఫలమైందని కనీసం చేతికి అందిన పంటలనైనా కాపాడేందుకు ప్రయత్నం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో పాలేరు రిజర్వాయర్కు గోదావరి జలాలను అందించే ప్రక్రియను తక్షణం పూర్తి చేయాలని ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమైనంత మేరకు గోదావరి జలాలతో చెరువులు, కుంటలను నింపాలని ఆయన డిమాండ్ చేశారు. పొరుగురాష్ట్రాలు ఇప్పటికే కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకునేందుకు చర్యలు చేపట్టాయని కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఆ దిశగా ఆలోచన చేయడం లేదని హేమంతరావు తెలిపారు. యూరియా యాప్ను రద్దు చేయాలని, బహిరంగ మార్కెట్లో యూరియాతో పాటు ఇతర రసాయనిక ఎరువులను విక్రయించాలని ఆయన డిమాండ్ చేశారు. సన్న వడ్లకు సంబంధించి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం మద్దతు ధరను పెంచాలని హేమంతరావు కోరారు. కౌలు రైతులను గుర్తించి పంటలకు నష్టపరిహారం ఇప్పించాలని ఆయన తెలిపారు. గ్రామస్థాయి నుంచి కరువు ఉపశమన చర్యలు చేపట్టడంతో పాటు పశువులకు మేత సరఫరా చేయాలని వరికి ఎకరాకు రూ.30వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ. 50వేల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. నిత్యావసర వస్తువులను చౌక దుకాణాల ద్వారా అందించాలని హేమంతరావు కోరారు. ప్రభుత్వం తగు రీతిలో స్పందించక పోతే రైతులను సమీకరించి ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, రైతు సంఘం నాయకులు ఏపూరి లతాదేవి, మిడికంటి వెంకటరెడ్డి, బానోత్ రాంకోటి, వెంకటేశ్వర్లు, స్వర్ణ రమేష్, పావులూరి మల్లికార్జున్, బాగం ప్రసాద్, దొబ్బల వెంగళరావు, వెన్నం భాస్కర్, మామిళ్ల సుదర్శనెడ్డి, ఏలూరి భాస్కర్ పాల్గొన్నారు. అనంతరం డిమాండ్స్ కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టివిస్కు అందజేశారు.



## ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

- జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 14 (మనంప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు, ఈ నెల15 మరియు 16 తేదీలలో జిల్లాలోని ప్రతి పోలింగ్ స్టేషన్లో ఓటర్ల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించబడనున్నాయని జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాల సందర్భంగా సంబంధిత బూత్ స్థాయి అధికారులు ( బి ఎల్ ఓలు) తమ తమ పోలింగ్ స్టేషన్లలో ప్రజలకు అందుబాటులో ఉంటారని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని, తమ ఓటు వివరాలు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో తమ పేరు నమోదు కానివారు ఫారం-6 ద్వారా కొత్త ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ అంకిత్ తెలిపారు. అదేవిధంగా, 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతీ యువకులు కూడా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ సమీపంలోని పోలింగ్ స్టేషన్లో నిర్వహించే ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకొని, ఓటరు జాబితాలో తమ పేరు నమోదై ఉందో లేదో నిర్ధారించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు.

### కన్నెగంటి వెంకటయ్యకు దాశరథీ సినారె గజల్

# కవి పురస్కారం ప్రదానం



ఖమ్మం, అక్టోబర్ 14(మనం న్యూస్): తెలుగు సాహిత్య ప్రక్రియలో విశిష్టమైన గజల్ ప్రక్రియలో రచనా ,గాన కళలో చేసిన సేవలకు గుర్తింపుగా ప్రముఖ సాహితీవేత్త, గాయకుడు, ప్రధానోపాధ్యాయుడు కన్నెగంటి వెంకటయ్యకు ప్రతిష్టాత్మకమైన దాశరథీ సినారె గజల్ కవి పురస్కారం లభించింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గజల్ గాయకుడు మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ 50 వసంతాల సంగీత ఉత్సవం, 40 వసంతాల తెలుగు గజల్ గాన వేడుకలు, అరవై వసంతాల తెలుగు గజల్కు నీరాజనం మహోత్సవం బుధవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా పరిషత్ రోడ్డులోని భారతీయ విద్యా భవన్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను గజల్ చారిటబుల్ ట్రస్ట్ (ఆంధ్రప్రదేశ్), భారతీయ విద్యా భవన్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సభా వేదికపై కన్నెగంటి వెంకటయ్యకు, డాక్టర్ గజల్ శ్రీనివాస్, విల్సన్ శరత్ చంద్ర చేతుల మీదుగా శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రం, విశిష్ట పురస్కార జ్ఞాపికను అందజేశారు. తెలుగు గజల్ వైభవాన్ని నలుదిశలా చాటిచెప్పే దిశగా ఆయన చేసిన సాహిత్య కృషిని ఈ సందర్భంగా ప్రముఖులు కొనియాడారు. తెలుగు గజల్ దిగ్గజాలు కి. శే సి. నారాయణరెడ్డి (సినారె), దాశరథి వంటి మహనీయుల స్ఫూర్తితో సాగుతున్న తన సాహితీ ప్రయాణంలో ఈ పురస్కారం తెలుగు గజల్ రచన పట్ల బాధ్యతను మరింతగా పెంచిందనీ కన్నెగంటి వెంకటయ్య తెలిపారు. ఈ గౌరవాన్ని అందించిన డాక్టర్ గజల్ శ్రీనివాస్ కి, గజల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు, ధన్యవాదాలు తెలిపారు.



## వేణు కుటుంబానికి ఐజెయూ నేతల పరామర్శ

ఖమ్మం, అక్టోబర్ 14 (మనం న్యూస్): టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్ కుటుంబాన్ని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విరహత్ అలీ, కె.రాంనారాయణ పరామర్శించారు. ఇటీవల మాటేటి వేణుగోపాల్ తండ్రి మాటేటి శ్రీరావు మృతిచెందిన విషయం విధితమే. బుధవారం స్థానిక యూనియన్ నాయకులతో కలిసి కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేణుగోపాల్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శ్రీరావు మృతిపట్ల తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు రవీంద్ర శేషు, నలజాల వెంకట్రావు, రాజేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, నాయకులు నర్వనేని వెంకట్రావు, వనం వేణుగోపాల్, ఎస్కి మోహినుద్దీన్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం, మేడి రమేష్, రాయల బసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవి-ఎయిడ్స్ నివారణ కార్యకలాపాలపై సమీక్ష

- డిఎంఅండ్హెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్
- ఫాలో అప్ చేయడంలో శ్రద్ధాలోపం!



భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 14 (మనం ప్రతినిధి):భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో హెచ్ ఐ వి - ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కార్యకలాపాల అమలు మరియు పురోగతిపై డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ తుకారాం రాథోడ్, ప్రోగ్రాం ఆఫీసర్ (ఎయిడ్స్ కుష్ఠు వ్యాధి నివారణ) డాక్టర్ ప్రసాద్ అధ్యక్షతన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ ప్రసాద్ సంబంధిత కేంద్రాల పనితీరును మరియు వివిధ కార్యక్రమ కార్యకలాపాల పురోగతిని సమీక్షించారు. సేవా విధానాన్ని మెరుగుపరచడం, నిర్దేశిత లక్ష్యాలను సాధించడం, హెచ్ ఐ వి పరీక్ష మరియు కౌన్సెలింగ్ సేవలను బలోపేతం చేయడం, హెచ్ ఐ వి పాజిటివ్ వ్యక్తులను సకాలంలో యాంటీ-రెట్రోవైరల్ థెరపీ (ఎఆర్టి)కి అనుసంధానించడం మరియు లబ్ధిదారుల పర్యవేక్షణను (ఫాలో అప్) మెరుగుపరచడం వంటి అంశాలపై ఆయన తగిన సూచనలు జారీ చేశారు. హెచ్ ఐ వి - ఎయిడ్స్ కార్యక్రమ సిబ్బంది మధ్య సమర్థవంతమైన సమన్వయం, రికార్డుల ఖచ్చితమైన నిర్వహణ, నివేదికల సకాలంలో సమర్పణ, కార్యక్రమ పనితీరును మెరుగుపరచడానికి ప్రత్యేక కృషి అవసరమని ఆయన నొక్కి చెప్పారు. సేవా విధానంలో ఉన్న లోపాలను గుర్తించి, హెచ్ ఐ వి, ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ కార్యక్రమ లక్ష్యాలను సాధించడానికి తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా హెచ్ ఐ వి, ఎయిడ్స్ నివారణ, చికిత్స, సంరక్షణ మరియు సహాయక సేవలను బలోపేతం చేసే దిశగా అంకితభావంతో మరియు సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎ ఆర్ టి కేంద్రాలు, ఐ సి టి సిలు, డి ఎస్ ఆర్ సిలు, టిఐ స్వచ్ఛంద సంస్థలు (ఎన్ జి ఓలు), సి ఎస్ సి - విహాన్ 2.0 మరియు వై ఆర్ జి లింక్ వర్కర్ పథకానికి చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

**పోలో అప్ చేయడంలో శ్రద్ధాలోపం!**

ఇదిలా ఉండగా, హెచ్ఐవి- ఎయిడ్స్ బారిన పడిన వారిని గుర్తించిన అనంతరం, వారికి సకాలంలో 'ఎఆర్టి ' మందులు అందిస్తున్నప్పటికీ, వారికి అనంతరం వచ్చే దుష్పరిణామాలపై సంభందిత ఉద్యోగులు, సిబ్బంది వారిని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలే ఈ వ్యాధి సోకిన వారిపట్ల సమాజం వివక్ష చూపిస్తున్న తరుణంలో, సంభందిత ఉద్యోగులు వారిపట్ల బాధ్యతతో వ్యవహరించడం లేదని, మందులు వాడుతున్న అనంతర పరీక్షల పట్ల శ్రద్ధ వహించడం లేదని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా, సంభందిత ఉద్యోగులు వీరి పట్ల శ్రద్ధ వహించి, వీరికి సకాలంలో తగిన వైద్య పరీక్షలు నిర్వహించడం, ఎఆర్టి మందులు తీసుకుంటున్న సమయంలో, వీరి ఆరోగ్యం పట్ల తగిన మానిటరింగ్ చేయడం, సాధారణ వ్యక్తుల లాగానే, వీరికి వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల, అవగాహన కల్పించి తగిన మందులను అందజేయడం, వీరికి సలహాలు సూచనలతో అందుబాటులో ఉండడం, వీరి పట్ల దయతో వ్యవహరించడం చేసి వీరికి సకాలంలో తగిన వైద్య సహాయం అందించేందుకు కృషి చేయాలని వారు కోరుకుంటున్నారు.

# హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్లో క్యాన్సర్పై అవగాహన



ఖమ్మం, అక్టోబర్ 14(మనం న్యూస్): హార్వెస్ట్ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు, సిబ్బందికి క్యాన్సర్పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెనోవా హాస్పిటల్స్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రోజా కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై క్యాన్సర్పై ఉపాధ్యాయులు, సిబ్బందికి క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన పలు అంశాలను వివరించారు. క్యాన్సర్పై సమాజంలో ఉన్న అపోహలను తొలగించుకోవాలని సూచించారు. శరీరంలో అసాధారణ మార్పులు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించడం, వైద్యుల సూచనల మేరకు అవసరమైన పరీక్షలు చేయించుకోవడం ఎంతో ముఖ్యమని, మన శరీరంలో కనిపించే కొన్ని అసాధారణ మార్పులను నిర్లక్ష్యం చేయకూడదు. శరీరంలో ఎక్కడైనా గడ్డలు ఏర్పడటం, కారణం తెలియకుండా బరువు తగ్గడం, అసాధారణ రక్తస్రావం, దీర్ఘకాలంగా తగ్గని పుండ్లు, మింగడంలో ఇబ్బందులు లేదా ఎక్కువకాలం కొనసాగుతున్న దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి. ఈ లక్షణాలు కనిపించినంత మాత్రాన క్యాన్సర్ ఉన్నట్లు కాదని, వాటికి గల కారణాన్ని తెలుసుకోవడం అవసరమని పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపల్ పార్వతీరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండటం, సమతుల ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా కొన్ని రకాల క్యాన్సర్ల ముప్పును తగ్గించుకోవచ్చని వివరించారు. క్యాన్సర్పై సరైన అవగాహన కలిగి ఉండటంతో పాటు, అవసరమైనప్పుడు వైద్య సలహాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.

# రీసర్వే పనులను గడువులోగా పూర్తి చేయాలి

- రీసర్వే సమయంలో రైతులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలి
- లచ్చగూడెం రెవెన్యూ గ్రామంలో రీసర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్



చింతకాని, అక్టోబర్ 14(మనం న్యూస్): జిల్లాలో చేపడుతున్న రీసర్వే పనులను ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశిత నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం ఖమ్మం జిల్లాలోని చింతకాని మండలం లచ్చగూడెం రెవెన్యూ గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే పనులను అదనపు కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రీసర్వే ప్రక్రియ పురోగతిని సమీక్షించి, సర్వే పనులు సక్రమంగా నిర్వహించేలా సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే పనులను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియలో సంబంధిత భూముల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ, రికార్డుల ప్రకారం సర్వే పనులు చేపట్టాలని తెలిపారు. రీసర్వే నిర్వహించే తేదీ, సమయం గురించి సంబంధిత రైతులకు ముందుగానే సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండేలా చూడాలని, తద్వారా భూముల హద్దులు, ఇతర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. రైతులకు ముందస్తు సమాచారం అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని, సర్వే ప్రక్రియలో రైతుల భాగస్వామ్యాన్ని నిర్ధారించాలని సూచించారు. రీసర్వేకు సంబంధించిన పనులను సమన్వయంతో నిర్వహిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. రీసర్వే ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత కాలపరిమితిలో సర్వే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనుల్లో జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం
- వైరా పట్టణంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తో కలిసి పర్యటించిన కలెక్టర్



ఖమ్మం, అక్టోబర్ 14(మనం న్యూస్): వైరా మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వైరా మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.
నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంపై కాంట్రాక్టు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో జాప్యాన్ని నివారించి, నిర్దేశిత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం రింగ్ రోడ్డు సెంట్రల్ నుంచి వైరా రిజర్వాయర్కు వెళ్లే రహదారిని కలెక్టర్ పరిశీలించారు. రిజర్వాయర్ గుట్టపై పర్యాటక అభివృద్ధికి, రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో పనులకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. మార్కెట్ నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.
అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు, ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పాలక వర్గం, మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ట సంతోష్, డాక్టర్ కాపా మురళీకృష్ణ, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నోటీసుల పంపిణీ, విచారణ పూర్తి చేయాలి

- కలెక్టర్ దివాకర టిఎస్
- 1,58,144 మంది ఓటర్ల విచారణ పూర్తి
- ఫారం-6 పెండింగ్ దరఖాస్తులను వచ్చే వారంలోగా పరిష్కరించాలి
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ఎస్ఐఆర్ 2026, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదుపై
- వివిధ రాజకీయ పార్టీలతో సమీక్షించిన కలెక్టర్



ఖమ్మం, అక్టోబర్ 14(మనం బ్యూరో): ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా పెండింగ్లో ఉన్న నోటీసుల పంపిణీ, విచారణలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమం, ఎమ్మెల్సీ ఓటరు జాబితా నమోదుపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా ₹జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ₹ జిల్లాలో మొత్తం 1,75,841 నోటీసులకు గాను ఇప్పటివరకు 1,630 నోటీసుల పంపిణీ మాత్రమే పెండింగ్లో ఉన్నాయని 99.07 శాతం నోటీసుల పంపిణీ పూర్తయిందని తెలిపారు. 1,58,144 మందికి విచారణ పూర్తి చేశామని వెల్లడించారు. మిగిలిన విచారణలను నవంబర్ నాటికి పూర్తి చేయాలని, ఓటర్ల నుంచి స్వీకరించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన వారిని ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఫారం-6 దరఖాస్తులను వచ్చే వారంలోగా పరిష్కరించాలి**

జిల్లాలో ఫారం-6కు సంబంధించి మొత్తం 6,435 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వీటి పరిష్కారంపై ఈఆర్ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులను సమీక్షించి వచ్చే వారంలోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. అర్హులైన దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు.

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి:**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో ఇప్పటివరకు జిల్లాలో సుమారు 27 వేల మంది నమోదు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. గతంలో 84 వేల మంది ఓటర్లుగా నమోదయ్యారని పేర్కొన్నారు. ఈసారి కనీసం 2 లక్షల మంది గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. నవంబర్ 6 ఓటరు నమోదు చివరి తేదీ కావడంతో అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించి, నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేలా కృషి చేయాలని అన్నారు.

**మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలి:**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, నమోదు ప్రక్రియపై సామాజిక మాధ్యమాలు, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ ఛానళ్ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా అర్హులైన గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పించి, ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి.శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, భారత రాష్ట్ర సమితి ప్రతినిధులు బి. వేణుగోపాల్, ఎం. రమేష్, ఏ. సతీష్ బాబు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి వి. రాజేష్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, సీపీఎం పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మహా చండి దేవి అలంకరణలో దర్శనం



**కాట్రేనికోన అక్టోబర్ 14 మనం ప్రతినిధి:** శ్రీ శ్రీ శ్రీ పట్టాభిరామ స్వామి ఆలయంలో కోలు వై యు న్న శ్రీ విజయ దుర్గ అమ్మవారి శ రన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా 4 వ రోజు శ్రీ మహా చండి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమించారు. ఈ సందర్భంగా వివిధ రకాల కూరగాయలతో శాకాంబరీ దేవీ గా అలంకరించారు.అమ్మవారి శాకాంబరీ దేవీ అలంకారం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది 4 వ రోజు పూజ చేయించుకున్న దంపతులు పొత్తూరి సత్య నారాయణ రాజు, వీణా రాణి దంపతులు మరియు పత్సమంట్ల సూర్య నారాయణ రాజు, లక్ష్మీ కుమారి . అధిక సంఖ్యలో కుంకుమ పూజలు జరిగాయి. మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

## నవరాత్రులలో బాలా పూజ

**మహానంది, అక్టోబర్ 14(మనంన్యూస్):** నవరాత్రి ఉత్సవాలలో నవావరణార్చన బాల,కుమారి, సుహాసిని 3 దశలుగా వుంటుందని మహానంది దేవస్థానం వేదపండితులు రవిశంకర్ అవధాని తెలిపారు. శ్రీ చక్రం సాక్షాత్తు లలితా శ్రీ త్రిపురసుందరి కామేశ్వరి యొక్క యంత్ర రూపమని శ్రీ చక్రార్చనలో అమ్మవారిని వివిధ ఆవరణ రూపాలలో పూజిస్తారన్నారు.వీటిలో బాలా త్రిపురసుందరి దేవి స్వరూపానికి ప్రత్యేక ప్రాధాన్యత వుందని,బాలా పూజను ఆచరించడం ద్వారా ఎంతో మంచిదన్నారు.

# బతుకమ్మ బతుకమ్మ... ఉయ్యాలో...



**ప్రకృతిని ఆరాధిస్తూ పుడమి తల్లి గొప్పదనాన్ని కీర్తిస్తూ మురిసిపోయే క్షణాలకు వేదిక. తెలంగాణ అస్తిత్వానికి సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా భావించే బతుకమ్మ పండుగ తొమ్మిది రోజుల పాటు జరుగుతుంది. బతుకమ్మ సంబరాలు ఏటా పెతర అమావాస్య రోజున ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై.. సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి.**

**దేశంలోనే తెలంగాణ ప్రజల సంస్కృతి ప్రత్యేకతను కలిగినది. ప్రజల భాష, ఆచారాలు, పండుగలు సహజ సిద్ధమైన ప్రకృతికి ఆనవాలుగా నిలుస్తాయి. మానవ సంబంధాల చిరునామా బతుకమ్మ పండుగ. పూలనే దేవతగా కొలిచే ప్రత్యేక సంస్కృతి తెలంగాణకే సొంతం. అదే మన పూల జాతర బతుకమ్మ పండుగ ప్రత్యేకత. పూలనే దేవతగా కొలిచే అపురూపమైన పండుగ బతుకమ్మ. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి.. ఆడపడుచులంతా ఒక్కచోట చేరి తమ అనుభవాలనే పాటలుగా మలిచి.. చప్పట్లతో గౌరమ్మను కొలిచే వేడుక.**



**నారాయణపేట అక్టోబర్ 14 (మనం న్యూస్):** ఈసారి అక్టోబర్ 10వ తేదీ నుంచి(ఎంగిలిపూల బతుకమ్మ) ఈ సంబరాలు మొదలు అయ్యాయి. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ నేపథ్యం గురించి ఆసక్తికర విషయాలు మీకోసం.... ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే పూలతో కూడిన అమరిక బతుకమ్మ. సాధారణంగా గునుగు, గుమ్మడి, తంగేడు, కట్ల పూలు, గోరంట్ల పూలు పట్టుకుచ్చులు (సీతజడ పూలు) స్థూపాకారంలో వరుసలుగా పేర్చి.. పైభాగం మధ్యలో 'గౌరమ్మ' ను పెడతారు.బతుకమ్మ పండుగ జానపదుల జీవన శైలిని ప్రతిబింబిస్తుంది. తెలంగాణీయులు పుట్టమన్నుతో చిన్న పీటమీద చతురస్రాకారంలో గుడిగోపురం ఆకారాన్ని చేస్తారు. దాన్ని పూలతో అలంకరిస్తారు. దీన్నే బొడ్డెమ్మ గా కొన్ని ప్రాంతాల్లో గౌరమ్మగా పిలుస్తారు. సాయంత్రం వేళలో బొడ్డెమ్మను రుద్రాక్ష, గోరింట పూలతో అలంకరిస్తారు. సందెవేళ కూడలిలోనో, వాకిట్లోనో అలికి ముగ్గుపెట్టి దానిలో బొడ్డెమ్మ ఉంచి పెండ్లికాని ఆడపిల్లలు పాటలు పాడుతూ ఆడుతారు. బతుకమ్మా(జీవించు అని అర్థం) మాకు బతుకునీయవమ్మా (మమ్మల్ని చల్లగా చూడు తల్లీ) అని పాటలతో అమ్మను వేడుకుంటారు. తెలంగాణలో 'చుట్టుగాముడు' అనేది మౌలికమైనది. ప్రాచీనమైనది. దీన్ని ప్రాచీనమైన జానపద నృత్యం గా భావించవచ్చు. ఒక్కొక్క ప్రాంతంలో వారి అభిరుచులకు అనుగుణమైన మార్పులతో నృత్య వైవిధ్యాన్ని కనబరుస్తారు.

### బతుకమ్మ పండుగ నేపథ్యం ఇలా....

బతుకమ్మ నేపథ్యానికి సంబంధించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. బతుకమ్మ సంబరాల్లో భాగంగా పాడుకునే పాట ప్రకారం.. ధర్మాంగధుడు అనే రాజుకు వంద మంది కుమారులు పుట్టి చనిపోయారు.దుఃఖంలో మునిగిపోయిన దంపతులు తమ కడుపున ఆ లక్ష్మీదేవి పుట్టాలని ప్రార్థిస్తారు. వారి మొరను ఆలకించిన ఆ తల్లి ఆ దంపతులకు జన్మిస్తుంది. ఆమెను దీవించేందుకు రాజు నివాసానికి వచ్చిన మునులు 'నువ్వు ఎల్లకాలం బతుకమ్మ' అని ఆమెను దీవించినట్టు కథ ప్రచారంలో ఉంది.

### మరో కథ ఇలా...

ఇక బతుకమ్మ చుట్టూ చేరి.. పండుగకు కారణమైన కథను గానం చేసే పల్లె ప్రజల పదాల ఆధారంగా.. బతుకమ్మ నేపథ్యానికి సంబంధించి మరో కథ కూడా ప్రాచుర్యం పొందింది. అనగనగా ఓ రాజు. ఆ రాజుకు ఓ చిన్న కోడలు. వారి ఊరికి జీవనాధారం చెరువు. ఎంతో విశాలమైన ఆ చెరువు వానలు బాగా పడటంతో మత్తడిదుంకుతుంది. ఎడతెరిపి లేని వానల వల్ల చెరువు నిండి కట్టకు గండిపడుతుంది. గండిని పూడ్చేందుకు ఊరంతా ప్రయత్నించినా ఫలితం ఉండదు. అయితే, చెరువు కట్ట అంటే అక్కడ మైసమ్మ (గ్రామ దేవత) కొలువు ఉంటుందని చాలా మంది నమ్మకం. ఆమే చెరువుకు రక్షణగా ఉంటుందని భావిస్తారు.అందుకే కట్ట నిలవాలంటే మైసమ్మను శాంతింపచేయాలని రాజు,ప్రజలు భావిస్తారు. కట్టను నిలిపేందుకు తన బర్రెల మందను ఇస్తానని రాజు మైసమ్మను వేడుకుంటాడు. ఇందుకు బదులుగా మైసమ్మ తల్లి తనకు కూడా బర్రెల మంద ఉందని సమాధానమిస్తుంది. ఆవుల మంద, గొర్రెల మంద, మేకలమంద ఇలా ఏది ఇస్తానన్నా అవన్నీ తన దగ్గర కూడా ఉన్నాయని చెబుతుంది. దీంతో ఆ రాజు తమ ఊరి బాగు కోసం తన కుటుంబ సభ్యులను అర్పిస్తానని ఆమెకు చెబుతాడు. కానీ ఆ గ్రామ దేవత శాంతించదు ఎటు దోచని స్థితిలో ఆ రాజు....

**చిన్నకోడలిస్త ఉయ్యాలో..**
**కట్ట నిలుపే మైసు ఉయ్యాలో..**

అని రాగం అందుకోగానే మైసమ్మ సంతృప్తి పడుతుంది. కట్ట తెగకుండా ఆపుతుంది. ఇక అన్న మాట ప్రకారం రాజు ఇంటికెళ్లి తన చిన్న కోడలిని చెరువు దగ్గరకు తీసుకువచ్చేందుకు పూనుకుంటాడు. కానీ ఆమెకు తను చేయాల్సిన త్యాగం గురించి చెప్పడు.

అయితే, చిన్న కోడలి పసిపాపాయి గురించి వివరాలు అడుగుతూ అన్ని పనులు పూర్తయ్యాయని ఆమె చెప్పగానే చెరువుకు పోయి నీళ్లు తెమ్మనిచెబుతాడు. మామ మాటను గౌరవించి ఆ చిన్న కోడలు బిందె పట్టుకుని చెరువు దగ్గరకు వెళ్తుంది. అయితే, ఎంత ముంచినా బిందె మునగదు. నడుము లోతు వరకు వెళ్లినా అదే పరిస్థితి. అంతలో ఆ రాజు కల్పించుకుని ఇంకొంచెం లోపలికి పొయ్యి నీళ్లు తే అని చెబుతాడు. అలా మరింత లోతుకు వెళ్లిన ఆమె బిందెతో పాటు చెరువులో మునిగిపోతుంది.

తన పరిస్థితి ఏమిటో తెలుసుకున్న ఆ తల్లి తన తల్లిదండ్రులకు బిడ్డ లేదని, తన బిడ్డకు తల్లి లేదని చెప్పమంటూ పాటు పాడుతూ పూర్తిగా మునిగిపోతుంది. బొడ్డెమ్మనై.. మళ్లీ వస్తానంటూ శాశ్వతంగా సెలవు తీసుకుంటుంది. అయితే, ఎక్కడైతే ఆ రాజు చిన్న కోడలు మునిగిందో అక్కడ పూలన్నీ నీళ్లలో తేలతాయి. ఊరి కోసం ప్రాణాలు అర్పించిన ఆ ఆడబిడ్డ త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ.. బతుకమ్మ రూపంలో ఆమె కలకాలం తమతోనే ఉంటుందని.. పూలతో ఆమెను పూజించుకుంటామని ఊరి వాళ్లంతా చెప్పినట్టు కథ సాగుతుంది ఇవే కాక మరెన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి..

# ఎల్నినో ప్రభావంతో తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి



**ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలి**

**ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు ఉన్న గిరిజన రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు**

**అభివృద్ధి పనులను నిర్ణిత గడువులోగా పూర్తి చేసి తీరాలి**

**లాభదాయకమైన పంటల సాగుపై గిరిజన రైతులకు అవగాహన కల్పించాలి**

**జిల్లా ఉన్నతాధికారుల సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ**

**ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 14 (మనం బ్యూరో):** ఎల్నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంభందిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. అవసరమైన చోట్ల చెరువులు, కుంటలను నింపే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. ఎల్నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం వంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలన్నారు. నీటి వృథాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. చెరువులు, కుంటల్లో నీటి నిల్వలను పెంచుకునే అవకాశాలను పరిశీలించాలన్నారు. భవిష్యత్తులో తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, నీటిని బాధ్యతాయుతంగా వినియోగించుకునేలా ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాబోయే రెండేళ్లకు అవసరమైన ఆహార ధాన్యాలు అందుబాటులో ఉన్నాయని, ఆహార కొరత ఏర్పడుతుందనే ఆందోళన ప్రజలు చెందాల్సిన అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి తెలిపారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు సరైన సమాచారం అందిస్తూ, తాగునీటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

### పోడు రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో అటవీ హక్కుల గుర్తింపు చట్టం (ఆర్ఓఎఫ్ఆర్) కింద పట్టాలు పొందిన గిరిజన రైతులు తమ భూముల్లో సాగు చేసుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గిరిజన రైతుల హక్కులను పరిరక్షిస్తూ, వారికి వ్యవసాయంలో మరింత ప్రోత్సాహం అందించాలని అధికారులను ఆదేశించారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన గిరిజన రైతుల భూముల్లో సౌర విద్యుత్ ఆధారిత సాగు సదుపాయాలను కల్పించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఇందిరా సౌర జల వికాసం పథకం ద్వారా రైతులు ఉద్యాన పంటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. అవకాడో, ఆయిల్పామ్, వెదురు వంటి లాభదాయకమైన పంటల సాగుపై ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని భూములు దానిమ్మ, ద్రాక్ష వంటి పండ్ల తోటల సాగుకు అనుకూలంగా ఉన్నాయా లేదా అనే అంశంపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవకాశాలను పరిగణనలోకి తీసుకుని రైతులకు ప్రయోజనం చేకూర్చే పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, భూసేకరణకు సంబంధించిన పరిహారం చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన తర్వాత వాటిని లబ్ధిదారులకు సకాలంలో అందించాలన్నారు. కలెక్టర్ ఖాతాల్లో నిధులను నిల్వ ఉంచడం తగదని స్పష్టం చేశారు. పరిహారం కోసం ఎదురుచూస్తున్న బాధితులకు నిబంధనల ప్రకారం త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### పాఠశాలల నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలి

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనుల పురోగతిని భట్టి విక్రమార్క పూర్తి స్థాయిలో సమీక్షించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించేందుకు చేపడుతున్న నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు.

ప్రజల అవసరాలకు ప్రాధాన్యమిస్తూ, తాగునీటి సంరక్షణతో పాటు అన్ని రంగాల్లో సమర్థవంతమైన సేవలు అందించేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, నాగర్కర్నూల్ జిల్లా ఇన్చార్జి కలెక్టర్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి చెన్నయ్య, దేవ సహాయం, జిల్లా ఫారెస్ట్ అధికారి రేవంత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం

**రాష్ట్ర పర్యాటక, సంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు....**

**ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 14 (మనం బ్యూరో):** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించడమే తెలంగాణ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ బాహుబలి మోటార్లను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ మోటార్ల ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయకుండానే, దీన్ని జాతికి అకింతం చేశారని, కానీ కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, ఇతర పనులను గత ప్రభుత్వం చేపట్టలేదని విమర్శించారు. ప్రాజెక్టును గత పాలకులు పూర్తిచేసి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం



వాటిని పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేసిందని మంత్రి ద్వజమెత్తారు. మహాత్మాగాంధీ-కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 4.60 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, భీమా ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, కోయిలసాగర్ ప్రాజెక్టు కింద 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందని తెలిపారు. ఇన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను గత ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేకపోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరు రైతాంగం ప్రయోజనాల కంటే రాజకీయ ప్రచారానికే బీఆర్ఎస్ నేతలు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడం, వ్యవసాయానికి అవసరమైన నీటిని అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రాధాన్యమని జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేయాలి

**విద్యుత్ శాఖ ఉద్యోగులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పలు సూచనలు**

**అచ్చంపేట నియోజకవర్గంలో రూ.150 కోట్లతో విద్యుత్ మౌలిక వసతుల కల్పన**

**ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 14 (మనం బ్యూరో):** విద్యుత్ సౌకర్యం ప్రజలకు ప్రాణవాయువు లాంటిదని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా విద్యుత్ శాఖ ఉద్యోగులు కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటిని వెంటనే పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాగర్కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి ఉప ముఖ్యమంత్రి విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చంపేట డివిజన్ పరిధిలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, వినియోగం, మౌలిక వసతులు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ సరఫరాకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో



పాటు, విద్యుత్ శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సుమారు రూ.150 కోట్లతో విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. విద్యుత్ శాఖ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో వ్యవసాయం, తాగునీటి అవసరాలు పెరిగే అవకాశం ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వీటికి అనుగుణంగా విద్యుత్ డిమాండ్ పెరిగినా సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. విద్యుత్ను పొదుపుగా వినియోగించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.ప్రమాదవశాత్తు విధి నిర్వహణలో ఎవరైనా ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబానికి అండగా నిలిచేందుకు రూ.కోటి ప్రమాద బీమా సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలకు తావు ఇవ్వకుండా ఎప్పటికప్పుడు ప్రజలకు మెరుగైన విద్యుత్ అందిస్తూ విద్యుత్ శాఖ నుండి ప్రజలకు అందించే ఉత్తమ సేవలను ప్రజల దృష్టికి తీసుకు వచ్చేలా కార్యక్రమాలను సైతం ప్రచారం చేయాలన్నారు. అచ్చంపేట శాసనసభ్యుడు డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.... అచ్చంపేట నియోజకవర్గంలో అవసరమైన విద్యుత్ అవసరాల కల్పనకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రాధాన్యతతో ఏర్పాటు కల్పిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూనే ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. విద్యుత్ అంతరాయం ఏర్పడడం వెంటనే పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టడంలో విద్యుత్ శాఖ సిబ్బంది చర్యలపై ఎమ్మెల్యే ప్రశంసించారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం, విద్యుత్ శాఖ అధికారులు, అచ్చంపేట నియోజకవర్గ విద్యుత్ శాఖ అధికారులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఓపెన్‌ఏఐ మీటింగ్ హాల్లో

# సౌదీ జాతీయుడి గూఢచర్యం..!

**శాన్‌ఫ్రాన్సిస్కో, అక్టోబర్ 14 :** ఓపెన్‌ఏఐలో ఇంజినీర్గా పనిచేస్తూ.. గూఢచర్యం చేస్తోన్న సౌదీ జాతీయుడిని అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. తమ కార్యాలయంలోని మీటింగ్ రూమ్‌లో రహస్య రికార్డింగ్ పరికరం ఉన్నట్లు గుర్తించిన ఈ టెక్ సంస్థ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఈ చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే..

శాన్ ఫ్రాన్సిస్కోలోని ఓపెన్‌ఏఐ ఆఫీసులోని సమావేశ గదిలో రహస్య పరికరం ఉండడాన్ని సెప్టెంబర్ 30న అక్కడి సిబ్బంది గుర్తించారు. బొటన వేలు పరిమాణంలో ఉన్న ఆ పరికరాన్ని టాయిలెట్ పేపర్లో చుట్టి, గదిలోని టీవీ వెనక ఉన్న పోర్ట్‌లో దాచినట్లు సిబ్బంది తెలిపారు. అందులో ఒక మైక్రోఫోన్, కెమెరా సెన్సార్, మైక్రోఎస్డీ స్టోరేజ్ ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఇంటర్నల్ ఏఐ సాయంతో ఆ పరికరం ఏంటనేది తెలుసుకున్నారు. కంపెనీలో పనిచేస్తోన్న అబ్దుల్ రహ్మాన్ ఈ రహస్య పరికరాన్ని అమర్చినట్లు తెలిసింది. ఈ విషయంపై వెంటనే ఓపెన్‌ఏఐ సంస్థ ఎఫ్‌బీఐకి ఫిర్యాదు చేయడంతో.. ఇటీవల అధికారులు అతడిని అరెస్ట్ చేశారు. దర్యాప్తులో పలు కీలక విషయాలు బయటికొచ్చాయి.


సౌదీకి చెందిన అబ్దుల్ రహ్మాన్ ఏఐ చాట్‌బాట్‌ను ఉపయోగించి, ఆ రహస్య పరికరాన్ని తయారు చేసినట్లు ఎఫ్‌బీఐ అధికారులు వెల్లడించారు. మీటింగ్ హాల్లో జరిగే ఓపెన్‌ఏఐ ఎగ్జిక్యూటివ్ల కీలక సమావేశాల వివరాలను తెలుసుకునేందుకు అతడు ఈ కుట్ర పన్నినట్లు తెలిపారు. నిందితుడు తరచూ ఆ గది బయట తచ్చాడిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. ఆ పరికరంలో ఉన్న సమాచారం ఎన్‌స్క్రిప్ట్ చేసి ఉండడంతో దానిని యాక్సెస్ చేయడం సాధ్యపడలేదని ఎఫ్‌బీఐ అధికారులు పేర్కొన్నారు. అబ్దుల్ రహ్మాన్ 2025 జులైలో ఓపెన్‌ఏఐలో చేరాడు.

గతంలో మెటా, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల్లోనూ పని చేశాడు. ఈ ఘటన నేపథ్యంలో సంస్థ అతడిని ఉద్యోగం నుంచి తొలగించింది. గూఢచర్యానికి పాల్పడినట్లు నేరం రుజువైతే అతడికి ఐదేళ్ల వరకు జైలు శిక్ష.. పెద్ద మొత్తంలో జరిమానా పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

# సౌదీకి షాక్: అరామ్‌కో ప్రధాన కార్యాలయంపై హూతీల దాడి

**రియాద్, అక్టోబర్ 14 :** సౌదీ అరేబియాలో వరుసగా హూతీలు చేస్తున్న దాడులు కలకలం రేపుతున్నాయి. ధహ్రాన్ నగరంలోని చమురు దిగ్గజం అరాంకో ప్రధాన కార్యాలయంపై హూతీలు బాలిస్టిక్ క్షిపణితో దాడి చేశారు. మరోవైపు రాజధాని రియాద్‌లో క్షిపణుల శకలాలు పడటంతో నలుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు మహిళలు, ఓ పురుషుడు, ఓ చిన్నారి ఉన్నారు. ఈ ఘటనలో 15 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. సౌదీ అరేబియాలోని కీలక ప్రాంతాలపై దాడులు జరగడంతో భద్రతాపరమైన ఆందోళనలు రోజురోజుకు పెరుగుతున్నాయి.

యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు, సౌదీ అరేబియా మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చడంతో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. హూతీలు క్షిపణులు, డ్రోన్లతో దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో సౌదీ బలగాలు వాటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో క్షిపణి ఇంటర్‌సెప్టర్లను ప్రయోగిస్తుండటంతో.. వాటి శకలాలు కిందపడి ఇళ్లకు నష్టం వాటిల్లుతోంది. అరాంకో ప్రపంచంలోని అతిపెద్ద చమురు సంస్థల్లో ఒకటి. చమురు ఉత్పత్తి, శుద్ధి, ఎగుమతుల్లో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ క్రమంలో దీనిపై దాడి జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ దాడి వల్ల సంస్థ కార్యకలాపాలకు ఎంతమేర నష్టం వాటిల్లిందనే వివరాలు వెల్లడికావాల్సి ఉంది.



యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులకు చెందిన కీలక ఇంధన కేంద్రంపై సౌదీ అరేబియా దాడి చేసింది. రాజధాని సనా శివార్లలోని అల్-సబాహా కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని భారీ దాడికి పాల్పడింది. హూతీలు సౌదీలోని విమానాశ్రయాలు, ఇంధన సముదాయాలపై దాడులకు ఈ కేంద్రాన్ని వాడుతున్నట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు తెలిపాయి. ఈ కేంద్రంలో సుమారు 58 వేల టన్నుల ఇంధనాన్ని నిల్వ చేసే సామర్థ్యం ఉంది. ఈ దాడిలో ఇద్దరు పౌరులు మరణించగా, మరో ఇద్దరు గాయపడినట్లు హూతీలు వెల్లడించారు. ఈ వరుస దాడుల నేపథ్యంలో హూతీలు, సౌదీ బలగాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### కాక్రోచ్ జనతా పార్టీకి

# అమెరికన్ల నుంచి నిధులు



### సింగర్ మేరీ మిల్బెన్ ఆరోపణలు

**శాన్‌ఫ్రాన్సిస్కో, అక్టోబర్ 14 :** కాక్రోచ్ జనతా పార్టీకి తమ దేశంలోని కొందరు దాతలు నిధులు అందిస్తున్నారని అమెరికా సింగర్ మేరీ మిల్బెన్ ఆరోపించారు. ఇది మౌనంగా ఉండే సమయం కాదన్నారు. సీజేపీ విద్రోహ స్ఫూర్తికి వ్యతిరేకంగా భారత్‌లోని యువత శాంతియుతంగా నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు.

సర్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ.. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని దేశ రాజధాని ఢిల్లీలో విపక్షాలు, సీజేపీ ప్రతినిధులు నిరసన చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మిల్బెన్ స్పందించారు. ''25 ఏళ్లుగా ప్రజా సేవలో ఉన్న మీ ప్రధాని మోడీ మా దేశం నుంచి వచ్చే విద్రోహ శక్తుల ముందు తలవంచరు. కొందరు దాతలు ఉంటారు. వారు ప్రపంచస్థాయి సంప్రదాయ నేతలను లక్ష్యంగా చేసుకుంటారు. తర్వాత అమెరికాలో చదువుకున్న ఆయా దేశాలకు చెందిన వ్యక్తులను గుర్తిస్తారు. వారికి తీవ్రవాద భావాలను జొప్పించి, తమ తమ స్వదేశాలకు పంపుతారు. అక్కడ గందరగోళం, విధ్వంసం సృష్టించేందుకు నిధులు అందిస్తుంటారు. అయితే ఈ ప్రయత్నాల్లో ఎవరూ విజయవంతం కాలేదు. కానీ దేశ అభివృద్ధి, పాలనపై మాత్రం ఇది ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్లో చదువుకున్న యువత మేల్కొనాల్సిన సమయం వచ్చింది. ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను పరిరక్షించడం కోసం ఇలాంటి ఉద్యమాలకు ఎల్లప్పుడూ కౌంటర్ ఉండాలి'' అని సింగర్ మేరీ మిల్బెన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పోస్టు పెట్టారు.

ఆఫ్రికన్-అమెరికన్ అయిన సింగర్ మిల్బెన్.. భారత్‌కు సుపరిచితురాలే. మన జాతీయగీతం, 'ఓం జై జగదీశ హరే' పాటలు పాడి మన దేశంలో ఆదరణ సొంతం చేసుకున్నారు.

# ఇరాన్‌పై మళ్లీ దాడులకు

- ట్రంప్- నెతన్యాహు రహస్య చర్చలు!
- అంతర్జాతీయ మీడియా కథనాలు

**వాషింగ్టన్, అక్టోబర్ 14 :** ఇరాన్‌పై భారీ దాడులను పునఃప్రారంభించాలా.. వద్దా? అనే విషయంపై అమెరికా-ఇజ్రాయెల్ రహస్య చర్చలు జరుపుతున్నట్లుగా అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అగ్రరాజ్యంలో ఎన్నికలు ముగిసేలోపు (నవంబర్ చివరి నాటికి) టెహ్రాన్‌పై భారీ సైనిక చర్య చేపట్టే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. గత వారం ట్రంప్‌తో సంభాషణలో భాగంగా నెతన్యాహు ఇరాన్ మళ్లీ అణ్వాయుధాల కోసం ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ అణ్వాయుధ శక్తిని నిర్వీర్యం చేయడానికి దాడులను పునఃప్రారంభించేలా ట్రంప్‌ను ఒప్పించేందుకు బీబీ ప్రయత్నిస్తున్నట్లు సదరు వార్తా కథనాలు పేర్కొన్నాయి.

ముఖ్యంగా, ఇరాన్‌లోని పికాక్స్ పర్వతంలోని చమురు శుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రణాళికల్లో భాగంగా నెతన్యాహు సలహాను ట్రంప్ అంగీకరించినట్లు సమాచారం. అయితే, దాడులు ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయంపై స్పష్టతనివ్వలేదు. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, యూఎస్ సెంట్రల్ కమాండ్ అధికారులు సైతం ఇజ్రాయెల్ ఆలోచనకు మద్దతు తెలిపారు. నవంబర్లో అమెరికాలో ఎన్నికలు ఉండడంతో ఈ దాడుల ప్రభావం వాటిపై పడే అవకాశం ఉందని ట్రంప్ సలహాదారులు ఆయనకు సూచించడంతో అమెరికా అధ్యక్షుడు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.



ఇరాన్‌పై దాడుల విషయంలో ట్రంప్ మనసు మార్చుకుంటే వెంటనే దాడులు చేసేలా అమెరికా-ఇరాన్ సైన్యాలు అప్రమత్తమయ్యాయి. ఇందులో భాగంగానే అమెరికా విమాన వాహక నౌకలు సైతం పశ్చిమాసియా వైపు కదులుతున్నట్లు సమాచారం. అయితే, దీనిపై అగ్రరాజ్యం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# హార్మూజ్‌లో సీమైన్‌ను ఢీకొని మునిగిన నౌక

**టెహ్రాన్, అక్టోబర్ 14 :** అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలకు బ్రేక్ పడినా.. ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో అంతరాయాలు కొనసాగుతున్నాయి. తమ హెచ్చరికలు పట్టించుకోని నౌకలపై ఇప్పటికే అమెరికా-ఇరాన్ దాడులు చేస్తుంటే.. మందుపాతరలు మరో ముప్పుగా మారాయి. యుద్ధం ప్రారంభమైన సమయంలో ఇరాన్ వాటిని హర్మూజ్‌లో అమర్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ చమురు ట్యాంకర్ సీమైన్‌లను ఢీకొని మునిగిపోయింది. ఈ విషయాన్ని ఐఆర్జీసీ వెల్లడించింది.

హర్మూజ్‌లోని ప్రమాదకర మార్గంలో ప్రయాణించడం వల్ల ఈ ప్రమాదం



చోటుచేసుకుందని ఐఆర్జీసీ పేర్కొంది. ఆ నౌకలో 2500 కంటైనర్ల కార్గో ఉన్నట్లు సమాచారం. అది ఏ దేశానికి చెందినది?ఎంతమంది సిబ్బంది ఉన్నారు?వారు సురక్షితంగా ఉన్నారా?లేదా అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఈ క్రమంలో తమ అనుమతి లేకుండా జలసంధి గుండా ప్రయాణించడానికి ప్రయత్నించవద్దని ఇరాన్ మరోసారి ప్రపంచ దేశాలను హెచ్చరించింది.

# బాలికను అసభ్యంగా తాకిన రోబో

**బెర్లిన్, అక్టోబర్ 14:** 16 ఏళ్ల బాలికను ఓ రోబో అనుచితంగా తాకడం తీవ్ర కలకలం రేపింది. జర్మనీలోని కొలోన్ నగరంలో గత వారాంతంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీధిలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళల వద్దకు ఓ రోబో వచ్చి.. వారిని ఆలింగనం చేసుకోవడంతో పాటు ఓ అమ్మాయిని అసభ్యంగా తాకింది. ఈ ఘటనను ఇద్దరు టీనేజీ యువకులు సోషల్ మీడియా లైవ్‌లో ప్రసారం చేయడం గమనార్హం. రోబో యజమానిగా భావిస్తున్న ఓ 16 ఏళ్ల బాలుడు, అతడి స్నేహితుడు ఉద్దేశపూర్వకంగా దాన్ని నియంత్రిస్తూ ఈ ప్రవర్తనకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. రోబోతో పాటు యువకుల సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. రోబో కదలికలు ముందుగానే ప్రోగ్రామ్ చేశారా? లేదంటే యువకులు అప్పటికప్పుడు నియంత్రించారా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.



# మాపై కాదు.. సమస్యలపై దృష్టి పెట్టండి

### కేంద్ర ప్రభుత్వంపై అభిజీత్ దీపేక్ విమర్శలు

**ఢిల్లీ, అక్టోబర్ 14 :** కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీపేక్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తమ పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు 5 రోజుల కస్టడీ విధించడాన్ని తప్పుబట్టారు. త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకు వారిని తీహార్ జైలుకు తరలించారని ఆరోపించారు. నిరసన తెలపడం రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కు అని, దానిని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. ప్రజాస్వామ్యం, ఓటు పరిరక్షణ కోసమే తాము ఉద్యమం చేస్తున్నట్లు స్పష్టం చేశారు.



# సీజేపీకి రాహుల్ మద్దతు

**ఢిల్లీ, అక్టోబర్ 14 :** జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టిన సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంఘీభావం తెలిపారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని కేంద్రాన్ని విమర్శించారు. 'జాతీయ జెండాను ప్రదర్శిస్తూ శాంతియుతంగా నిరసన తెలపడం నేరం కాదు. అలా చేసిన యువకులపై కేసులు పెట్టి జైలుకు పంపడం ఏంటి? రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడం అందరి బాధ్యత. జంతర్ మంతర్ను తిరిగి నిరసన ప్రదేశంగా సాధించుకుంటాం' అని రాహుల్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

రాహుల్ ఈ పోస్టుపై అభిజీత్ దీపేక్ ధన్యవాదాలు తెలిపారు. జంతర్ మంతర్ను ధర్నా వేదికగా డీనోటిపై చేస్తూ దిల్లీ పోలీసులు ఇటీవల ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని సీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ క్రమంలోనే సీజేపీ ముఖ్య నేతలు జంతర్ మంతర్ వద్దకు చేరుకుని నిరసనలకు యత్నించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించినందుకు గానూ పోలీసులు వారిని అరెస్టు చేసి జైలుకు తరలించిన విషయం తెలిసిందే.





### ఇరాన్ వ్యూహాల్లో మరో టర్నింగ్ పాయింట్..

# రంగంలోకి స్పాటర్లు

**టెహ్రాన్, అక్టోబర్ 14 :** హర్మూజ్ జలసంధిలో నౌకలే లక్ష్యంగా దాడులు చేసేందుకు ఇరాన్ కొత్త వ్యూహాలు పన్నుతోంది. చమురు ట్యాంకర్లు, రవాణా ఓడలపై దాడులు చేస్తూ.. మిడ్‌టర్మ్ ఎన్నికల వేళ అమెరికా ఒత్తిడి పెంచుతోంది. చమురు ధరలు పెంచి, అమెరికా ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపేలా స్పాటర్లను రంగంలోకి దించుతోంది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం మొదలైన దగ్గరి నుంచి ఇరాన్ తన సైనిక సామర్థ్యాలను కోల్పోయింది. రాడార్ వ్యవస్థలను నష్టపోయింది. దాంతో ఐఆర్జీసీ సరికొత్త విధానాన్ని ఎంచుకుంది. హర్మూజ్ జలసంధి ఒమన్ తీర ప్రాంతాల్లో ప్రయాణించే అమెరికా నౌకలు, అంతర్జాతీయ వాణిజ్య నౌకలను గుర్తించేందుకు ఇరాన్ సైన్యం చిన్న పడవల్లో నిరాయుధ నిఘా సిబ్బందిని రంగంలోకి దించుతోంది. ఆ నిఘా సిబ్బంది ఐఆర్జీసీకి లక్ష్యాల గురించి సమాచారం చేరవేస్తున్నారని అమెరికా సైనికాధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యూహాన్ని హర్మూజ్‌లో మాత్రమే గాకుండా గల్ఫ్ ఆఫ్ ఒమన్, ఖతార్, యూఏఈ తీర ప్రాంతాలకు విస్తరించాలని ఇరాన్ ప్రణాళిక రచిస్తున్నట్లు తెలుస్తోంది. తమ ఆంక్షలను ఉల్లంఘించే ఏ నౌక కూడా జలసంధి మీదుగా వెళ్లకుండా అడ్డుకుంటామని ఇరాన్ అధికారులు హెచ్చరిస్తున్నారు. ''త్వరలో ఈ జలసంధి పూర్తిగా మూసివేస్తాం'' అని హెచ్చరిస్తున్నారు.

# ఎయిరిండియా విమానానికి 'హైజాక్'!

**ఢిల్లీ, అక్టోబర్ 14 :** జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి ఢిల్లీ వస్తున్న ఎయిరిండియా విమానానికి 'హైజాక్' అలర్ట్ రావడం తీవ్ర కలకలం రేపింది. దీంతో ఈ విమానాన్ని రాజస్థాన్లోని జైపుర్ ఎయిర్పోర్టులో అత్యవసరంగా దించి తనిఖీలు చేపట్టారు.

బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఎయిరిండియా విమానం భారత గగనతలంలోకి ప్రవేశించింది. ఆ సమయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ కు విమానం నుంచి 'స్క్వాక్ 7500 కోడ్' వచ్చింది. సాధారణంగా విమానం హైజాక్కు గురైనప్పుడు పైలట్ ఇలాంటి కోడ్ను పంపిస్తుంటారు. ఎయిరిండియా విమానం నుంచి ఈ సిగ్నల్ రాగానే.. ఏటీసీ సిబ్బంది భద్రతా ఏజెన్సీలను అప్రమత్తం చేశారు. దీంతో విమానాన్ని జైపుర్కు మళ్లించి.. ఉదయం 9.45 గంటల సమయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అనంతరం ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించి ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు కనిపించకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ అలర్ట్ కోడ్ ను పైలట్ పంపించినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. అయితే, దీని వెనుక కారణాలు మాత్రం తెలియరాలేదు. ఘటనపై డీజీసీఏ దర్యాప్తు చేపట్టింది.




# విమానాల్లో ఆ పవర్ బ్యాంకులపై నిషేధం

**ఢిల్లీ, అక్టోబర్ 14 :** పవర్ బ్యాంక్ల విషయంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. విమానాల్లో మొబికిన్స్ ఎంకే-పీబీ-04 మోడల్ పవర్ బ్యాంకులపై నిషేధం విధించింది. ఇటీవల ఢిల్లీ నుంచి చెన్నైకి వెళ్తున్న ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ నుంచి మంటలు చెలరేగాయి. సిబ్బంది వెంటనే అప్రమత్తమై శంషాబాద్లో అత్యవసర ల్యాండింగ్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ క్రమంలో మొబికిన్స్ ఎంకే-పీబీ-04 మోడల్ పవర్బ్యాంక్ను విమానంలో తీసుకువెళ్లడం, రవాణా చేయడం జరగకుండా చూసుకోవాలని విమానయాన సంస్థలను డీజీసీఏ ఆదేశించింది. లగేజ్ బ్యాగ్లు, క్యాబిన్ బ్యాగులో గానీ, కార్గోలో గానీ వీటిని తీసుకెళ్లొద్దని ప్రయాణికులకు, విమానయాన సంస్థలకు ఆదేశాలిచ్చింది. భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

## జిల్లా కలెక్టర్‌ను సన్మానించిన ఎస్పీ నరసింహ



**సూర్యాపేట, అక్టోబర్ 14 (మనం ప్రతినిధి):** సమాచార హక్కు చట్టం ఆర్టిఐ యాక్ట్ , 2005) అమలులో సూర్యాపేట జిల్లాకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాగా రవీంద్రభారతి లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతులమీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ని జిల్లా ఎస్పీ కె. నరసింహ బుధవారం జిల్లా సమీకృత కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు సమాచార హక్కు చట్టం అమలులో జిల్లా యంత్రాంగం కనబరిచిన పనితీరుకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ నాయకత్వంలో సూర్యాపేట జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపి, జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించడం, ప్రభుత్వ శాఖల పనితీరులో పారదర్శకతను పెంపొందించడం, ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపడం వంటి అంశాల్లో జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సమర్థవంతమైన పరిపాలనలో జిల్లా యంత్రాంగం మరిన్ని విజయాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు.

# జిల్లాల మధ్య వివాదాలు సృష్టించడం సరికాదు

## తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**నల్లగొండ, అక్టోబర్ 14(మనం ప్రతినిధి):** మహబూబ్నగర్ నల్గొండ జిల్లాల మధ్య కొందరు జల వివాదాలు సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన చిట్ చాట్ లో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రాంతాల మధ్య విభేదాలు తలెత్తకుండా చూడాలి పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. ఎదుళ్ల రిజర్వాయర్ నుంచి రెండు జిల్లాలకు నీటి కేటాయింపులపై సామరస్యపూర్వకంగా వ్యవహరించాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించాలి. కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి .నల్గొండలోని క్యాంపు కార్యాలయంలో నేడు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, జల వివాదాలు, కరువు పరిస్థితులు, విద్యుత్ సమస్యలు, రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు తదితర అంశాలపై ఆయన మాట్లాడారు.

గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఆనాడు సుదీర్ఘ పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. ఎంతోమంది త్యాగాలు, పోరాటాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో నేడు జిల్లాల మధ్య చిచ్చుపెట్టే విధంగా కొందరు వ్యవహరించడం బాధాకరం. ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలుగుతుంది' అని అన్నారు.మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలను చేపట్టడం జరిగిందన్నారు. పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు.

ఎదుళ్ల రిజర్వాయర్ నుంచి రోజుకు 1.5 టీఎంసీల నీటిని పాలమూరు ప్రాంతానికి, 0.5 టీఎంసీల నీటిని డిండి ఎత్తిపోతల పథకానికి కేటాయించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు.నార్లాపూర్ నుంచి నీటిని తరలించాలంటే అదనపు ఖర్చుతో పాటు ఎక్కువ సమయం అవసరమవుతుందని, అనుమతుల సమస్యలు కూడా ఎదురయ్యే అవకాశం ఉందని వివరించారు.నల్గొండ జిల్లా దశాబ్దాలుగా ఫ్లోరైడ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రాంతమని గుర్తుచేశారు. ఈ విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు చొరవ తీసుకోవాలని, రెండు జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఈ నేపథ్యంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో జలవిద్యుత్ ఉత్పత్తి కూడా తగ్గిందని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు.

## అవగాహన లోపమే సైబర్ మోసాలు



**సూర్యాపేట, అక్టోబర్ 14 మనం న్యూస్:** అత్యాశ, అవగాహన లోపంతోనే ప్రజలు సైబర్ మోసాలకు గురి అవుతున్నారని డీఎస్పీ ప్రసన్న కుమార్ అన్నారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్ నందు వివిధ బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.... ప్రజలు తమ కష్టార్జిత సొమ్మును భద్రపరుచుకునే బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత కల్పించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఖాతాదారుల నగదు, ఆస్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ బ్యాంకు అధికారులు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్మెంట్ వద్ద భద్రతా పరిస్థితులను పర్యవేక్షిస్తూ, క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఆయా సంస్థల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నామన్నారు.

బ్యాంకు అధికారులు కూడా పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలను మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. రాత్రివేళ బ్యాంకుల వద్ద అవసరమైన భద్రతా సిబ్బంది అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, సెక్యూరిటీ సిబ్బందికి బ్యాంకు అధికారుల ఫోన్ నంబర్లతో పాటు స్థానిక పోలీసుల సంప్రదింపు నంబర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని సూచించారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు వివరాలు, పిన్ నంబర్లు అపరిచితులకు వెల్లడించవద్దని సూచించారు. బ్యాంకుల్లో అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేసి, ఖాతాదారులకు తరచూ సూచనలు ఇవ్వాలని కోరారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్కు ఫోన్ చేసి, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సమావేశంలో సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐ లు కనకరత్నం, రహిముద్దిన్, పట్టణంలోని వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చండికాదేవి అలంకారంలో దుర్గ అమ్మవారు



**మేళ్లచెరువు, అక్టోబర్ 14 మనం న్యూస్:** స్థానిక వనదుర్గ అమ్మవారి దేవాలయంలో 28వ దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా ఘనంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజైన బుధవారం దుర్గా అమ్మవారు చండికాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. త్రిశతి పూజ,చండీ మహావిద్య, రాజ్యశ్యామల, దశమహావిద్య, పారాయణాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి చండీ నవవర్చన, సాయంత్రం అమ్మవారికి శ్రీ చక్రార్చన మంత్రపుష్ప నీరాజనం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమాల్లో బ్రహ్మశ్రీ వేదమూర్తులు కొంకపాక రాధాకృష్ణమూర్తి, సీతాకుమారి,భాను కిరణ్ శర్మ,సాయి శర్మ,రామకృష్ణ శర్మ,దీపక్ శర్మ,అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు..

# సర్వోత్తమ్ రెడ్డిని సమిష్టిగా గెలిపిద్దాం

## ఎమ్మెల్యే మందుల సామేలు



తిరుమలగిరి, అక్టోబర్ 14 (మనం న్యూస్): నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అన్ని శక్తులు కలిసి అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం అని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. బుధవారం తిరుమలగిరి మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పట్టభద్రులైన ఓటర్లను ప్రతి ఇంటికి వెళ్లి కలిసి ఓటు నమోదు చేయించాలని చెప్పారు. ప్రతి మండల కేంద్రాలలో త్వరలో హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. చిన్నచిన్న అభిప్రాయాలు ఉన్న వాటిని పక్కనపెట్టి అభ్యర్థి గెలుపు కోసం అందరం కృషి చేద్దామని చెప్పారు. ప్రతి మండలానికి సీనియర్ నాయకులతో ఐదుగురు కలిసి కమిటీ ఏర్పాటు చేసుకొని వారి సూచనల మేరకు ముందుకు సాగాలని చెప్పారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభ్యర్థిని వారి ఆదేశాలను తప్పకుండా పాటించాలని చెప్పారు. జిల్లా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సూచనలతో ముందుకు సాగాలని చెప్పారు. తుంగతుర్తి నియోజకవర్గం లో సుమారుగా 32 వేల ఓట్లు ఉన్నాయని చెప్పారు. ప్రతి ఓటును నమోదు చేసినట్లయితేనే ఓటర్లు తమకు ఓట్లు వేస్తారని చెప్పారు. సర్వోత్తమ్ రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, మండల పార్టీ అధ్యక్షులు సుంకర జనార్ధన్, ఆత్మ నియోజకవర్గం కన్వీనర్ నరసింహారెడ్డి, మార్కెట్ చైర్మన్ ఎల్సోజు స్రవంతి నరేష్, జుమ్మిలాల్, దానయ్య, కందుకూరి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్ కార్యాలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్.బి. చంద్రశేఖర్



**నల్లగొండ, అక్టోబర్ 14(మనం ప్రతినిధి):** నల్లగొండ ప్రస్తుత కలెక్టర్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన నూతన కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ పనులన్నీ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఆయన ప్రస్తుత కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. సమావేశ మందిరం, ప్రజావాణి సమావేశ మందిరం,వి సి హాల్, మంత్రి, కలెక్టర్, అదనపు కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్లను,ఉద్యోగులు,సిబ్బంది విభాగాలను కలెక్టర్ పరిశీలించి, అవసరమైన ఫర్నిచర్, విద్యుత్ ,ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి హాలులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, సౌండ్ సిస్టం, కంప్యూటర్లు, ప్రొజెక్టర్, ఇంటర్నెట్, ఏసీ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి గదికి బీఎస్ఎన్ఎల్ నెట్వర్క్ పాటు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, టైల్స్ పనులు నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. భవనం చుట్టూ ల్యాండ్స్కేపింగ్, పార్కింగ్, తెలంగాణ తల్లి విగ్రహం,ఫ్లాగ్ ఏర్పాటు, వంటి పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన కలెక్టరేట్కు వచ్చే ప్రజలు, అధికారులు,సిబ్బంది కి అన్ని విధాలా సౌకర్యవంతంగా ఉండేలా నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి దశరథ , ఆర్ అండ్ బి ఎస్ ఈ. మోహన్,ఈ ఈ శ్రీధర్ రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ అభిషేక్, ఎలక్ట్రికల్ డి ఈ శృతి, సివిల్ డిఈ ఫణిజ, ఎఈ పుణ్య,ఏవో మోతిలాల్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ప్రజలకు భద్రత.. పోలీసుల బాధ్యత

- మహిళలకు మరింత చేరువగా పోలీసు..
- 'అక్క కార్యక్రమం'తో ప్రజల్లో భరోసా




**తుంగతుర్తి, అక్టోబర్ 14 (మనం న్యూస్):** ప్రజలకు రక్షణ కల్పించడంతో పాటు వారి సమస్యలను నేరుగా తెలుసుకుని, ప్రతి ఒక్కరికీ పోలీసు శాఖ అండగా నిలుస్తుందనే భరోసా కల్పించడమే లక్ష్యంగా పోలీసులు ముందుకు సాగుతుందని తుంగతుర్తి ఎస్ఐ క్రాంతి కుమార్ అన్నారు. బుధవారం పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి జిల్లా ఎస్పీ నర్సింహ ఆదేశాల మేరకు నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ ప్రవేశపెట్టిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమాన్ని తుంగతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ రావు సూచనలతో ఎస్ఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో మహిళలు, ఆటో డ్రైవర్లు, చిన్నారుల రక్షణ, ఫోక్సు చట్టాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా నియమాలు, మరియు గంజాయి వ్యతిరేకతపై అవగాహన కల్పించారు. ప్రజలు పోలీస్ స్టేషన్కు రావడానికి భయపడాల్సిన అవసరం లేదని, సమస్య ఏదైనా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. వాహనదారులు హెల్మెట్లు ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని అన్నారు. మహిళలు తమ సమస్యలను స్వేచ్ఛగా పోలీసుల దృష్టికి తీసుకువచ్చేలా స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించడమే పోలీస్ అక్క కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

పోలీసులు కేవలం నేరం జరిగిన తర్వాత స్పందించే వ్యవస్థగా కాకుండా.. ప్రజల సమస్యలను ముందుగానే తెలుసుకుని పరిష్కరించే ప్రజా భరోసా వ్యవస్థగా పనిచేయాలనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు

## పేదల సొంతింటి కల సాకారం..

### వచ్చే దసరా నాటికి మొదటి దశ ఇందిరమ్మ ఇళ్లు పూర్తి

### ఐటీ, పరిశ్రమలు, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టీకరణ



**హైదరాబాద్,అక్టోబర్14(మనం న్యూస్)ః** పేదవాడి కన్నీళ్లు తుడిచి, ఆత్మగౌరవంతో కూడిన బతుకునివ్వాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జోరందుకుంది. ఇళ్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వం, మొదటి దశలో కేటాయింపులు జరిగిన ఇందిరమ్మ ఇళ్లను ఏడాదిలోగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని ఐటీ, పరిశ్రమలు, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

గత పాలకుల కాలంలో ఏళ్ల తరబడి పనులు పెండింగ్‌లో పెట్టి పేదలను మోసం చేసిన పరిస్థితి నేడు లేదని, కాలయాపనకు తావులేకుండా వేగంగా పనులు పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఘట్కేసర్ మండలం పోచారంలో 480 మంది లబ్ధిదారులకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎంపీ ఈటెల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఇందిరమ్మ టవర్స్‌కు అవసరమైన రోడ్లు, మంచినీటి సదుపాయం, లిఫ్టులు తదితర అన్ని మౌలిక వసతులను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని మంత్రి లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు.

**ప్రతి హామీ నిలబెట్టుకుంటూ..**

ప్రజలకు ఇచ్చిన ప్రతీ మాటను నిలబెట్టుకుంటూ ముందుకు వెళ్తున్నామని మంత్రి పునరుద్ఘాటించారు. అధికారంలోకి వచ్చిన తక్షణమే ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడంతో పాటు, తెల్ల రేషన్ కార్డుదారులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని మంత్రి గుర్తుచేశారు. ఇళ్లు లేని పేదలను ఊరికో రకంగా కాకుండా, వారి సొంత నియోజకవర్గాల పరిధిలోనే అత్యంత విలువైన ప్రాంతాల్లో ఇందిరమ్మ గృహాలను నిర్మించి ఇస్తున్నామని, పోచారం ప్రాంతంలో ఒక సింగిల్ బెడ్రూమ్ ఫ్లాట్ కొనాలంటే నేడు రూ.40 లక్షల వరకు ఖర్చవుతుందని, అలాంటిది కేవలం రూ.6 లక్షలు భరిస్తే అంతకంటే ఎంతో విలువైన, మెరుగైన ఇళ్లను ప్రభుత్వం నిర్మించి ఇస్తోందని మంత్రి వివరించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఒక పవిత్ర యజ్ఞంలా భుజాన వేసుకున్నారని శ్రీధర్ బాబు కొనియాడారు. ఇళ్ల కేటాయింపుల్లో ఎలాంటి అవినీతికి తావులేకుండా, మానవ ప్రమేయం లేని పారదర్శక లాటరీ పద్ధతి ద్వారా అర్హులను ఎంపిక చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో ఏకంగా 25 లక్షల ఇళ్లను నిర్మిస్తున్నామని, అర్హత ఉండి ఇల్లు లేని ప్రతి ఒక్క పేదవాడికి దశలవారీగా ఇందిరమ్మ గృహాలను అందిస్తామని శ్రీధర్ బాబు ఉద్ఘాటించారు.

## స్త్రీనిధి రుణాల రికవరీ, క్రెడిట్ పంపిణీలో మరింత పురోగతి సాధించాలి

- వెనుకబడిన మండలాలు, సీసీల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- దసరాలోపు పంపిణీ, డేటా ఎంట్రీ ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట అక్టోబర్ 14 (మనం న్యూస్):** స్త్రీనిధి రుణాల రికవరీ, క్రెడిట్ పంపిణీ, స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన లక్ష్యాల సాధనలో మరింత పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. వెనుకబడిన మండలాలు, తక్కువ పనితీరు కనబరుస్తున్న కమ్యూనిటీ కోఆర్డినేటర్ల (సీసీ) పనితీరును సమీక్షించి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్త్రీనిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ జిల్లా స్థాయి రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను లక్ష్యాల మేరకు అమలు చేయాలని సూచించారు. జిల్లాలో స్త్రీనిధి రుణాల రికవరీలో ప్రస్తుత పురోగతి సంతృప్తికరంగా ఉన్నప్పటికీ, మరింత మెరుగుదలకు అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. కొన్ని మండలాల్లో రికవరీ తక్కువగా ఉండటాన్ని గుర్తించి, సంబంధిత అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. తక్కువ రికవరీ ఉన్న సంఘాలు, ప్రాంతాలను గుర్తించి లక్ష్యిత విధానంలో రికవరీ పెంచాలని సూచించారు. ప్రతి వారం మండలాల వారీగా పురోగతిని సమీక్షిస్తూ, ప్రతి నెలా సీసీల పనితీరును అంచనా వేయాలని ఆదేశించారు. పనితీరులో అధిక వ్యత్యాసాలు ఉన్న సీసీలు తమ పనితీరును విశ్లేషించుకుని మెరుగుపరచుకోవాలని సూచించారు. నిర్దేశిత సమయంలో పురోగతి సాధించని వారి పనితీరును తిరిగి సమీక్షించి, అవసరమైన చర్యలకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. రాబోయే మూడు నెలల్లో జిల్లాలో సాధ్యమైనంత ఎక్కువ రుణ రికవరీ సాధించేలా కృషి చేయాలని పేర్కొన్నారు. స్త్రీనిధి క్రెడిట్ పంపిణీలో సాధించిన పురోగతిని కొనసాగిస్తూ, అక్టోబర్ నెలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నెలవారీ, వార్షిక లక్ష్యాలను గడువులోగా సాధించాలన్నారు. ఇతర రుణాల పంపిణీకి సంబంధించిన అంశాల్లోనూ పురోగతి పెంచాలని ఆదేశించారు. దసరాలోపు పంపిణీ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయడంతో పాటు, డేటా ఎంట్రీని ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను ఉన్నత స్థాయిలో పర్యవేక్షిస్తున్నందున అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో వీఓ భవనాల నిర్మాణానికి మంజూరైన ప్రతిపాదనలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. భవన నిర్మాణాలకు అవసరమైన భూములను గుర్తించి, సంబంధిత గ్రామపంచాయతీల తీర్మానాలతో ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. భూముల గుర్తింపు, అనుమతులు, నిర్మాణ పనుల ప్రారంభంలో ఎలాంటి జాప్యం జరగకుండా ఏపీఎంలు, సీసీలు, సంబంధిత డీపీఎంలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. వచ్చే మార్చి నాటికి జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో వీఓ భవనాలు అందుబాటులోకి వచ్చేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గోడౌన్లు, భవనాలు, ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణాలకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత అధికారులు నిర్మాణ పనుల ప్రారంభం, పురోగతి, పూర్తి స్థాయిపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. రాబోయే ఒకటి నుంచి రెండు నెలల్లో పనుల్లో గణనీయమైన పురోగతి కనిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా పనితీరును నెల రోజుల తర్వాత మరోసారి సమీక్షిస్తామని, అప్పటివరకు వెనుకబడిన ప్రాంతాలు, సిబ్బంది తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి వెంకట్ రాములు, ఎల్ డీ ఎం సురేష్ ఆత్రేయ, మున్సిపల్ కమిషనర్ శంకర్, జిల్లా మహిళా సమాఖ్య సభ్యురాలు, స్త్రీనిధి సిబ్బంది, ఏపీఎంలు, సీసీలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు..

## శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క..



**ఏటూరునాగారం, అక్టోబర్ 14(మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు బుధవారం హైదరాబాద్లోని ప్రజాభవన్లో అత్యంత వైభవంగా జరిగాయి. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) సమక్షంలో, ఆమె ఆధ్వర్యంలో శ్రీనివాస్ యాదవ్తో కేక్ కటింగ్ చేయించారు. ఈ సందర్భంగా వసంత శ్రీనివాస్ యాదవ్ను మంత్రి సీతక్క శాలువాతో ప్రత్యేకంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ముమ్ముందు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘుతో పాటు పార్టీ నాయకులు ఎండి గౌస్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొని శ్రీనివాస్ యాదవ్కు శుభాకాంక్షలు తెలిపారు.

# మహిళల ఆర్థిక వికాసమే కాంగ్రెస్ ధ్యేయం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**దుగ్గొండి, అక్టోబర్ 14 మనం ప్రతినిధి:** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని కేశవపురం గ్రామంలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవనం, రూ.20 లక్షలతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు.అలాగే లక్ష్మీపురం తోగరాయి,గుడ్డెల్లగలపల్లె, గ్రామాల్లో రూపాయలు 10 లక్షల వ్యయంతో ఒక్కో మహిళ సంఘాల భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే దంతి మాధవరెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళల అభ్యున్నతి, ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా స్థిరపడి కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. నూతన మహిళా భవనాల నిర్మాణంతో సమాఖ్య సమావేశాలు, స్వయం ఉపాధి శిక్షణలకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

### ఇచ్చే హామీల అమలుకే ప్రాధాన్యం

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంపై తీవ్ర అప్పుల భారం, వడ్డీల చెల్లింపుల ఒత్తిడి ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికల వేళ ప్రజలకిచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఇప్పటికే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రూ.500 కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు రూ.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల పథకాలను నిబద్ధతతో అమలు చేస్తున్నామని వివరించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణంతో పరిపాలన మరింత సులభతరమై, ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగవంతంగా అందుతాయని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్వో సమ్మక్క, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వివిధ సొసైటీల చైర్మన్లు తోకల శ్రీనివాసరెడ్డి, ముత్యాల కుమారస్వామి గౌడ్,చెన్నూరి కిరణ్ రెడ్డి,ఇంగోలే రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.కేశవపురం,సర్పంచ్ బాదరగాని రమా రమేష్, ఉపసర్పంచ్ గుత్తూరి సరిత, లక్ష్మీపురం సర్పంచ్ కన్నం అలిమా చిరంజీవి, ఉపసర్పంచ్ అంబీరా మహేష్, డైరెక్టర్ అంబరగొండ రాజేశ్వర్ రావు, గుడ్డెల్లగలపల్లి సర్పంచ్ జంగిలి రాజు, ఉపసర్పంచ్ తొగురు రవి పటేల్, తొగర్రాయి సర్పంచ్ రాచ రమ చేరాలు,కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఒలిగే నర్సింగారావు,సర్పంచ్ లు ఇతర గ్రామాల సర్పంచ్లు పెండ్లి వెంకటేశ్వర్లు,శ్రీనివాస్ రెడ్డి,మండల నాయకులు పొగాకు వెంకటేశ్వర్లు గౌడ్,బూర హేమచంద్ గౌడ్,శోభన్ బాబు, ఏడేళ్లి శ్రీనివాస్ రెడ్డి, జంగిలి రవి,తడుక కొమురయ్య గౌడ్,అమ్మ రోహిత్, తోటకూరి సురేష్,శివాజీ,భరత్ రెడ్డి,సుమంత్,ప్రతీష్, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సంబరాలు



**భూపాలపల్లి అక్టోబర్ 14(మనం న్యూస్):** సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రకటన తో కార్మికులు సంబరాలు జరుపుకున్నారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించగా, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. సింగరేణి కార్మికులకు బోనస్, కారుణ్య నియామకాలు, గృహ వసతి, వైద్య సదుపాయాలు, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కార్మికులకు ఉపయోగపడ తాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యతనిస్తూ, వారికి ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు జీసింగరేణి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




## సింగరేణి కార్మిక గర్జనకు తరలిన గులాబీ దండు

**భూపాలపల్లి అక్టోబర్ 14 మనం న్యూస్:** నల్లబంగారంగా పేరుగాంచిన సింగరేణి సంపదను కొల్లగొడుతూ, కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అధ్యక్షతన గోదావరిఖనిలో నిర్వహిస్తున్న సింగరేణి కార్మిక గర్జన కార్యక్రమానికి బుధవారం నాడు భూపాలపల్లి నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి టిబిజికేఎస్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు,యువత గోదావరిఖనికి బయలుదేరారు. సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం, కార్మికులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్మిక గర్జన కార్యక్రమానికి భూపాలపల్లి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లడం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

## ఈ నెల 15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు

## ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి



**ములుగు, అక్టోబర్ 14, మనం ప్రతినిధి:** ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి సూచించారు. బుధవారం ములుగు ఆర్డీవో కార్యాలయంలోని తన ఛాంబర్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026, వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియలపై చర్చించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులు, ముఖ్యంగా 18 నుంచి 19 ఏళ్ల యువత ఓటరు నమోదుకు ముందుకు రావాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీల బూత్ఛాయి ఏజెంట్లు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడాలని సూచించారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా అనుసంధానం కాని ఓటర్ల వివరాలు, అసంగతతలున్న నమోదులకు సంబంధించి 41,900 నోటీసులు రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 41,764 నోటీసులను అందజేశామని, మిగిలిన నోటీసులను రాబోయే వారం పది రోజుల్లో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 17న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాపై అక్టోబర్ 7 వరకు దరఖాస్తులు, అభ్యంతరాలు స్వీకరించినట్లు వివరించారు. ఫారం-6 ద్వారా 748, ఫారం-7 ద్వారా 13, ఫారం-8 ద్వారా 803 దరఖాస్తులు అందాయని తెలిపారు. వీటిపై విచారణ చేపట్టి, అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించిన అర్హుల దరఖాస్తులను ఆమోదించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు చెప్పారు. అందిన దరఖాస్తులు, అభ్యంతరాల జాబితాలను సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటరు నమోదుకు సంబంధించి ఫారం-18 ద్వారా అంతర్జాలంలో 4,186 దరఖాస్తులు, నేరుగా 6 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.

అంతర్జాలంలో అందిన దరఖాస్తుల్లో 47 దరఖాస్తులను ఆమోదించామని, మిగిలిన వాటిని నిర్ణీత సమయంలో విచారించి తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఓటర్ల జాబితా ప్రక్రియపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్లు గణపతి, నితీష్, సంబంధిత సిబ్బంది, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాటారం సిఐ బదిలీ

**కాటారం, అక్టోబర్ 14 మనం న్యూస్:** కాటారం సర్కిల్ సీఐ నాగార్జునరావు బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం మల్టీ జోన్-1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి పలువురు సర్కిల్ ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా కాటారం సీఐని బదిలీ చేసి హైదరాబాదులోని ఐజి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు పేర్కొన్నారు. అదేవిధంగా రామగుండం కమిషనరేట్ పరిధిలో సిఎస్పి విభాగంలో పనిచేస్తున్న భీమేష్ను కాటారం సీఐగా నియమిస్తూ అదే ఉత్తర్వుల్లో తెలిపారు. కాగా కాటారం సీఐగా నాగార్జునరావు విధి నిర్వహణలో తనదైన ముద్ర వేసుకున్నారు. సర్కిల్ పరిధిలో నేర నియంత్రణ, శాంతిభద్ర తల పరిరక్షణ, గంజాయి, గుడుంబా, మత్తు పదార్థాల నివారణ వంటి అంశాల్లో కృషిచేసి ప్రజల మన్ననలను పొందారు.

# బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి



**ములుగు, ఆగస్టు 14,మనం ప్రతినిధి:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి అన్నారు. బుధవారం ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్లో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాల పోస్టర్ను జిల్లా అధికారులతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, పూల సంబరాలకు, మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ పండుగ విశిష్టతను భావితరాలకు తెలియజేస్తూ, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ సంస్కృతి, ఐక్యతను చాటిచెప్పే బతుకమ్మ ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. తేది.16.10.2026 శుక్రవారం మధ్యాహ్నం 2గంటల నుంచి ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాల్లో మహిళా ఉద్యోగులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆయా శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు ఉత్సవాల్లో పాల్గొనేందుకు అనుమతిస్తూ, వారి భాగస్వామ్యాన్ని నిర్ధారించాలని జిల్లా అధికారులకు సూచించారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు సంపత్ రావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు, బాలికల భద్రతకు నిర్భయ నిధి కింద ములుగు జిల్లా ఎంపిక

### న్యూఢిల్లీ సమీక్షా సమావేశానికి హాజరైన కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు,అక్టోబర్ 14,మనం ప్రతినిధి:** మహిళలు, బాలికల భద్రత, రక్షణ, సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ సురక్షితమైన సమగ్ర పట్టణాల అభివృద్ధి కోసం చేపట్టనున్న ప్రయోగాత్మక ప్రాజెక్టుకు నిర్భయ నిధి కింద ములుగు జిల్లా ఎంపికైంది. ఈ ప్రాజెక్టు అమలు, కార్యాచరణ ప్రణాళికపై కేంద్ర మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బుధవారం న్యూఢిల్లీలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు. సమావేశంలో ప్రాజెక్టు అమలుకు అవసరమైన ప్రణాళికలు, వివిధ శాఖల భాగస్వామ్యం, మౌలిక సదుపాయాల కల్పన, మహిళలు, బాలికల భద్రతకు చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో ప్రతిపాదిత కార్యక్రమాలు, సంబంధిత శాఖల సమన్వయం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ ప్రాజెక్టు ద్వారా మహిళలు, బాలికలకు సురక్షితమైన ప్రజా ప్రదేశాలను అభివృద్ధి చేయడంతో పాటు, వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. సమాన అవకాశాలు, సౌకర్యవంతమైన వాతావరణం కల్పిస్తూ వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సాహం అందించనున్నారు. భద్రతపై అవగాహన కార్యక్రమాలు, మహిళల సాధికారత, ప్రభుత్వ శాఖల సమన్వయానికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మహిళా ఉద్యోగులు, అసంఘటిత రంగాల్లో పనిచేసే మహిళలు తమ సమస్యలు, అభివృద్ధి ప్రణాళికలు, విజయాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకునేందుకు అనువైన వేదికను కల్పించే అంశాన్ని కూడా ప్రాజెక్టు ప్రణాళికలో పరిశీలించనున్నారు. ఇందుకోసం 'నిర్భయ సదన్' వంటి ప్రతిపాదిత కార్యక్రమాలను పరిశీలించనున్నారు. ములుగు జిల్లా ఈ ప్రాజెక్టుకు ఎంపిక కావడం మహిళలు, బాలికల భద్రత, గౌరవం, స్వావలంబనకు దోహదపడనుంది. సంబంధిత శాఖల సమన్వయంతో ప్రాజెక్టును సమర్థవంతంగా అమలు చేసి, మహిళలు, బాలికలకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేయనుంది. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఇ.పి. ప్రేమలత పాల్గొన్నారు.



## శంఖవరం నుంచి విజయవాడకు 15 మంది భవానీల పాదయాత్ర ప్రారంభం

**శంఖవరం, అక్టోబరు 14 మనం ప్రతినిధి:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం గ్రామానికి చెందిన 15 మంది భవానీ భక్తులు విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనార్థం బుధవారం పాదయాత్ర ప్రారంభించారు. గురు భవాని మొగలి కామేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఈ పాదయాత్రను చేపట్టారు.

భవానీ దీక్షలో భాగంగా అమ్మవారిపై అపారమైన భక్తివిశ్వాసంతో బయలుదేరిన భక్తులు, పాదయాత్రలో అమ్మవారి నామస్మరణ చేస్తూ తమ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని కొనసాగించనున్నారు. నియమనిష్ఠలు, ఆధ్యాత్మిక చింతనతో సాగనున్న ఈ యాత్ర ద్వారా కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకోవాలని భక్తులు సంకల్పించారు.

# కాటారం తహసీల్దార్ కార్యాలయంలో ఘోరం

## కూలిన సీలింగ్...తప్పిన పెను ప్రమాదం

**కాటారం, అక్టోబర్ 14 మనం న్యూస్:** భూపాలపల్లి జిల్లా కాటారం మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఉదయం ఘోరం చోటు చేసుకుంది. తృటిలో పెను ప్రమాదం తప్పింది. కార్యాలయంలో గల తహసీల్దార్ చాంబర్ లోని పైకప్పు సీలింగ్ ఒక్కసారిగా భారీ శబ్దంతో కుప్పకూలింది. ఉదయం 10 గంటల ప్రాంతంలో కార్యాలయం తెరిచే సమయానికి కొంత సమయం ముందే ఈ ఘటన చోటు చేసుకోవడంతో తహసీల్దార్ తో పాటు సిబ్బంది అదృష్టం కొద్దీ ప్రమాదం నుంచి బయటపడ్డారు. గతంలో కురిసిన వర్షాలకు భవనం పైకప్పు పూర్తిగా తడిసి ముద్దయింది. దీంతో స్లాబ్ నుండి సిమెంట్ పెచ్చులు ఊడి సీలింగ్ పై పడి, బరువును తట్టుకోలేక సీలింగ్ మొత్తం నేలకూలింది.

### భయాందోళనలో సిబ్బంది..

ఉదయం విధులకు హాజరైన సిబ్బంది చాంబర్ తలుపులు తెరిచి చూసేసరికి లోపలంతా సీలింగ్ శిథిలాలు, విరిగిపడిన ఫ్యాన్లు, ధ్వంసమైన ఫర్నిచర్ తో భీతావహంగా కనిపించింది. ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఒకవేళ కార్యాలయ సమయంలో ఈ ఘటన జరిగి ఉంటే తహసీల్దార్ తో పాటు ఫిర్యాదుల కోసం వచ్చే రైతులు, ప్రజలు తీవ్రంగా గాయపడేవారని, ప్రాణ నష్టం కూడా జరిగేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



### నిర్మాణంలో నాణ్యత లోపం..

దశాబ్ద కాలలపాటు సురక్షితంగా నిలవాల్సిన ప్రభుత్వ భవనాలు నాణ్యత లోపాల కారణంగా అతి తక్కువ కాలంలోనే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో జరిగిన ఘటన దీనికి నిదర్శనంగా నిలుస్తుంది. కార్యాలయ భవనం నిర్మించి దశాబ్ద కాలం దాటగానే నిర్మాణ నాణ్యత లోపం బయటపడింది. నిర్మాణ సమయంలో సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు అలసత్వం వహించడం మూలంగానే భవనం నాసిరకం కట్టడంగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పూర్తిగా పరిశీలించి, మరమ్మత్తులు చేపట్టాలని, సిబ్బంది, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలని రైతులు, ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

# నేను బాగానే ఉన్నా..

## నన్నుబాధపెట్టకండి: గౌతంరాజు



ట్రాలీవుడ్ సీనియర్ నటుడు, కమెడియన్ గౌతమ్ రాజు అభిమానులకు విజ్ఞప్తి చేశారు. తాను ప్రస్తుతం చాలా ఆరోగ్యంగానే ఉన్నానని గౌతమ్ రాజు తెలిపారు. నటుడిగా వందల సినిమాల్లో నటించానని వెల్లడించారు. నా గురించి కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నన్ను బాధపెట్టేలా వార్తలు రాశారని గౌతమ్ రాజు అన్నారు. నేను కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నానని రాశారు. దయచేసి ఇలాంటి అవాస్తవాలు ప్రచారం చేయవద్దని ఆయన కోరారు. నా కెరీర్ లో నటుడిగా చెప్పుకోవడానికి నా దగ్గర వందల సినిమాలు ఉన్నాయని కూడా వెల్లడించారు.

కాగా.. గౌతమ్ రాజు నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్గా, కమెడియన్ గా కొన్ని వందల సినిమాలు చేశారు. అగ్ర హీరోల చిత్రాల్లో తనదైన హవాభావాలతో, నటనతో ఆకట్టుకున్నారు. ప్రస్తుతం సినిమాలు చేయకపోయినా.. సీరియల్స్ లో కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్యంపై రూమర్స్ రావడంతో సోషల్ మీడియాలో స్పందించారు. తాను 200లకు పైగా సినిమాల్లో నటించానని గౌతమ్ రాజు వెల్లడించారు. ఘరానా మొగుడు, వినోదం, ప్రేమకు వేళాయెరా లాంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించానని గుర్తుచేశారు.

తాను ఏ పత్రికకు ఎలాంటి ఇంటర్వ్యూ ఇవ్వలేదని గౌతమ్ రాజు తెలిపారు. తనపై వచ్చిన వార్తను చూసి స్నేహితులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఎవరికైనా అనారోగ్యం వస్తే వారిని చూసి జాలిపడటమే కాకుండా.. వీలైతే సహాయం చేయాలని అన్నారు. అయితే, తాను ఆరోగ్యంగానే ఉన్నానని, సంతోషంగా జీవితాన్ని కొనసాగిస్తున్నానని స్పష్టం చేశారు. తన గురించి తప్పుడు కథనాలు రాయొద్దని.. సోషల్ మీడియా ప్రతినిధులను కోరారు.

# విండీస్దే నాలుగో టీ20

- కీమో పాల్ 'ఫైఫర్'..



హైదరాబాద్ వేదికగా జరిగిన నాలుగో టీ20 మ్యాచ్ లో భారత్ పై వెస్టిండీస్ విజయం సాధించింది. కీమో పాల్ ఐదు వికెట్ల ప్రదర్శనతో విండీస్ గెలుపులో కీలక పాత్ర పోషించాడు. దీంతో ఐదు టీ20ల సిరీస్ లో ఇరు జట్లూ 2-2తో సమంగా నిలిచాయి. చివరి మ్యాచ్ బెంగళూరు వేదికగా అక్టోబర్ 17న (శనివారం) జరగనుంది.

ఉప్పల్లో టాస్ ఓడిన విండీస్ తొలుత బ్యాటింగ్ చేసింది. కెప్టెన్ షై హోప్ (102₹) సెంచరీ సాధించాడు. దీంతో విండీస్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో భారత్ 223 పరుగులే చేయగలిగింది. విండీస్ బౌలర్ కీమో పాల్ (5/41) ఫైఫర్ దెబ్బకు టీమ్ఇండియా బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు. సంజు శాంసన్ (56) హాఫ్ సెంచరీ సాధించాడు. తిలక్ వర్మ (43), నితీశ్ కుమార్ రెడ్డి (41) కాసేపు పోరాడారు.

# ఒకే ఓవర్లో 5 వికెట్లు

- సౌతాఫ్రికా బౌలర్ సంచలనం..



సౌతాఫ్రికా యువ ఫాస్ట్ బౌలర్ చాడ్ లేకాక్ టీ20 క్రికెట్ లో సంచలనం సృష్టించాడు. ఒకే ఓవర్ లో ఐదు వికెట్లు తీసి అరుదైన ఘనత సాధించాడు. ఇఖిఅ ప్రో20 కప్ 2026లో భాగంగా అక్టోబర్ 13న టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో నాటల్ ఇన్లాండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఈ రికార్డు ప్రదర్శన చేశాడు.

ఈ మ్యాచ్ లో లేకాక్ తన కోటా 4 ఓవర్లలో 26 పరుగులిచ్చి ఏకంగా 6 వికెట్లు పడగొట్టాడు. ఇఖిఅ ప్రో20 కప్ చరిత్రలో ఇవే అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు. యావత్ సౌతాఫ్రికా టీ20 క్రికెట్ చరిత్రలో ఒకే ఓవర్లో ఐదు వికెట్లు తీసిన తొలి బౌలర్ గానూ లేకాక్ రికార్డు నెలకొల్పాడు. ప్రపంచ టీ20 క్రికెట్ లో ఈ ఘనత సాధించిన ఐదో బౌలర్ గా నిలిచాడు.

టైటాన్స్ ఇన్నింగ్స్ 19వ ఓవర్ లో లేకాక్ విశ్వరూపం ప్రదర్శించాడు. తొలి నాలుగు బంతులు, ఆతర్వాత ఆరో బంతికి వికెట్ తీసి టైటాన్స్ ఇన్నింగ్స్ ను తలకిందులు చేశాడు. 19వ ఓవర్ కు ముందు 4 వికెట్లకు 193 పరుగులతో పటిష్ఠంగా ఉన్న ఆ జట్టు.. ఓవర్ ముగిసేసరికి 9 వికెట్లకు 195 పరుగులకే పరిమితమైంది.

2003లో జన్మించిన లేకాక్ సౌతాఫ్రికా దేశవాళీ క్రికెట్ లో క్వాజులు-నాటల్ ఇన్ లాండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ అయిన లేకాక్ ఈ రికార్డు ప్రదర్శనకు ముందు 15 టీ20ల్లో కేవలం రెండు వికెట్లు మాత్రమే తీశాడు. అలాంటి ఆటగాడు ఒకే మ్యాచ్ లో ఆరు వికెట్లు పడగొట్టి అందరి దృష్టిని ఆకర్షించాడు. లేకాక్ ఇప్పటివరకు సౌతాఫ్రికా జాతీయ జట్టుకు ఆడలేదు. స్వదేశంలో జరిగే ఎస్ఏ20 లీగ్ లోనూ అవకాశం లభించలేదు. ఈ ప్రదర్శన తర్వాత లేకాక్ పై ఎస్ఏ20 లీగ్ ఫ్రాంచైజీలు కన్నేయవచ్చు.

# ఎస్ఆర్హెచ్లోకి స్టార్ ప్లేయర్ రీఎంట్రీ



ఐపీఎల్ లో కీలక ట్రేడ్ జరిగింది. ఢిల్లీ క్యాపిటల్స్ కు ప్రాతినిధ్యం వహిస్తున్న లెఫ్ట్ ఆర్మ్ పేసర్ టి. నటరాజన్ సన్ రైజర్స్ హైదరాబాద్ లోకి రీఎంట్రీ ఇచ్చాడు. మరోవైపు సన్రైజర్స్ లెగ్ స్పిన్నర్ జీషన్ అన్సారీ ఢిల్లీ క్యాపిటల్స్ కు వెళ్లిపోయాడు. ఎస్ ఆర్ హెచ్-ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ఆటగాళ్ల ట్రేడ్ ను ఐపీఎల్ అధికారికంగా ప్రకటించింది.

**నటరాజన్ రీఎంట్రీ**

నటరాజన్ 2020 నుంచి 2024 వరకు ఐదు సీజన్ల పాటు సన్ రైజర్స్ హైదరాబాద్ కు ప్రాతినిధ్యం వహించాడు. ఈ సమయంలో అతడు జట్టు విజయాల్లో క్రియాశీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా 2024 ఐపీఎల్ సీజన్ లో 19 వికెట్లు పడగొట్టి, ఆ సీజన్ లో సన్ రైజర్స్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా నిలిచాడు. అలాగే ఆ సీజన్ లో ఎస్ ఆర్ హెచ్ ను ఫైనల్ కు చేర్చడంలోనూ కీలకంగా వ్యవహరించాడు.

2025 ఐపీఎల్ ఆటగాళ్ల వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ నటరాజన్ ను రూ.10.75 కోట్లకు కొనుగోలు చేసింది. ఇప్పుడు ట్రేడ్ లో భాగంగా అతడు రూ.5 కోట్ల సవరించిన ఫీజుతో తిరిగి సన్ రైజర్స్ హైదరాబాద్ కు చేరనున్నాడు.

**ఢిల్లీ క్యాపిటల్స్ లోకి జీషన్ అన్సారీ**

లెగ్ స్పిన్నర్ జీషన్ అన్సారీ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో చేరనున్నాడు. 2025 ఐపీఎల్ సీజన్ లో సన్రైజర్స్ హైదరాబాద్ తరపున 10 మ్యాచ్ లు ఆడిన అతడు ఆరు వికెట్లు పడగొట్టాడు. ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్ లోనే ఐపీఎల్ అరంగేట్రం చేసి మూడు వికెట్లు తీశాడు. 26 ఏళ్ల అన్సారీ తన ప్రస్తుత ఫీజు రూ.40 లక్షలతోనే ఢిల్లీ క్యాపిటల్స్ కు మారనున్నాడు. అతడి చేరికతో ఢిల్లీ జట్టు స్పిన్ బౌలింగ్ విభాగానికి మరింత బలం చేకూరనుంది.

# అందుకే అందరూ రజనీకాంత్ని ఇష్టపడతారు: విద్యాబాలన్

ఎంత స్టార్ డమ్ ఉన్నప్పటికీ రజనీకాంత్ చాలా సింపుల్ గా ఉంటారని నటి విద్యాబాలన్ అన్నారు. అలా ఉండడం వల్లే ఆయన చాలామందికి నచ్చుతారని తెలిపారు. రజనీకాంత్ ప్రధానపాత్రలో నటించిన 'జైలర్ 2' అక్టోబర్ 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన విద్యాబాలన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. రజనీకాంత్ తో కలిసి వర్క్ చేసిన అనుభవాన్ని పంచుకున్నారు.



''రజనీకాంత్ నుంచి నేర్చుకోవడానికి, మన జీవితంలో అలవర్చుకోవడానికి చాలా విషయాలు ఉన్నాయి. ఆయనలో ఎలాంటి ఆర్భాటం ఉండదు. సామాన్యుడిలా ఉంటారు. ప్రేక్షకులు ఆయన్ని ఇంతగా ప్రేమించడానికి కారణం కూడా అదే. అలాంటి లెజెండ్ తో కలిసి పనిచేసే అవకాశం రావడం నాకు ఎంతో ఆనందంగా అనిపించింది. ఏమాత్రం ఒత్తిడి లేకుండా వర్క్ చేశా. ఒకవేళ ఆందోళనగా ఉన్నా, ఆయన తన మాటలతో దాన్ని తగ్గించేస్తారు. అందరినీ చిరునవ్వుతో పలకరిస్తారు. ప్రతి ఒక్కరినీ అభినందిస్తూ ప్రోత్సహిస్తారు'' అని విద్యాబాలన్ తెలిపారు.

**సిగరెట్ సన్నివేశం భయపడ్డా..**

ఇక 'జైలర్ 2'లో ఒక సన్నివేశం షూట్ చేసేటప్పుడు తాను భయపడినట్లు విద్యాబాలన్ తెలిపారు. రజనీకాంత్ ముఖంపై సిగరెట్ పొగ వదిలే సీన్ గురించి మాట్లాడారు. ''ఆ సన్నివేశానికి ఒక్కరోజు ముందు నాకు ఒకటిన్నర పేజీల కొత్త డైలాగులు ఇచ్చారు. ఆ డైలాగులు చెబుతూనే సిగరెట్ కూడా కాల్చాలి. దాన్ని ఎలా చేస్తానో అని భయపడ్డాను'' అని నటి తెలిపారు. ఈ సీన్ షూట్ చేసేటప్పుడు విద్యా బాలన్ చేతులు వణకడం తాను గమనించానని నెల్సన్ చెప్పారు.

# ప్రభాస్ గిఫ్ట్ ఇచ్చాడంటే ఇలానే ఉంటుంది

ట్రాలీవుడ్ లో ప్రభాస్ పేరు చెప్పగానే సినిమాల కంటే ముందు అతడిచ్చే ఆతిథ్యమే గుర్తొస్తుంది. ఎందుకంటే భీమవరంకి చెందిన ప్రభాస్.. భోజన ప్రియుడు. ప్రస్తుతం మూవీస్ చేస్తున్నాడు కాబట్టి డైట్ మెంటైన్ చేస్తుంటాడు గానీ లేదంటే మనోడు సినిమా షూటింగ్ అంటే తన ఇంటి నుంచి వచ్చే ఫుడ్ తో టీమ్ కి కడుపు నిండిపోయేలా పంపిస్తుంటాడు. ప్రభాస్ మాత్రం ఈమె సింపుల్ గా సెలబ్రేట్ చేసుకుంది. ప్రభాస్ ఇచ్చిన గిఫ్ట్ ఏంటో తెలుసా? ఆమెకి ఇష్టమైన ఫుడ్ ఐటమ్స్ అన్నీ ఉన్న ఓ పెద్ద బాక్స్. ఇందులో ఏముందో ఈ వీడియోలో చూసేయండి.





# డివోషనల్గా పవర్ఫుల్ బీట్స్తో మ్యాచో స్టార్ 'భరత వర్ష' ఫస్ట్ సింగిల్!

ట్రాలీవుడ్ మ్యాచో స్టార్ గోపీచంద్ హీరోగా రీతూ వర్మ హీరోయిన్ గా జాతీయ అవార్డు గ్రహీత సంకల్ప్ రెడ్డి తెరకెక్కించిన అవైటెడ్ భారీ సినిమానే 'భరత వర్ష'. ఒక సాలిడ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కించిన ఈ సినిమా అప్డేట్స్ ఇపుడు ఒకొకటిగా వస్తున్నాయి. ఇక ఈ సినిమా నుంచి తాజాగా మేకర్స్ ఫస్ట్ సింగిల్ ని లిరికల్ వీడియోగా వదిలారు.

అనుదీప్ దేవ్ సంగీతం అందించిన ఈ మొదటి పాట అమ్మ కదలి వచ్చే అనే సాహిత్యంతో కాంతార టైపు డివోషనల్ అండ్ పవర్ఫుల్ బీట్స్ తో ఒక ట్రాన్స్ లోకి తీసుకెళ్లే విధంగా ఉందని చెప్పవచ్చు. ముఖ్యంగా ఇందులో విజువల్స్ చూస్తుంటే ఒక కొత్త ప్రపంచాన్నే సృష్టించినట్టు కూడా కనిపిస్తుంది. అలాగే ఎక్కువగా లావా, అగ్ని పర్వతపు విజువల్స్ ఎక్కువగా చూపించడం గమనార్హం.


ఇక వీటితో పాటుగా గోపీచంద్ డైనమిక్ ప్రెజెన్స్ తో కనిపిస్తున్నాడు. అలానే రీతూ వర్మ కూడా బ్యూటిఫుల్ లుక్స్ తో కనిపిస్తుంది. సో మొత్తానికి మాత్రం మంచి పాటని విడుదల చేసారని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రానికి శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ వారు నిర్మాణం వహించగా త్వరలోనే రిలీజ్ డేట్ ని ప్రకటించనున్నారు.



# విరోష్ జంట గొప్ప నిర్ణయం.. ఏకంగా 400 కుటుంబాలకు..!

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా జంటగా వస్తోన్న పీరియాడికల్ మూవీ రణబాలి. రాయలసీమలో బ్రిటీశ్ కాలంలో జరిగిన ఆకృత్యాల నేపథ్యంలో ఈ మూవీని తెరకెక్కించారు. దాదాపు కోటిమందికి పైగా ఆకలి చావులతో చనిపోయారని.. ఆనాటి దారుణ పరిస్థితులను ఇందులో చూపించనున్నారు. ఈ సినిమాకు రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

ఈ సంగతి పక్కనపెడితే తాజాగా రష్మిక, విజయ్ దంపతులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ జంట తమ గొప్ప మనసును చాటుకున్నారు. ఏకంగా 400 కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ కుటుంబాలకు మూడు నెలల పాటు సాయం చేస్తామని ప్రకటించారు. అన్నపూర్ణ పేరుతో 400 ఫ్యామిలీస్ కు పౌష్టికహారం అందజేయనున్నట్లు రష్మిక వెల్లడించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. రష్మిక తన ఇన్ స్టాలో రాస్తూ..'మీరు పోషించే పాత్రలలో మిమ్మల్ని ప్రభావితం చేసే అంశాలు కొన్ని ఉంటాయి.. మీలో చాలా మంది 'జయమ్మకి, నాకు మధ్య ఏమైనా పోలికలు ఉన్నాయా?' అని అడుగుతూ ఉంటారు. దానికి నా సమాధానం ఉంది. ఇది ఎల్లప్పుడూ నేనే, ఇది ఆమె కూడా.. మీరు నాపై చూపిస్తున్న ప్రేమకు ప్రతిఫలంగా నేను ఎప్పుడూ ఇలాంటివి చేస్తూనే ఉంటా.. కానీ ఎప్పుడూ ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాను. ఎందుకంటే, నాకు, నా బృందానికి, మాలో కొందరికి తెలిస్తే చాలు అనుకున్నా. కానీ ఇప్పుడు నేను దీని గురించి బయటపెడుతున్నా.. ఎందుకంటే ఇది మిమ్మల్ని, నా ప్రియమైన వారిని, ఇలాంటిది ఏదైనా చేయడానికి ప్రభావితం చేయగలిగితే.. నేను చాలా సంతోషిస్తాను. నేను ఈ రోజు 400 కుటుంబాలను దత్తత తీసుకున్నా. ఒక్కో కుటుంబానికి 3 నెలల పాటు సహాయం చేయాలనుకుంటున్నా. రాబోయే ఒక సంవత్సరం పాటు దీనిని కొనసాగిస్తా. వారు ఆ డబ్బును నిత్యావసరాల కోసం ఆదా చేసి, దానిని తమ భవిష్యత్తును మెరుగ్గా ప్రణాళిక చేసుకోవడానికి ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నా' అంటూ రాసుకొచ్చింది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.